గురువారం
17•10•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 112
• పేజీలు : 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD









అయోధ్య కేసు

బుధవారం అయోధ్య కేసులో సుప్రీంకోర్టు ధర్మాసనం ఎదుట వాదనలు ముగిసిన తర్వాత విజయసంకేతం చూపుతున్న మహంత్ రాందాస్, అయోధ్య వాత్ర్ కమిటీ అధ్యక్షుడు మౌలానా సుహైబ్ ఖాస్మీ

# సుప్రీం తీర్పు రిజర్వ్

మిగిలిన వాదనలను మూడురోజుల్లో లిఖితపూర్వకంగా అందజేయాలి

పిటిషనర్లకు ధర్మాసనం ఆదేశం

40 రోజులపాటు సుదీర్ఘంగా కొనసాగిన రోజువారీ విచారణ

మధ్యవర్తిత్వ కమిటీ నివేదికపై నేడు చర్చించనున్న ధర్మాసనం

నవంబర్ 4 నుంచి 17వ తేదీలోగా తీర్పు వెలువడే అవకాశం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 16:** అయోధ్యలో రామజన్మ భూమి –బాబ్రీ మసీదు వివాదంపై సుప్రీంకోర్టులో వాదనలు ముగిశాయి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) రంజన్ గొగోయ్ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఆధ్వర్యంలో కొనసాగుతున్న రోజువారీ విచారణ బుధవారంతో పూర్తయింది. ఈ కేసులో వాదనలు ముగిశాయని, తీర్పును రిజర్వ్‌లో ఉంచుతున్నామని సీజేఐ రంజన్ గొగోయ్ ప్రకటించారు. ఇకపై ఈ కేసులో ఎలాంటి మధ్యంతర పిటిషన్లను స్వీకరించబోమని స్పష్టం చేశారు. ఇంకా ఏమైనా వాదనలు మిగిలి ఉంటే మరో మూడురోజుల్లో లిఖితపూర్వకంగా అందజేయాలని కక్షిదారులకు సూచించారు. 40 రోజులపాటు జరిగిన వాదోపవాదాలతోపాటు లిఖితపూర్వక వాదనలను సమగ్రంగా విశ్లేషించిన అనంతరం ధర్మాసనం తీర్పును వెలువరించే అవకాశం ఉన్నది. నవంబర్ 17వ తేదీన

› మిగతా 5వ పేజీలో

## మ్యాప్‌ను చింపేసిన న్యాయవాది

అయోధ్య కేసు విచారణ సందర్భంగా సుప్రీంలో వివాదాస్పద ఘటన

న్యాయవాదుల మధ్య వాగ్వాదం

ఆగ్రహం వ్యక్తంచేసిన ధర్మాసనం.. బయటికి వెళ్లిపోతామని జడ్జీల హెచ్చరిక

5

## దరఖాస్తుల కిక్కు

2216 లిక్కర్ షాపులకు 46 వేల దరఖాస్తులు



- అర్ధరాత్రి వరకు కొనసాగిన ప్రక్రియ
- చివరి ఒక్కరోజే 26 వేల అప్లికేషన్లు
- దరఖాస్తుల ద్వారా రూ.920 కోట్ల ఆదాయం
- గతంతో పోలిస్తే రెట్టింపు • రేపు లక్కీ డ్రా

3

| | | |
|---|---|---|
| రాష్ట్రంలో మద్యం దుకాణాలు | : | 2,216 |
| వచ్చిన దరఖాస్తులు | : | 46,000 |
| దరఖాస్తుల ద్వారా సమకూరిన ఆదాయం | : | రూ. 920 కోట్లు |
| రెండేండ్ల కిందట వచ్చిన దరఖాస్తులు | : | 41,119 |
| నాడు దరఖాస్తుల ద్వారా సమకూరిన ఆదాయం | : | రూ. 411.19 కోట్లు |

### 3025 పోస్టుల భర్తీకి టీఎస్‌ఎస్పీడీసీఎల్ నోటిఫికేషన్లు

3




| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారంధర | 73.00 | రిటైల్ లైవ్ | 95.00 |
| డ్రెస్డ్ | 138.00 | స్కిన్‌లెస్ | 157.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 390.00 | రంగారెడ్డి | 390.00 |
| మెదక్ | 390.00 | కరీంనగర్ | 393.00 |
| వరంగల్ | 393.00 | చిల్లరధర | 4.50 |

# రెండ్రోజుల్లో ఫుల్

రోడ్డెక్కిన 6,365 బస్సులు • గ్రామాలకు పల్లెవెలుగు సర్వీసులు

సోమవారంకల్లా ఆర్టీసీ కార్మికులకు వేతనాలివ్వండి • ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ప్రతి డిపోకు ఒక నోడల్ ఆఫీసర్ • సహాయకులుగా ఐదుగురు అధికారులు

కండక్టర్లకు టికెట్ జారీ యంత్రాలు • డిపోల్లో రోజువారీగా పరిశీలన

వీడియోకాన్ఫరెన్స్‌లో రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్

నేడు ఉద్యోగ జేఏసీ సమావేశం • అనంతరం సీఎస్‌కు వినతిపత్రం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ఒకవైపు ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంతో బస్సులు యథావిధిగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి. ఇప్పటివరకు పట్టణ ప్రాంతాల్లో బస్సులు నడవగా.. ఆయా జిల్లాల్లో బుధవారం నుంచి పల్లెవెలుగు బస్సులు గ్రామాలకు వెళుతున్నాయి. కొన్నిచోట్ల షెడ్యూల్ ప్రకారం బస్సులను తిప్పారు. డిపోల్లోని బస్సులన్నీ నడుపాలని ప్రభుత్వం ఆదేశించడంతో.. వీలైనన్ని బస్సులను రోడ్డెక్కించారు. బుధవారం నివేదికల ప్రకారం రాష్ట్రంలో మొత్తం 6,365 బస్సులు తిరిగాయి. ఇందులో ఆర్టీసీకి చెందినవి 4424, అద్దె బస్సులు 1941 ఉన్నట్టు అధికారులు ప్రకటించారు. మొత్తం 6365 బస్సులు నడువగా.. 64.36 శాతంగా నమోదైంది. గురువారం వరకు మరో 10% పెంచేలా చర్యలు చేపట్టారు. రెండురోజుల్లో 100% ఆర్టీసీ బస్సులను నడుపాలని అధికారులు భావిస్తున్నారు. దీనిలో భాగంగా తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్ల నియామకం కొనసాగిస్తున్నారు. బుధవారం 6,365 మంది కండక్టర్లు, 4,424 మంది ప్రైవేట్ డ్రైవర్లు విధులు నిర్వర్తించారు. బుధవారం అత్యధికంగా హైదరాబాద్ పరిధిలో 809, వరంగల్, సిద్దిపేట పరిధిలో 680, మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లాల పరిధిలో 650 చొప్పున బస్సులు తిరిగాయి. గురువారం నుంచి మరిన్ని బస్సులను షెడ్యూల్ ప్రకారం తిప్పనున్నట్లు అధికారులు చెప్తున్నారు. టికెట్ జారీ యంత్రాలను కూడా కండక్టర్లకు ఇవ్వనున్నారు.

**సోమవారంకల్లా వేతనాలివ్వండి: హైకోర్టు ఆదేశం**

ఆర్టీసీ కార్మికుల సెప్టెంబర్ నెల వేతనాల చెల్లింపు సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. సెప్టెంబర్ నెల జీతాలు చెల్లించలేదని కార్మికసంఘాలు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అభినందర్‌కుమార్ షావిలి నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. వేతనాలు ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించింది. వేతనాల విభాగంలో పనిచేసే కార్మికులు కూడా సమ్మెలో ఉండటంతో ఆలస్యమైందని ప్రభుత్వ న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. వేతనాలను సోమవారంకల్లా చెల్లించి, తమకు వివరణ ఇవ్వాలని ఆదేశించిన ధర్మాసనం విచారణను ఈ నెల 21కి వాయిదావేసింది.



బుధవారం వికారాబాద్‌లోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద పల్లెవెలుగు బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

**ప్రతి బస్సును నడపాలి : మంత్రి పువ్వాడ**

ఆర్టీసీ పరిధిలోని ప్రతి బస్సును నడుపాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బస్‌డిపోల్లో కండిషన్‌లో ఉన్న ఆర్టీసీ బస్సులు, ఆర్టీసీ అద్దెబస్సులన్నీ నడిపించాలని, దీనికోసం తాత్కాలిక డ్రైవర్లను నియమించుకోవాలని సూచించారు. సమ్మెతో ఇబ్బందులు లేవని పేర్కొన్నారు. సమ్మె నేపథ్యంలో తాజా పరిస్థితులు, జిల్లాల్లో బస్సులు తిప్పడంపై ఖైరతాబాద్ రవాణాశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి మంత్రి అజయ్ అన్ని జిల్లాల అధికారులు, డిపో మేనేజర్లు, ప్రాంతీయ నిర్వహణ అధికారులు, డివిజనల్ మేనేజర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి జిల్లాలో, ప్రతి డిపోలో ఉన్న బస్సులు, ప్రస్తుతం ఎన్ని బస్సులు నడిపిస్తున్నారు, అందుబాటులో ఉన్న కండక్టర్లు.. తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని డిపోల్లో 100% బస్సులు నడుపాలని చెప్పారు. ప్రస్తుతం కొన్ని డిపోల్లో బస్సులన్నీ

› మిగతా 2వ పేజీలో

# పేదరికం తగ్గింది




ప్రపంచ బ్యాంక్
- గత 15 ఏండ్లలో భారత్ వృద్ధిరేటు 7% దాటింది
- 23 కోట్లమందికి సరైన విద్యుత్ సదుపాయం లేదు

అంతర్జాతీయ సంస్థలు
- ప్రపంచ ఆకలి సూచిలో మనది 102వ ర్యాంకు!
- నేపాల్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ కన్నా అధ్వానం

**భారత్‌లో** పేదరికం సగానికి తగ్గిందని, వృద్ధిరేటు గత 15 ఏండ్లలో ఏడు శాతాన్ని దాటిందని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. మానవాభివృద్ధి అంశాలలో భారత్ ఎంతో మెరుగుపడిందని, త్వరలోనే సంపూర్ణ పేదరిక నిర్మూలన సాధించగలదని పేర్కొంది. అభివృద్ధి పథంలో సాగుతున్న భారత్ సవాళ్లను కూడా గణనీయంగా ఎదుర్కొంటున్నదని తెలిపింది. దేశంలో ఇంకా 23 కోట్ల మందికి సరైన విద్యుత్ సదుపాయం లేదని, ఏటా 1.3 కోట్ల మంది నిరుద్యోగులు పుట్టుకొస్తున్నా 30 లక్షల ఉద్యోగాలు మాత్రమే వారికి కొత్తగా అందుబాటులోకి వస్తున్నాయని పేర్కొంది. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు రంగానికి దీటుగా తీర్చిదిద్దాలని సూచించింది. మరోవైపు భారత్‌లో ఆకలితో అలమటిస్తున్న వారి సంఖ్య పెరిగిందని, ప్రపంచ ఆకలి సూచి (జీహెచ్‌ఐ)లో భారత్ 102వ స్థానానికి దిగజారిందని రెండు అంతర్జాతీయ సంస్థలు రూపొందించిన నివేదికలో వెల్లడైంది. నేపాల్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ కన్నా భారత్‌లోనే అన్నార్తుల సంఖ్య ఎక్కువ అని ఆ నివేదిక తెలిపింది.

5



ఏపీలోని చిత్తూరు జిల్లా వరదాయపాలెంలో కల్కి ప్రధాన ఆశ్రమం వద్ద పోలీసు బందోబస్తు

- కల్కి కుమారుడి కార్యాలయాల్లోనూ తనిఖీలు
- దేశవ్యాప్తంగా 40 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు
- వందల కోట్ల అక్రమాస్తుల గుర్తింపు!

# కల్కి ఆశ్రమాలపై ఐటీ దాడులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ, అక్టోబర్ 16:** వివాదాస్పద ఆధ్యాత్మికవేత్త కల్కి భగవాన్ ఆశ్రమాల్లో ఆదాయం పన్ను శాఖ అధికారులు బుధవారం విస్తృత సోదాలు నిర్వహించారు. కల్కి భగవాన్ కుమారుడు కృష్ణ, ఆయన వ్యాపార భాగస్వాముల కార్యాలయాలపైనా దాడులు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడులోని ఆశ్రమ కార్యాలయాలతోపాటు దేశవ్యాప్తంగా 40 ప్రాంతాల్లో ఏకకాలంలో ఈ తనిఖీలు నిర్వహించారు. ఏపీలో చిత్తూరు జిల్లా వరదాయపాలెంలోని కల్కి ప్రధాన ఆశ్రమం 'గోల్డెన్ సిటీ'లోనూ సోదాలు కొనసాగాయి. చెన్నై నుంగబాకం కార్యాలయంలో కల్కి కుమారుడు కృష్ణ, కోడలు ప్రీతిని ఐటీ అధికారులు విచారించినట్లు తెలిసింది. తనిఖీలు చేపట్టిన సమయంలో కల్కి భగవాన్, ఆయన భార్య పద్మావతి

› మిగతా 6వ పేజీలో

## నేడు హుజూర్‌నగర్‌లో సీఎం కేసీఆర్ సభ

మధ్యాహ్నం రెండు గంటలకు..

సభకోసం సర్వం సిద్ధంచేసిన టీఆర్‌ఎస్ శ్రేణులు

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు, ఉప ఎన్నిక ఇంచార్జి



సీఎం కేసీఆర్ బహిరంగ సభ కోసం ముస్తాబవుతున్న వేదిక

**సూర్యాపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ముఖ్యమంత్రి, టీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గురువారం సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్‌కు వెళ్లనున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు హుజూర్‌నగర్ పట్టణంలోని సాయిబాబా థియేటర్ రోడ్‌లో నిర్వహించే ఉప ఎన్నికల బహిరంగసభలో ఆయన పాల్గొంటారు. టీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డికి మద్దతుగా ప్రసంగిస్తారు. సీఎం కేసీఆర్ సభకు నియోజకవర్గ ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం టీఆర్‌ఎస్ శ్రేణులు భారీగా ఏర్పాట్లు

› మిగతా 2వ పేజీలో





బుధవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న గ్రామపంచాయతీ ట్రిబ్యునల్ సభ్యుడు గటిక అజయ్‌కుమార్ తదితరులు

# పంచాయతీరాజ్‌ను బలోపేతం చేస్తాం

- జెడ్పీ, ఎంపీపీలకు కూడా నిధులు, విధులు
- ఎంపీపీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, జెడ్పీ చైర్మన్లతో త్వరలో హైదరాబాద్‌లో సమావేశం
- ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు
- సీఎంను కలిసిన గటిక అజయ్‌కుమార్
- పంచాయతీ ట్రిబ్యునల్ సభ్యుడిగా నియమించినందుకు సీఎంకు కృతజ్ఞతలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తామని, గ్రామపంచాయతీలతో పాటు మండల పరిషత్, జిల్లా పరిషత్‌లను క్రియాశీలకంగా మారుస్తామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. గ్రామపంచాయతీ ట్రిబ్యునల్ సభ్యుడిగా నియమితులైన వరంగల్ రూరల్ జిల్లా నెక్కొండకు చెందిన గటిక అజయ్‌కుమార్ బుధవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు. తనను ట్రిబ్యునల్ సభ్యుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అజయ్‌కుమార్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఇటీవల గ్రామాల్లో నిర్వహించిన 30 రోజుల ప్రణాళిక కార్యాచరణ ఆశించిన ఫలితాలు సాధించిందని సంతృప్తి వ్యక్తంచేశారు. గ్రామపంచాయతీల మాదిరిగానే మండల, జిల్లా పరిషత్తులకు కూడా నిర్దిష్టమైన విధులు, నిధులు, బాధ్యతలు అప్పగించడానికి కసరత్తు చేస్తున్నట్టు వెల్లడించారు. త్వరలోనే ఎంపీపీలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, జెడ్పీ చైర్మన్లతో హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించనున్నట్టు సీఎం చెప్పారు. ఆర్థిక సంఘం నిధులను ప్రతినెలా రూ.339 కోట్ల చొప్పున గ్రామపంచాయతీలకు విడుదలచేస్తున్నామని తెలిపారు. ఇదే తరహాలో మండల, జిల్లా పరిషత్తులకు కూడా నిధులు విడుదలచేస్తామని చెప్పారు. తెలంగాణ పల్లెలు దేశంలోకెల్లా ఆదర్శగ్రామాలుగా మారాలన్నదే తన అభిమతమని సీఎం కేసీఆర్ వెల్లడించారు. ప్రజల విస్తృత భాగస్వామ్యం, స్థానికసంస్థల ప్రజాప్రతినిధుల నాయకత్వంలో పల్లెలు బాగుపడాలని ఆకాంక్షించారు. దీనికి అవసరమైన ఆర్థికప్రేరణను ప్రభుత్వం అందిస్తుందని, మంచి విధానం తీసుకొస్తుందని చెప్పారు. గ్రామస్థాయిలో ప్రజలు సమైక్యంగా ఉండి, గ్రామాలను బాగుచేసుకోవాలని, నిధులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అజయ్‌కుమార్ వెంట సీఎంను కలిసినవారిలో జెడ్పీటీసీ సరోజ హరికిషన్‌నాయక్, ఎంపీపీ జాటోతు రమేశ్, టీఆర్‌ఎస్ నాయకులు కొమ్ము రమేశ్‌యాదవ్, తాటిపల్లి శివకుమార్, సంపత్‌రావు, మూర్తి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



# సైదిరెడ్డిని ఆశీర్వదించండి

- బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి
- కేసీఆర్ ప్రభుత్వంలోనే వారికి ఆత్మగౌరవం
- ఆత్మీయ సమ్మేళనంలో విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- నృసింహుని క్షేత్రంలో గిరిజన గురుకులం: మంత్రి సత్యవతి రాథోడ్
- హుజూర్‌నగర్ నియోజకవర్గంలో జోరుగా టీఆర్‌ఎస్ ప్రచారం



పాలకవీడు మండలం గుండ్లపహాడ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్. చిత్రంలో పార్టీ అభ్యర్థి సైదిరెడ్డి తదితరులు ఉన్నారు.



మఠంపల్లిలో బ్రాహ్మణుల సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీ సతీశ్, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, వేణుగోపాలాచారి ఉన్నారు.

**హుజూర్‌నగర్, నమస్తే తెలంగాణ/మఠంపల్లి/మేళ్లచెర్వు:** బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టిందని, ఇంకా అమలుచేయడానికి కట్టుబడి ఉన్నదని విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి చెప్పారు. బుధవారం హుజూర్‌నగర్ నియోజకవర్గం మఠంపల్లి మండలం మట్టపల్లిలో నిర్వహించిన బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నో అవమానాలు, అవహేళనలకు గురైన బ్రాహ్మణులకు స్వరాష్ట్రంలో ఎంతో ఆత్మగౌరవం పెరిగిందన్నారు. సీఎం కేసీఆర్ రూ.100కోట్లతో బ్రాహ్మణ పరిషత్ ఏర్పాటు చేసి ఎస్సీ, ఎస్టీ వర్గాలతో సమానంగా పథకాలు అమలుచేస్తున్నారని, బ్రాహ్మణ విద్యార్థుల విదేశీ విద్యకు రూ.20లక్షల ఉపకార వేతనం అందజేస్తున్నారని వివరించారు. సీఎం కేసీఆర్ రుణం తీర్చుకునేందుకు హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో టీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని ఆశీర్వదించి, గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పురాణం సతీశ్, హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి వేణుగోపాలాచారి, చకిలం అనిల్‌కుమార్ పాల్గొన్నారు. మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహుని క్షేత్రంలో వంద రోజుల్లో గిరిజన గురుకుల పాఠశాలను రూ.25కోట్లతో ప్రారంభించనున్నట్టు గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ చెప్పారు. మఠంపల్లిలో నిర్వహించిన గిరిజనుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మట్టపల్లి నృసింహుని క్షేత్రంలో గిరిజనుల పాఠశాలతోపాటు బంజారా అన్నదాన సత్రం నిర్మిస్తామని, హుజూర్‌నగర్‌లో రూ.కోటితో బంజారా భవన్ నిర్మిస్తామని తెలిపారు. టీఆర్‌ఎస్ అభ్యర్థి సైదిరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్ పాల్గొన్నారు. హుజూర్‌నగర్‌లో 20 వేలకు పైగా ఓట్ల మెజార్టీతో టీఆర్‌ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి గెలుపొందడం ఖాయమని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. బుధవారం ఆయన వరంగల్‌లో మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, టీఆర్‌ఎస్ అభ్యర్థి సైదిరెడ్డిని గెలిపిస్తే సీఎం కేసీఆర్ తమ ప్రాంతాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తారనే కృతనిశ్చయంతో ఉన్నారని తెలిపారు.

### టీఆర్‌ఎస్ గెలుపు ఎప్పుడో ఖాయమైంది: ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

హుజూర్‌నగర్‌లో టీఆర్‌ఎస్ గెలుపు ఎప్పుడో ఖాయమైందని, భారీ మెజార్టీ కోసమే ప్రచారం చేస్తున్నామని ఉప ఎన్నికల టీఆర్‌ఎస్ ఇంచార్జి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. హుజూర్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ.. ఉత్తమ్ మాయమాటలకు ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి రవీందర్‌రావు పాల్గొన్నారు. మేళ్లచెర్వు మండలంలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ బడుగుల లింగయ్య, ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ప్రచారం నిర్వహించారు. గరిడేపల్లి మండలంలో మండలి చీఫ్ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్ ప్రచారంలో పాల్గొన్నారు. చింతలపాలెం మండలంలో ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, బాపూరావు రాథోడ్, ఎమ్మెల్యే అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, ఎంపీ బండ ప్రకాశ్, హుజూర్‌నగర్‌లో ఎమ్మెల్యే గాదరి కిశోర్, ఎమ్మెల్సీ రాజేశ్వరరావు, నేరేడుచర్లలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, రాజయ్య, పాలకవీడు మండలంలో ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యేలు హరిప్రియ, నల్లమోతు భాస్కర్‌రావు, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ప్రచారంలో పాల్గొన్నారు.



నేరేడుచర్ల మున్సిపాలిటీలో నమూనా బ్యాలెట్‌తో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తదితరులు

## టీఆర్‌ఎస్‌కే జైకొడుతున్న స్థానిక సీపీఐ

రాష్ట్ర నేతల ప్రకటనను పట్టించుకోని హుజూర్‌నగర్ నాయకులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో టీఆర్‌ఎస్‌కు మద్దతు ప్రకటించిన సీపీఐ రాష్ట్ర నేతలు.. ఇటీవల ఉపసంహరణ ప్రకటనచేశారు. కానీ నియోజకవర్గ సీపీఐ నాయకులు మాత్రం ఆ ప్రకటనను ఏమాత్రం పట్టించుకున్నట్టు కనిపించడం లేదు. ఒకసారి మద్దతు తెలిపి.. ఆ పార్టీ అభ్యర్థి తరఫున ప్రచారం ఉధృతంగా చేస్తున్న తరుణంలో అకారణంగా మద్దతు ఉపసంహరణ ప్రకటన చేయడాన్ని స్థానిక నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ అంశంలో కాంగ్రెస్ కలిసి వస్తుందని భావించినా నిరాశే ఎదురవుతున్నది. ఇప్పటికే టీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి ముమ్మరంగా ప్రచారాన్ని అదే ఒరవడి కొనసాగిస్తున్నారు. దీంతో రాష్ట్ర నేతలు కూడా వారిని ఏమీ అనలేని పరిస్థితి నెలకొన్నది. ప్రజల నాడికి అనుగుణంగా మద్దతునిచ్చి.. ముమ్మరంగా ప్రచారం చేస్తున్న సమయంలో ఆర్టీసీ సమ్మె సాకుతో మద్దతు ఉపసంహరణ ప్రకటన చేయడంపై స్థానిక నేతలు అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీంతో ఆ ప్రకటనను పట్టించుకోకుండా టీఆర్‌ఎస్ అభ్యర్థి సైదిరెడ్డికి అనుకూలంగా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఈ పరిణామాలతో కాంగ్రెస్ శిబిరంలో ఆందోళన మరింత ఎక్కువైంది. ఆర్టీసీ పరిణామాల దరిమిలా సీపీఐ తదుపరి ప్రకటనతో లబ్ధి పొందాలనుకున్న ఆ పార్టీ నేతలకు నిరాశే ఎదురైంది.



7వ బయో ఏషియా- 2020 సదస్సు థీమ్‌ను ఆవిష్కరిస్తున్న ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్, ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ తదితరులు

# లైఫ్‌సైన్సెస్ రాజధాని హైదరాబాద్

- ఫిబ్రవరి 17 నుంచి 19 వరకు బయోఏషియా- 2020 సదస్సు
- హెచ్‌ఐసీసీ వేదిక.. టుడే ఫర్ టుమారో ఇతివృత్తం
- 55 దేశాల నుంచి 1800 మంది ప్రతినిధులు హాజరు
- వెబ్‌సైట్, థీమ్‌ను ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్

BioAsia 2020 Today for Tomorrow 17th - 19th FEB, HYDERABAD

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లైఫ్‌సైన్సెస్ రంగంలో హైదరాబాద్ స్థానాన్ని మరింత సుస్థిరం చేసేదిశగా ప్రభుత్వం కృషిచేస్తున్నదని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారక రామారావు అన్నారు. ఇప్పటికే లైఫ్‌సైన్సెస్, ఫార్మా రంగానికి హైదరాబాద్ కేంద్రంగా ఉన్నదని తెలిపారు. 17వ బయోఏషియా- 2020 సదస్సు వచ్చే ఫిబ్రవరి 17 నుంచి 19 వరకు హైదరాబాద్‌లో హెచ్‌ఐసీసీ వేదికగా జరుగనున్నది. 'టుడే ఫర్ టుమారో' ఇతివృత్తంగా నిర్వహించే ఈ సదస్సు వెబ్‌సైట్, థీమ్‌ను బుధవారం బషీర్‌బాగ్‌లోని టీఎస్‌ఐఐసీ కార్యాలయంలో మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ లైఫ్‌సైన్సెస్ రాజధానిగా ఎదగడంలో బయోఏషియా సదస్సు కీలకంగా నిలిచిందని చెప్పారు. ఈ సదస్సుకు 55 దేశాల నుంచి 1800 మంది ఫార్మా, లైఫ్‌సైన్సెస్ రంగ నిపుణులు, ప్రతినిధులు హాజరుకానున్నట్టు వెల్లడించారు. సుమారు 100కు పైగా కంపెనీలు పాల్గొననున్నాయని తెలిపారు. స్టార్టప్‌ల కోసం ప్రత్యేకంగా కార్యక్రమాన్ని ఏర్పాటుచేయనున్నామన్నారు. సదస్సుకు కేంద్రప్రభుత్వంతోపాటుగా టీఎస్‌ఐఐసీ, రిచ్, స్టేట్ ఇన్నోవేషన్ సెల్, ఫ్యాబా, బీఐఆర్‌ఏసీ, ఇన్వెస్ట్ ఇండియా, సీఎస్‌ఐఆర్, ఎమ్మెస్‌ఎంఈ సంస్థలు భాగస్వాములు కానున్నాయి. స్విట్జర్లాండ్ భాగస్వామ్యదేశంగా.. జర్మనీ అసోసియేట్ భాగస్వామిగా ఉండనున్నాయి. అసోం, కేరళ భాగస్వామ్య రాష్ట్రాలుగా ఉంటాయి. కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, పరిశ్రమలశాఖ కమిషనర్ నదీమ్ అహ్మద్, టీఎస్‌ఐఐసీ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, లైఫ్‌సైన్సెస్ డైరెక్టర్ శక్తి నాగప్పన్ తదితరులు పాల్గొన్నారు.

## 13 మంది న్యాయమూర్తుల బదిలీ

ఉత్తర్వులు జారీచేసిన హైకోర్టు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో 13 మంది జిల్లా, సెషన్స్ న్యాయమూర్తులను బదిలీ చేస్తూ హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. నల్లగొండ జిల్లా జడ్జి శశిధర్‌రెడ్డి జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్‌గా, జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్ సుజన హైదరాబాద్ స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జిగా, హైదరాబాద్ స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జి ఎంవీ రమేశ్ నల్లగొండ ప్రిన్సిపల్ జిల్లా జడ్జిగా బదిలీ అయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్జి అజిత సింహారావు, మెదక్ జిల్లా జడ్జి కర్ణకుమార్, వరంగల్ జిల్లా జడ్జి రవీంద్రశర్మ.. హైదరాబాద్ అదనపు చీఫ్ జడ్జీలుగా, హైదరాబాద్ అదనపు చీఫ్ జడ్జి వరప్రసాద్.. హైదరాబాద్ ఎంపీ, ఎమ్మెల్యేల కేసుల ప్రత్యేక కోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. హైదరాబాద్ సెషన్స్ జడ్జి రాజేశ్‌బాబు హైదరాబాద్ ఫ్యామిలీ కోర్టు జడ్జిగా, హైదరాబాద్ చీఫ్ జడ్జి సత్యేంద్ర సికింద్రాబాద్ చీఫ్ జడ్జిగా, ఖమ్మం జిల్లా జడ్జి అబ్దుల్‌రఫీ కొత్తగూడెం జిల్లా జడ్జిగా, నల్లగొండ అదనపు జిల్లా జడ్జి హుజైబ్‌అహ్మద్‌ఖాన్ భువనగిరి అదనపు జిల్లా జడ్జిగా, కరీంనగర్ ఏసీబీ స్పెషల్ జడ్జి జాన్సన్ సిరిసిల్ల అదనపు జిల్లా జడ్జిగా, ఆదిలాబాద్ అదనపు జిల్లా జడ్జి భారతలక్ష్మి గోదావరిఖని ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా బదిలీ అయ్యారు.

## టీఆర్‌ఎస్‌కే మా మద్దతు

అర్చక సమాఖ్య, బ్రాహ్మణ సేవా సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో టీఆర్‌ఎస్‌కు మద్దతు ఇస్తున్నట్టు తెలంగాణ అర్చక సమాఖ్య, బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర కార్యవర్గంలో ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్టు వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ ప్రకటించారు. బుధవారం హైదరాబాద్‌లో అర్చక సమాఖ్య, బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం ఉపేంద్రశర్మ మాట్లాడుతూ.. హుజూర్‌నగర్‌లో టీఆర్‌ఎస్‌కు మద్దతుగా 12 వేల మంది బ్రాహ్మణులు, నాలుగువేల మంది అర్చకులు ప్రచారం చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. సీఎం కేసీఆర్ అర్చకులు, బ్రాహ్మణుల సంక్షేమాన్ని పట్టించుకున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ధూప, దీప, నైవేద్యం నిధులను పెంచాలని, అర్చక వెల్ఫేర్ ఫండ్ నుంచి నిధులు కేటాయించాలని, హెల్త్ స్కీం ఏర్పాటుచేయాలని సీఎం కేసీఆర్‌ను కోరుతున్నామన్నారు.



బుధవారం హైదరాబాద్‌లో అర్చక సమాఖ్య, బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ

### ముహూర్తం

సూర్యోదయం: 6.10 గంటలకు

సూర్యాస్తమయం: 5.49 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, కృష్ణపక్షం, తదియ ఉదయం 6.47 వరకు, తదుపరి చతుర్థి, నక్షత్రం: కృత్తిక మధ్యాహ్నం 3.51 వరకు, తదుపరి రోహిణి, అమృతఘడియలు: మధ్యాహ్నం 1.18 నుంచి 3.00 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.27 నుంచి 2.54 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 10.03 నుంచి 10.50 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.43 నుంచి 3.29 వరకు, వర్జ్యం: లేదు.

## నేడు హుజూర్‌నగర్‌లో సీఎం కేసీఆర్ సభ


మొదటిపేజీ తరువాయి...


చేస్తున్నాయి. ప్రచారానికి మరో మూడ్రోజులు మాత్రమే ఉండటం, బహిరంగసభకు సీఎం కేసీఆర్ వస్తుండటంతో ప్రచారం మరింత జోరందుకోనున్నది. ఇప్పటికే నియోజకవర్గంలో టీఆర్‌ఎస్ పార్టీ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నది. మిగతా పార్టీల కంటే కూడా దూసుకుపోతున్నది. అభ్యర్థి సైదిరెడ్డి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు చుట్టి రాగా, మంత్రులు జీ జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, టీఆర్‌ఎస్ హుజూర్‌నగర్ ఉప ఎన్నికల ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, టీఆర్‌ఎస్ నాయకులు రోడ్‌షోలు, సభలు ఇంటింటి ప్రచారాలు నిర్వహిస్తున్నారు. కాగా, సీఎం బహిరంగసభ ఏర్పాట్లను బుధవారం సాయంత్రం మంత్రులు జీ జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, టీఆర్‌ఎస్ నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి రవీందర్ పరిశీలించారు.



హుజూర్‌నగర్‌లో సీఎం కేసీఆర్ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, టీఆర్‌ఎస్ ఉప ఎన్నికల ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కిశోర్, రవీంద్రకుమార్ తదితరులు

## ఈ నెల 19న 'లా' సీట్ల కేటాయింపు

ముగిసిన న్యాయవిద్య తొలి విడుత కౌన్సెలింగ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని న్యాయవిద్య కళాశాలల్లో సీట్ల భర్తీ కోసం ఈ నెల 10 నుంచి ప్రారంభమైన తొలి విడుత 'లా' కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారం ముగిసింది. న్యాయవిద్య మూడేండ్ల కోర్సుకు 5,019 మంది, ఐదేండ్ల కోర్సుకు 1,148 మంది, ఎల్‌ఎల్‌ఎం కోర్సుకు 1,103 మంది ఆప్షన్లు ఎంపిక చేసుకొన్నట్టు లాసెట్ అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ రమేశ్‌బాబు తెలిపారు. ఈ మూడు కోర్సుల్లో కలిపి మొత్తం 7,270 మంది అభ్యర్థులు కౌన్సెలింగ్‌లో పాల్గొన్నట్టు చెప్పారు. కౌన్సెలింగ్‌కు హాజరైనవారికి ర్యాంకులవారీగా ఈ నెల 19న సీట్ల కేటాయింపు జరుపుతామని పేర్కొన్నారు.

## షెడ్యూల్ సంస్థలపై తేల్చని కేంద్రం

- ఆరేండ్లుగా పెండింగ్‌లోనే 9, 10 షెడ్యూల్ సంస్థల విభజన
- చట్టప్రకారమే జరుగాలన్న తెలంగాణ
- అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్న ఏపీ
- పరిష్కారం చూపని ఢిల్లీ భేటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర విభజన జరిగి ఆరేండ్లు అయినా.. ఇప్పటివరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య పలు విభజన సమస్యలు పరిష్కారం కావటంలేదు. గతంలో ఏపీలో అధికారంలో ఉన్న ప్రభుత్వం పరిష్కారానికి ముందుకు రాలేదు. దీంతో ఆయా సంస్థల విభజన, ఆస్తులు, ఉద్యోగుల పంపకాల సమస్య అలాగే మిగిలింది. రెండు రాష్ట్రాలు కలిసి విభజన సమస్యలు పరిష్కరించుకోని పక్షంలో జోక్యం చేసుకొని పరిష్కరించాల్సిన కేంద్రం కూడా పట్టనట్టు వ్యవహరిస్తుండటంతో ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్న చందాన పరిస్థితి తయారైంది. తాజాగా ఢిల్లీలో హోంశాఖ కార్యదర్శి నేతృత్వంలో జరిగిన సమావేశం కూడా నిర్దిష్ట పరిష్కారాన్ని చూపించలేదని, మరోసారి సమావేశమవుదామని చెప్పి వాయిదా వేసిందని తెలిసింది. ఈసారి జరిగే సమావేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహిస్తామని కేంద్రహోంశాఖ కార్యదర్శి ఇరు రాష్ట్రాలకు తెలియజేసినట్లు సమాచారం. షెడ్యూల్ 9కి చెందిన 89 సంస్థలకుగాను 84 సంస్థల విభజనపై షీలాభిడే కమిటీ సిఫారసులు చేసింది. మరో ఐదు సంస్థల విభజనపై మార్గదర్శకాలను పెండింగ్‌లో పెట్టింది. అయితే ఇందులో 42 సంస్థలకు మాత్రమే ఏపీ ప్రభుత్వం జీవోలు విడుదలచేసింది. మిగిలినవి పెండింగ్‌లో ఉంచింది. ఇందులో 24 సంస్థలపై నిర్ణయం తీసుకోవడానికి మరోసారి పరిశీలన చేస్తామని చెప్తూనే.. మరో 23 సంస్థల విభజనపై పేచీపెట్టింది. దీంతో విభజన సమస్యలు అపరిష్కృతంగా పడి ఉన్నాయి.

### సింగరేణిపై ఏపీ వితండవాదం

సింగరేణి సంస్థ షెడ్యూల్ 9లోను, షెడ్యూల్ 12లోను ఉన్నది. ఈ సంస్థలో కేంద్రప్రభుత్వం కూడా వాటాదారు. పూర్తిగా తెలంగాణ ప్రాంతానికి చెందిన ఈ సంస్థలో తమకూ భాగస్వామ్యం ఉంటుందని ఏపీ వాదిస్తున్నది. ఇప్పటికే సింగరేణికి చెందిన ఆప్మెల్ సంస్థ పూర్తిగా తమకే చెందుతుందంటూ ఏపీ ప్రభుత్వం జీవో కూడా విడుదలచేసింది. దీనిని నిలుపుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వం గతంలోనే కేంద్రానికి విజ్ఞప్తిచేసింది. ఈ విషయంలో కేంద్రం న్యాయశాఖ సలహా కోరినట్లు తెలిసింది. పదో షెడ్యూల్‌లో మొత్తం 142 సంస్థలు ఉన్నాయి. వీటి విభజనపై ఏపీ కోర్రీలు వేసింది. ఉన్నత విద్యామండలిపై సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించింది. విభజన చట్టం ప్రకారం లొకేషన్ బేసిస్‌లో తెలంగాణకు చెందిన కార్యాలయాలలో కూడా తమకు వాటా వస్తుందని వితండవాదం చేస్తున్నది. దీంతో ఆయా సంస్థల విభజన పెండింగ్‌లో ఉన్నది.

### చట్ట ప్రకారమే చేయాలంటున్న తెలంగాణ

తెలంగాణ ప్రభుత్వం మొదటి నుంచి ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014 ప్రకారం ఆయా సంస్థలు, ఆస్తులు, ఉద్యోగుల విభజనకు అంగీకరించింది. ఇదే విషయాన్ని కేంద్రానికి స్పష్టంచేసింది. ఏపీ ప్రభుత్వం మాత్రం దీనిపై అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నది. ఈ నేపథ్యంలో నోడల్ ఏజెన్సీగా ఉన్న కేంద్రం జోక్యం చేసుకొని చట్టం వెలుగులో ఆయా సమస్యలను పరిష్కరించాల్సి ఉన్నా.. ఆరేండ్లుగా కేంద్రం ఆ దిశగా నిర్దిష్ట చర్యలు చేపట్టలేదు. పలుసార్లు సమావేశాలు నిర్వహించినా పరిష్కారం చూపించలేకపోయింది.

## లోకం పోకడ





వాళ్లు ఆపేస్తే ఏం? మనం ప్రింటు చేస్తున్నాం గదా!

# రెండ్రోజుల్లో ఫుల్


మొదటిపేజీ తరువాయి...


తిరుగుతున్నాయని, రాష్ట్రవ్యాప్తంగా అదే పద్ధతి కొనసాగించాలన్నారు. ఆర్టీసీ బస్సులు, అద్దెబస్సులు తిప్పడం, తాత్కాలిక ఏర్పాట్లపై జిల్లాకలెక్టర్లకు నిర్ణయాధికారాలు ఇస్తున్నామని, పూర్తిస్వేచ్ఛతో రవాణాసౌకర్యం మరింత మెరుగుపర్చాలని చెప్పారు. ఇకనుంచి ప్రతి బస్‌డిపోకు నోడల్ అధికారులను నియమిస్తున్నట్లు మంత్రి అజయ్ వెల్లడించారు. ప్రతి డిపోలో డీఆర్వో లేదా ఆర్డీవోస్థాయి అధికారులు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. దీనిపై కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. నోడల్ అధికారులకు సహాయకులుగా ఐదుగురు అధికారుల బృందాన్ని డిపోల్లో ఏర్పాటుచేయాలని, ఈ అధికారులు ఆర్టీసీ బస్సులు, టికెట్లు ఇవ్వడం, కండక్టర్లను బస్సులకు కేటాయించడం వంటివి నిర్వహించాలని చెప్పారు. బుధవారం నుంచే షెడ్యూల్ ప్రకారం కొన్ని ప్రాంతాలకు బస్సులు నడుపుతున్నామన్నారు. ప్రస్తుతం కండక్టర్లను నియమించుకున్నామని, ప్రైవేట్ కండక్టర్లకు టికెట్ జారీ యంత్రాలు (టీఎం)లు అందించామని తెలిపారు. ప్రైవేట్ కండక్టర్లకు టికెట్ మిషన్లు ఇచ్చి, విధులు ముగించుకున్న తర్వాత కలెక్షన్లు తీసుకోవాలని చెప్పారు. రోజువారీ కలెక్షన్లలో పూర్తి పారదర్శకత ఉండాలని ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో రవాణాశాఖ కమిషనర్ సందీప్‌కుమార్ సుల్తానియా, ముఖ్య కార్యదర్శి, ఇంచార్జి ఎండీ సునీల్‌శర్మ ఉన్నారు.

### నేడు ఉద్యోగ జేఏసీ సమావేశం

తెలంగాణ ఉద్యోగ జేఏసీ గురువారం సమావేశం కానున్నది. టీఎన్జీవో భవన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశానికి జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ వీ మమత సహా జేఏసీలోని ఉద్యోగసంఘాల ప్రతినిధులు హాజరుకానున్నారు. సమావేశం అనంతరం జేఏసీ ప్రతినిధులు సచివాలయానికి వెళ్లి సీఎస్‌ను కలువనున్నారు. ఆర్టీసీ సమ్మెతోపాటు ఉద్యోగుల అంశాలపై వినతిపత్రం సమర్పించనున్నారు. ఉద్యోగుల జేఏసీ సమావేశం బుధవారం నిర్వహించాలనుకున్నా.. అనివార్య కారణాలతో వాయిదాపడింది.



బాగ్‌లింగంపల్లిలో మాట్లాడుతున్న ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి

## ఆర్టీసీ కార్మికులను చర్చలకు పిలువాలి

19న బంద్‌కు ప్రజలు సహకరించాలి

ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం చర్చలకు పిలిచి, డిమాండ్లను పరిష్కరించాలని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి కోరారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆర్టీసీ జేఏసీ నేతలతో విపక్షనేతలు సమావేశమయ్యారు. సమ్మె కొనసాగింపు, హైకోర్టు వ్యాఖ్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం అశ్వత్థామరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్మికుల డిమాండ్లను పరిష్కరించనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ నెల 19న తలపెట్టిన బంద్‌ను అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు చాడ వెంకటరెడ్డి, తమ్మినేని వీరభద్రం, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్టీసీ జేఏసీ ప్రతినిధులు రాజిరెడ్డి, థామస్ రెడ్డి, బీజేపీ, ఇతర పార్టీల నేతలు పాల్గొన్నారు.

## టీఆర్టీ పీఈటీ అభ్యర్థులూ సహకరించండి

టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని పాఠశాల విద్యాశాఖలో టీఆర్టీ పీఈటీ పోస్టులకు సంబంధించిన కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నదని, ఈ నెల 21న కేసుకు సంబంధించి వాదనలు జరుగనున్నాయని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్ తెలిపారు. కేసు పరిష్కారమయ్యేవరకు తమకు సహకరించాలని టీఆర్టీ పీఈటీ అభ్యర్థులను కోరారు.



సావర్కర్ హిందుత్వ సిద్ధాంతాన్ని చెప్పినందుకు కాంగ్రెస్‌వాదులు ఆయనను అవమానించారు. కాంగ్రెస్ వాదులే అంబేద్కర్‌కు కూడా భారతరత్న రాకుండా ఏండ్ల తరబడి అడ్డుకున్నారు. దేశాభ్యున్నతికి జాతీయవాదం తప్ప మరో గత్యంతరం లేదు.


**నరేంద్రమోదీ, ప్రధాని**

ప్రభుత్వరంగ బ్యాంకులు దివాలా తీయటానికి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, అప్పటి ఆర్బీఐ గవర్నర్ రఘురామ్‌రాజన్‌లు మాత్రమే కారకులు. ఫోన్‌కాల్స్‌పై ఆధారపడి ఆయన బ్యాంకుల నుంచి అప్పులు ఇచ్చారు. రాజన్ గొప్ప ముందుచూపు ఉన్నవారే. కానీ జరిగింది మరొక్కటి.



**నిర్మలా సీతారామన్, కేంద్ర ఆర్థిక మంత్రి**

**చరిత్రలో నేడు**



1933

జర్మనీ నుంచి శరణార్థిగా అమెరికా చేరుకున్న ఐన్‌స్టీన్.

1970

ఈజిప్ట్ అధ్యక్షునిగా అన్వర్ సాదత్.





1979

మదర్ థెరిసాకు నోబెల్ శాంతి బహుమతి.

ప్రతిష్ఠాత్మక ఆర్థిక నోబెల్ బహుమతి అందుకున్న వారిలో ప్రవాస భారతీయుడు అభిజిత్ బెనర్జీ ఉండటం గర్వకారణం. ఇది మన భారతీయ ఆర్థికవేత్తల ప్రతిభా పాటవాలకు ప్రతీక. ప్రపంచవ్యాప్తంగా మన ఆర్థికవేత్తల ప్రజ్ఞకు గుర్తింపు, గౌరవం దక్కటమే కాదు, వారి విధానాల అమలుకు అనేక దేశాలు ప్రయత్నిస్తున్నాయి. కానీ మన దేశంలో వారి సేవలను వినియోగించుకునే స్థితి లేకపోవటం విషాదం. నిజానికి అలాంటి వారి సలహాల మేరకు నడుచుకుంటే పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ లాంటి విధాన నిర్ణయాలతో మంచి ఫలితాలు వచ్చి ఉండేవనటంలో సందేహం లేదు.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

జమ్ముకశ్మీర్‌లో పోస్ట్ పేయిడ్ సెల్‌ఫోన్ సేవలను కేంద్రప్రభుత్వం పునరుద్ధరించటంతో కశ్మీరీలకు ఊరట లభించింది. కశ్మీర్ బయట ఉన్న బంధుమిత్రులతో క్షేమ సమాచారాలు పంచుకునే వీలు కలిగింది. అలాగే కశ్మీర్‌లోని పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం కూడా పెరుగుతుందని ఆశించారు. కానీ ఎప్పుడు ఏ పరిస్థితులు ఎదురవుతాయోనన్న భయంతో పిల్లలను బడులకు పంపటం లేదు. ఈ క్రమంలోనే ఇంటర్నెట్ సేవలను కూడా పునరుద్ధరించాలనే అభిప్రాయం ఉన్నది.

**ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్**



# గంగూలీ సారథ్యంలో..

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)లో నూతన శకం మొదలుకాబోతున్నది. మూడేండ్లుగా బోర్డు వ్యవహారాలను నిర్వహిస్తున్న క్రికెట్ పరిపాలన కమిటీ (సీవోఏ)కి స్వస్తి పలుకుతూ భారత మాజీ కెప్టెన్ సౌరవ్‌గంగూలీ సారథ్యంలో బీసీసీఐ కొలువుదీరబోతున్నది. ప్రత్యర్థులు లేకుండానే పూర్తి ఏకపక్షరీతిలో సాగుతున్న బీసీసీఐ ఎన్నికల్లో ప్రతిష్ఠాత్మక అధ్యక్ష పదవి పీఠం కోసం ఏకైక నామినేషన్ వేసిన దాదా ఎన్నిక దాదాపు ఖాయమైంది. ఈ నెల 23న గంగూలీ అధికారికంగా బీసీసీఐ అధ్యక్ష పదవిని అలకరించబోతున్నాడు. నాయకత్వ పటిమకు తోడు, కళాత్మక బ్యాటింగ్‌తో భారత క్రికెట్‌పై తనదైన ముద్రవేసిన గంగూలీకి బీసీసీఐలో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. దేశవాళీ క్రికెటర్ల జీతభత్యాలను పెంచడమే తన ప్రథమ ప్రాధాన్యమని గంగూలీ చెప్పడం వెనుక అతని ఉద్దేశమేంటో స్పష్టంగా కనిపిస్తున్నది. దేశం తరఫున ఆటగాడిగా, కెప్టెన్‌గా, బెంగాల్ క్రికెట్ అసోసియేషన్‌కు అధిపతిగా వ్యవహరించిన అనుభవం గంగూలీకి ఉన్నది. మసకబారిన బీసీసీఐకి తన జట్టుతో కలిసి తిరిగి పూర్వవైభవం తీసుకొస్తానని ధీమాను ఆయన వ్యక్తంచేశారు. బీసీసీఐకి నాయకత్వం వహించడానికి గంగూలీ అన్నివిధాలా అర్హుడనడంలో ఎవరికీ అనుమానాలు లేవు. కానీ గంగూలీ బృందం ఏకగ్రీవ ఎన్నికకు ముందు జరిగిన తెరవెనుక తతంగం, కమిటీ పదవుల్లో నాయకుల బంధువులు ఉండటమే సందేహాలకు తావిస్తున్నది. సుప్రీంకోర్టు స్వయంగా చొరవ తీసుకొని కొన్ని ఏండ్ల పాటు ప్రక్షాళన కోసం ప్రయత్నించిన తర్వాత కూడా క్రికెట్ బోర్డు రాజకీయ ఊబి నుంచి బయటపడలేక పోయిందా అనే ఆందోళన మిగిలే ఉన్నది.

2013 ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్ వివాదం తర్వాత తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కొన్న బీసీసీఐలో సమూల ప్రక్షాళనకు సుప్రీంకోర్టు చొరవ చూపవలసి వచ్చింది. అప్పటివరకు ప్రపంచ క్రికెట్‌ను ఏకఛత్రాధిపత్యంతో శాసించిన భారత్‌కు ఫిక్సింగ్ వివాదం మాయని మచ్చలా మారింది. బోర్డులో పెరిగిపోయిన రాజకీయ నాయకుల ప్రాబల్యానికి తోడు అందినకాడికల్లా దోచుకుంటూ కోట్లు సంపాదించిన వారి భరతం పట్టేందుకు జస్టిస్ లోధా కమిటీని సుప్రీం నియమించింది. ఇన్నాళ్లు బోర్డును పట్టిపీడిస్తున్న సమస్యలను పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ లోధా సిఫారసులు చేయడం, దానికి సుప్రీం సమ్మతించడంతో ప్రక్షాళనకు మార్గం పడ్డదనే ఆశాభావం క్రికెట్ అభిమానుల్లో ఏర్పడ్డది. ఎవరైనా లోధా సిఫారసులకు అనుగుణంగా వ్యవహరించాల్సిందే అన్న సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా బోర్డులో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. అప్పటివరకు బీసీసీఐ ఏలిన దిగ్గజాలంతా తప్పుకునే పరిస్థితి ఏర్పడింది. అయితే 2017లో సిఫార్సులను అమలుచేయడంలో విఫలమైందన్న కారణంగా అనురాగ్ ఠాకూర్ నేతృత్వంలోని బీసీసీఐ కార్యవర్గాన్ని సుప్రీంకోర్టు తొలిగించింది. ఆ తర్వాత క్రికెట్ వ్యవహారాలను చూసుకునేందుకు మాజీ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) వినోద్‌రాయ్ నేతృత్వంలో క్రికెట్ పరిపాలన కమిటీ(సీవోఏ)ను ఏర్పాటుచేసింది. అప్పటినుంచి సీవోఏ పాలనలో సాగిన బోర్డు బాధ్యతలను గంగూలీ అందుకోబోతున్నాడు. సీవోఏ నిర్ణయాలతో ఐసీసీలో ఒకింత ప్రభావాన్ని కోల్పోయిన బీసీసీఐకి పూర్వవైభవాన్ని తీసుకొస్తానని గంగూలీ ప్రకటించారు.

క్రికెటర్‌గా ఆట ప్రాథమ్యాలు ఏమిటో బాగా తెలిసిన గంగూలీ అధ్యక్షుడు కాబోతుండటం బాగానే ఉన్నా దీనివెనుక జరిగిన మంత్రాంగం కూడా ఆసక్తికరమే. అప్పటివరకు పోటీలో లేని దాదా అనూహ్యంగా అధ్యక్ష పీఠాన్ని అలకరించబోతుండటం వెనుకు ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కనుసన్నల్లో జరిగిన ఎన్నికల ప్రక్రియలో ఎన్నో ఊహించని మలుపులు ఎదురయ్యాయి. మాజీ అధ్యక్షుడు శ్రీనివాసన్ తన ప్రభావాన్ని తిరిగి నిరూపించుకునే క్రమంలో బ్రిజేష్ పటేల్‌ను బరిలోకి దింపి ఎన్నికలను ఆసక్తికరంగా మార్చాడు. అయితే కొన్నిగంటల వ్యవధిలోనే కేంద్రంలోని పెద్దలు కలుగజేసుకోవడంతో పరిస్థితి మారిపోయింది. పోటీనుంచి పటేల్‌ను తప్పించి గంగూలీని నిలుపడం చకాచకా జరిగిపోయాయి. అమిత్ షా ఆదేశాల మేరకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ రంగప్రవేశంతో గంగూలీకి మార్గం సుగమమైంది. భారీ బలగంతో పటేల్ గెలుపు ఖాయమనుకుంటున్న తరుణంలో గంగూలీ ఒక్కడే అధ్యక్ష పదవికి నామినేషన్ వేస్తున్నాడని శ్రీనివాసన్ ప్రకటించడంతో తెరవెనుక మంత్రాంగం బాగానే జరిగిందన్న విషయం సులువుగా అర్థమవుతున్నది. కొత్తగా కొలువుదీరబోతున్న బోర్డు కార్యవర్గంలో కార్యదర్శిగా అమిత్ షా తనయుడు జై షా, కోశాధికారిగా అనురాగ్ ఠాకూర్ తమ్ముడు అరుణ్‌సింగ్ ధుమాల్ బాధ్యతలు చేపట్టబోతున్నారు. అత్యంత ధనిక బోర్డుగా వర్ధిల్లుతున్న బీసీసీఐలో పాగా వేసేందుకు కేంద్ర పెద్దలు చేసిన ఎత్తులు ఫలించాయి. నేరుగా రాజకీయ నాయకుల ప్రభావం లేకపోయినా వాళ్ల బంధుగణంతో బోర్డులో అజమాయిషీ చెలాయించేందుకు ప్రయత్నిస్తున్నారు. కెప్టెన్‌గా తనకంటూ ఒక చరిత్రను లిఖించుకున్న దాదాను ముందుపెడుతూ బోర్డులో వారి ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నించే అవకాశం ఉండటమే ఒకింత ఆందోళన కలిగించే అంశం.

**కొత్తగా కొలువుదీరబోతున్న బోర్డు కార్యవర్గంలో కార్యదర్శిగా అమిత్ షా తనయుడు జై షా, కోశాధికారిగా అనురాగ్ ఠాకూర్ తమ్ముడు అరుణ్‌సింగ్ ధుమాల్ బాధ్యతలు చేపట్టబోతున్నారు. అత్యంత ధనిక బోర్డుగా వర్ధిల్లుతున్న బీసీసీఐలో పాగా వేసేందుకు కేంద్ర పెద్దలు చేసిన ఎత్తులు ఫలించాయి. నేరుగా రాజకీయ నాయకుల ప్రభావం లేకపోయినా వాళ్ల బంధుగణంతో బోర్డులో అజమాయిషీ చెలాయించేందుకు ప్రయత్నిస్తున్నారు. కెప్టెన్‌గా తనకంటూ ఒక చరిత్రను లిఖించుకున్న దాదాను ముందుపెడుతూ బోర్డులో వారి ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నించే అవకాశం ఉండటమే ఒకింత ఆందోళన కలిగించే అంశం.**

**జనగళం**

### పదోన్నతులు కల్పించాలె

రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలులో, శిశుసంక్షేమం, విద్యాభివృద్ధిలో అంగన్‌వాడీ టీచర్లు కీలక భూమిక పోషిస్తున్నారు. ఉద్యమ సమయంలో ఇచ్చినమాట ప్రకారం అంగన్‌వాడీ టీచర్ల సేవలను గుర్తించి ముఖ్యమంత్రి కేసీఆర్ వారి వేతనాలు పెంచటం హర్షణీయం. ప్రజాపక్షపాతిగా సీఎం కేసీఆర్ అన్నివర్గాల వారి సమస్యలను అడుగకున్నా తీరుస్తున్న తీరు శ్లాఘనీయం. ఈ క్రమంలోనే గతంలో మాట ఇచ్చినట్లుగా ఉన్నత చదువులు చదివి అంగన్‌వాడీ టీచర్లుగా పనిచేస్తున్న విద్యాధికులకు పదోన్నతులు కల్పిస్తే మరిన్ని ప్రయోజనాలు నెరవేరుతాయని అంగన్‌వాడీ టీచర్లు కోరుతున్నారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నది.

**- సీహెచ్ పద్మ, మిర్యాలగూడ, నల్లొండ జిల్లా**

### అవినీతి అదుపు ఆవశ్యం

ఈ మధ్యన అవినీతి అధికారులు ఏసీబీ వలలో చిక్కుతున్న ఉదంతాలు చూస్తుంటే అవినీతి, అక్రమాలపై ప్రభుత్వ కఠినంగా వ్యవహరిస్తున్నట్టు కనిపిస్తున్నది. ఈ విధంగానే రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖలపై కూడా దృష్టిసారించి అవినీతిపరులకు కళ్లెం వేయాలి. అలక్ష్యంగా వ్యవహరించిన పంచాయతీ సెక్రటరీలను జిల్లా కలెక్టర్లు సస్పెండ్ చేయటం కూడా ముదావహం. అవినీతికి పాల్పడుతున్న పెద్ద తిమింగలాలను కూడా వలవేసి పట్టుకోవాలి. ప్రభుత్వ శాఖల్లో పారదర్శకతను పాదుకొల్పాలి.

**- వీర పూర్ణచందర్‌రావు, హైదరాబాద్**

### ప్రభుత్వ పాఠ్యపుస్తకాలే పెట్టాలె

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు పెట్టకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. దీంతో ఆ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మోడల్ స్కూళ్ల ప్రవేశపరీక్షలు రాయాలంటే ప్రైవేటే పాఠశాల విద్యార్థులు రాయలేకపోతున్నారు. కాబట్టి అన్ని ప్రభుత్వ గుర్తింపు ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ పాఠ్యపుస్తకాలనే బోధించేట్లు చర్యలు తీసుకోవాలి.

**- జి.అశోక్, గోదూర్, జగిత్యాల జిల్లా.**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

ఆలోకన



**టంకశాల అశోక్**

# వాస్తవాలు పట్టని కమ్యూనిస్టులు

**సమాజంలో మార్పులు సహజ పరిణామక్రమంలో రావటం (ఎవొల్యూషన్) ఒక పద్ధతి అయితే, సమాజంలోని కొన్ని శక్తుల అసాధారణ వత్తిడి వల్ల అసాధారణమైన మార్పులు రావటం (రివల్యూషన్) మరొక పద్ధతి. వీటిలో దేనికైనా ఆధారం వాస్తవ పరిస్థితులే. ఫ్రెంచ్ విప్లవం వంటి బూర్జువా విప్లవమైనా, పారిశ్రామిక విప్లవం వంటి వస్తుపర విప్లవమైనా, రష్యా-చైనాల వంటి వామపక్ష సైద్ధాంతిక విప్లవాలైనా అన్నిటికీ ఇది వర్తిస్తుంది. వాస్తవ పరిస్థితులకు ఆయా శక్తుల ఆచరణ తగువిధంగా తోడవ్వాలి. ఇది తెలంగాణ కమ్యూనిస్టులకు అర్థం కావటం లేదు.**

తెలంగాణ కమ్యూనిస్టులకు అస్పష్టతలు, డైలమాలు ఇంకా ఆంధ్రప్రదేశ్ ఏర్పడకముందు రైతాంగ పోరాట కాలం నుంచే మొదలయ్యాయి. అప్పటినుంచి ఈ సరికి 70 సంవత్సరాలు గడిచిన తర్వాత, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా కొనసాగుతున్నాయి. రైతాంగ పోరాటం కొద్దికాలం సాగినాక దానిని అణిచివేసేందుకు కేంద్ర ప్రభుత్వ బలగాలు రావటంతో, పోరాటాన్ని కొనసాగించటం సరైనదా లేక విరమించటమా అనే డైలమా ఎదురైంది. ఆ డైలమాకు కారణం తెలంగాణలోని వాస్తవ పరిస్థితులా లేక కేంద్ర బలగాలను తాము తట్టుకొనలేకపోవటమా? చివరికి కొందరు పోరాటాన్ని విరమించగా, కొందరు కొనసాగించి ఓడిపోయారు. భారతదేశ వాస్తవాలపై, సామాజిక-రాజకీయ-ఆర్థిక పరిస్థితులపై వారి అస్పష్టతలు, డైలమాలు అప్పటినుంచే మొదలై ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఇవి ఆ తర్వాతకాలంలో మితవాద, అతివాద, తీవ్రవాద, అతి తీవ్రవాద రూపాలలో అనేక చీలికలకు దారితీశాయి. సిద్ధాంతం ఒకటే అని చెప్పినా పరిస్థితులపై భిన్నమైన అవగాహనలు, ఆచరణపై భిన్న వ్యూహాలు ఉండటం సహజం. కానీ అవన్నీ చివరకు ఎక్కడికి దారితీశాయి, ఎటువంటి పరిస్థితి సృష్టించాయి అన్నది కమ్యూనిస్టులకు ఎంత ముఖ్యమవుతున్నదో తెలియదు గాని, సాధారణ ప్రజానీకానికి మాత్రం తప్పకుండా ముఖ్యమైన విషయమే. దానినిబట్టే వారు కమ్యూనిస్టుల పట్ల తమ వైఖరిని నిర్ణయించుకుంటారు. ఈ రోజున తెలంగాణలో జరుగుతున్నది అదే. మొత్తం దేశంలోనూ అదే జరుగుతున్నది.

వీరి రెండవ ప్రధానమైన డైలమా బ్రిటిష్ పాలకుల నిష్క్రమణతో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందా లేదా అన్నది. వలసపాలన పోవటం దేశంలో సాధారణ ప్రజల సంతోషానికి కారణమైంది. బయటివారి దోపిడీ, అణిచివేతలకు వ్యతిరేకంగా అన్నివర్గాల ప్రజలు వందల సంవత్సరాల పాటు పోరాడిన నేపథ్యంలో 1947 నాటి మార్పు ప్రజలకు ఒక పెద్ద మార్పుగా కన్పించటం సహజం. కానీ కమ్యూనిస్టులలో కొందరు అసలేమీ మారలేదనగా, కొందరు పరిమితమైన మార్పు వచ్చిందన్నారు. వాస్తవాలతో నిమిత్తం లేకుండా అతివాద ఆదర్శపు వాదనలు చేయటంతో, వీరిమధ్య తదనంతరకాలపు చీలికలకు, బలహీనతలకు, వైఫల్యాలకు ఇదొక ముఖ్య కారణమైంది. ఇవే ప్రభావాలు తెలంగాణలోనూ ఉన్నాయి. వాస్తవ పరిస్థితులు ఏమిటన్నదానిపై ఎవరి అవగాహనలు వారికి ఉండటం సహజం గనుక అందులో ఆక్షేపించదగినది ఏమీలేదు గాని, ఆయా పరిస్థితులపై సాధారణ ప్రజాభిప్రాయం ఏమిటన్నది కూడా ఒక పరిశీలనాంశం అయితీరాలి. అట్లా కాకపోవటంలో అవివేకం చాలా ఉంటుందని కమ్యూనిస్టులకు అప్పటినుంచి ఈ రోజువరకు అనిపించినట్లు తోచదు.

ఇటువంటి మరొక డైలమా లేదా వాదోపవాదం భారతీయ వ్యవస్థ స్వభావం ఏమిటన్న దానిచుట్టూ తిరుగుతూ వస్తున్నది. మనది భూస్వామ్యమా? అర్ధ భూస్వామ్యమా? వలసా? అర్ధ వలసా? పెట్టుబడి దారీయా? బూర్జువానా? కాంప్రడార్ బూర్జువానా? వీటిలో ఏవైనా రెండో-మూడో సగాలు కలిసి ఉన్నాయా? వీటిలో ఈ దశ నుంచి ఏ దశకు మార్పు సిద్ధిస్తున్నది? ఏయే శక్తులు దేశభక్తి గలవైతే ఏవి దేశద్రోహకరమైనవి? వీటిలో ఏ శక్తులతో కలిసి విప్లవం కోసం పనిచేయాలి? ఇటువంటివే ఇంకా ఛప్పన్నారు ప్రశ్నలు. 70 ఏండ్లు గడిచినా తేలనివి. తాము ఏమి చేయాలో, తాము బూర్జువాలు అనే ఇతర పార్టీలతో కలిసి ఏమి చేయాలో సీపీఐ, సీపీఎంలకు అర్థం కాని ప్రశ్నలు. విప్లవకారులకు అంతే తేలని ప్రశ్నలు. రోజురోజుకు ఇంకా పెరుగుతున్న ప్రశ్నలు.

వీటన్నింటి మధ్యనుంచి క్రమంగా సాధారణమైన అభిప్రాయం ఒకటి ఏర్పడుతున్నది. ఈ చివరి నుంచి ఆ చివరికి గల కమ్యూనిస్టులలో ఎవరికి దేనిపట్ల స్పష్టత లేదు. అన్నీ డైలమాలే. ఎవరికి దేనిపట్లనైనా సరైన అధ్యయనం లేదు. పడికట్టు మాటలు, డైలాగులు తప్ప ఇటు తమ సిద్ధాంతాలను గాని, అటు భారతదేశ చరిత్ర-సమాజం-ఆర్థిక-సామాజిక-రాజకీయ-సాంస్కృతిక విషయాలను గాని, వర్తమాన వాస్తవాలను గాని చిత్తశుద్ధితో అధ్యయనం చేయరు. ఆయా విషయాలపై సాధారణ ప్రజలకు పెత్తందారీ ధోరణిలో బోధనలు చేయటం మినహా, వారు తమను గుడ్డిగా అనుసరించాలని భావించటం మినహా, ఆ ప్రజలకు తమ జీవితానుభవాల నుంచి కలిగిన అవగాహనలు ఉంటాయనుకోరు. అవేమిటో తెలుసుకొనజూడరు. వాటిని తమ సైద్ధాంతిక అవగాహనలతో, ఆచరణ వ్యూహాలతో జోడించరు. వీరికి రష్యా, చైనాల గురించి పూసగుచ్చినట్లు సమస్తం తెలుసునుగాని, తమ భారతదేశం గురించి అదేవిధమైన అధ్యయనాలు చేయరు. చేయటం అవసరమనే వారిని ఈసడిస్తారు. మార్క్సియన్ సిద్ధాంతకర్తల నుంచి, రష్యా-చైనా విప్లవాల నుంచి కొటేషన్లతో బెదరగొట్టి నోరుమూయిస్తారు. ఇటువంటి అనేకానేకం అన్నీ కలిసి భారతదేశపు కమ్యూనిస్టులను ప్రస్తుతం మనం చూస్తున్న దుస్థితికి తెచ్చాయి.

తెలంగాణ పరిస్థితి ఇందుకు భిన్నమైనది కాదు. రైతాంగ పోరాటం నాటి పరిణామాలు ఏమిటన్నది ఒక మౌలికమైన నేపథ్య తెరవంటిది. ఆ తర్వాత కాలానికి వస్తే, ఇక్కడి సాధారణ ప్రజలు ఆంధ్ర రాష్ట్రంతో విలీనానికి వ్యతిరేకంగా ఉన్నట్లు కేంద్రం నియమించిన ఫజల్ అలీ కమిషన్ స్వయంగా పేర్కొన్నది. అందుకు కారణాలను కూడా చెప్పింది. అప్పటికే ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన ఆంధ్ర ప్రాంతీయులు తమపై ఆధిపత్యం నడుపగలరనే భయాలు ఉన్నాయన్నది. అయినప్పటికీ కమ్యూనిస్టులు ఇటువంటి ప్రజాభిప్రాయం, వాస్తవాలు ముఖ్యమనుకున్నా రాలేక సీమాంధ్ర ధనికుల ప్రయోజనాలు, తమ గుడ్డి భాషాసిద్ధాంతం (అది చెల్లనిదని తమ గురువు స్టాలిన్ అప్పటికే ప్రకటించాడు) ముఖ్యమనా? వాస్తవాలతో, ప్రజాభిప్రాయంతో నిమిత్తం లేని వీరి ఈ వైఖరి 1956 తర్వాత కూడా కొనసాగింది. ఇప్పటికీ కొనసాగుతున్నది. అందువల్లనే తెలంగాణ శాసనసభలో వరుసగా రెండుసార్లు కనీస ప్రాతినిధ్యాన్ని అయినా తమ వీరోచిత రైతాంగపోరాట చరిత్ర ఇవ్వలేకపోయింది. మొదటి సభలో గెలిచిన ఏకైక సభ్యుడు సైతం నిలువని స్థితికి కూడా ఈ వైఫల్యాలే కారణం.

1956 నుంచి 2014 వరకు తెలంగాణలోని వాస్తవాలు, పరిణామాలు ఏమిటో, ఈ ఉభయ కమ్యూనిస్టు పార్టీల అవాస్తవిక వైఖరులు ఏమిటో వివరమైన పరిశోధన ఏదీ ఇంతవరకు జరుగలేదు. రైతాంగ పోరాటం తర్వాత ఇక తెలంగాణ అనేదిగాని, తెలంగాణ ప్రజలు అనేవారు గాని, తమ పాత్ర గాని అంటూ ఏమైనా ఉంటే ప్రత్యేక రాష్ట్రవాదన-సమైక్య వాదన అనే దాని చుట్టూ మాత్రమే తిరిగినట్లు ఉభయ కమ్యూనిస్టులు భావిస్తారు. చివరికి తెలంగాణ ఏర్పడిన తర్వాత వీరి దృష్టి ఇక్కడి వాస్తవాలపై, ప్రజల అభిప్రాయాలూ ఆకాంక్షలపై, భవిష్యత్తు అభివృద్ధిపై ఉండాలి. వందల ఏండ్లుగా రకరకాల పీడనలకు గురై, ఆరాటపడి ఉద్యమాలు సాగించిన ప్రజలు వర్తమానంలో ఏమి ఆలోచిస్తున్నారనేది గమనికలోకి తీసుకోవాలి. కమ్యూనిస్టులకు తమ సిద్ధాంతాలు, లక్ష్యాలు తమకు ఉండటంలో అభ్యంతరం చెప్పదగింది లేదు. కానీ ఆ ప్రకారం సాగించే తమ ఆచరణకు, ప్రజల ఆలోచనలకు, అభివృద్ధి అవసరాలకు మధ్యదూరం ఎంత పెరిగితే, తమకు-ప్రజలకు మధ్య దూరం కూడా అంతగా పెరుగుతుంది. 1956 నుంచి 2 014 వరకు, ఆ తర్వాత కూడా అట్లా పెరుగుతూ వస్తున్నది కనుకనే తెలంగాణ కమ్యూనిస్టులు ఇంత దయనీయ స్థితిలో ఉన్నారు. దానిని తగ్గించుకుంటారా?

**1956 నుంచి 2014 వరకు తెలంగాణలోని వాస్తవాలు, పరిణామాలు ఏమిటో, ఈ ఉభయ కమ్యూనిస్టు పార్టీల అవాస్తవిక వైఖరులు ఏమి టో వివరమైన పరిశోధన ఏదీ ఇంతవరకు జరుగలేదు. రైతాంగ పోరాటం తర్వాత ఇక తెలంగాణ అనేదిగాని, తెలంగాణ ప్రజలు అనేవారు గాని, తమ పాత్ర గాని అంటూ ఏమైనా ఉంటే ప్రత్యేక రాష్ట్రవాదన-సమైక్య వాదన అనే దాని చుట్టూ మాత్రమే తిరిగినట్లు ఉభయ కమ్యూ నిస్టులు భావిస్తారు. చివరికి తెలంగాణ ఏర్పడిన తర్వాత వీరి దృష్టి ఇక్క డి వాస్తవాలపై, ప్రజల అభిప్రాయాలూ ఆకాంక్షలపై, భవిష్యత్తు అభివృ ద్ధిపై ఉండాలి. వందల ఏండ్లుగా రకరకాల పీడనలకు గురై, ఆరాటపడి ఉద్యమాలు సాగించిన ప్రజలు వర్తమానంలో ఏమి ఆలోచిస్తున్నారనేది గమనికలోకి తీసుకోవాలి.**

# శాశ్వత పరిష్కారమే మార్గం

విశ్లేషణ

**కోదండరామయ్య పారుపల్లి**

గత శతాబ్దపు మొదట్లో ప్రపంచంలో ఎక్కువమంది సామ్యవాద కలలుగన్నారు. ఏ రకమైన దోపిడీ ఉండకుండా ఉండాలంటే ఉత్పత్తి శక్తులన్నీ ప్రభుత్వం చేతుల్లోనే ఉండాలని, ఎవరికీ వ్యక్తిగత ఆస్తి ఉండకూడదనుకున్నారు. మొదటి ప్రపంచయుద్ధం అయిపోయేటప్పటికి ఒక సామ్యవాద ప్రభుత్వం ఏర్పడింది. రెండవ ప్రపంచయుద్ధం అయ్యేసరికి సామ్యవాద దేశాల సంఖ్య 15 దాకా పెరిగింది. అది 25 దాకా పెరిగినా త్వరలోనే భ్రమలు పటాపంచలయ్యాయి. చివరికి ప్రజాస్వామ్యమే లేని దేశాలుగా మారి నియంతల చేతుల్లోకి వెళ్లిపోయాయి. త్వరగానే ప్రజలు ఈ ఘోరాన్ని తెలుసుకున్నారు. బెర్లిన్ గోడను కూల్చివేశారు. రెండు మూడు దేశాలు సోషలిస్టు దేశాలమని చెప్పుకుంటున్నా అక్కడ పెట్టుబడిదారీ వ్యవస్థ నియంతల చేతుల్లో ఉన్నదనే విషయం అందరికీ తెలిసిందే.

దేశంలో పీవీ నర్సింహారావు తెగించి ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఒకేసారి ప్రైవేట్ అనలేక ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పర్చి వాటికి రవాణా శాఖ బస్సులను, విద్యుత్తు, వగైరాలను అప్పగించారు. అంటే అటువంటి కార్పొరేషన్లు తమ కాళ్లమీదనే అవి నిలబడాలి. వాటి ఖర్చులను, అందులోని ఉద్యోగుల జీతాలు అవే సంపాదించుకోవాలి. ఇప్పుడు ప్రైవేట్ సంస్థలు 90 శాతం కన్నా ఎక్కువ ఉన్నాయి. ప్రభుత్వం ఇంకా బేరం పనిలో ఉండాలని కోరేవారు ఈ దేశ ప్రజల సౌకర్యాలను కోరుకోవటం లేదు. ఈ దేశపు అభివృద్ధికి కూడా వారు కావాలనే అడ్డుతగులుతున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో కలుపాలనే కోరికను కూడా ఈ నేపథ్యం లోంచే చూడాలి.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయటం నిశ్చయంగా వెనుకడుగే. ప్రపంచమంతా ప్రభుత్వాలు బేరసారాల్లో ఉండకూడదనుకుంటున్నాయి. కేంద్రంలో ఇప్పటిదాకా 20 పార్టీలు వివిధ సందర్భాల్లో అధికారంలోకి వచ్చాయి. అన్ని పార్టీలు ఏటా కొద్దో గొప్పో ప్రభుత్వరంగ ఆస్తులను అమ్ముతూనే ఉన్నాయి. ఈ ధోరణికి ఇది పెద్ద ఎదురుదెబ్బ అవుతుంది. పని చేయలేని కార్మికులను దేశమంతటా రెచ్చగొట్టినట్లు అవుతుంది. బస్సు ప్రయాణికులు ఎప్పుడైనా ఇది ఒక సంస్థగా కాకుండా ప్రభుత్వంలో ఒక శాఖగా ఉండాలని కోరారా? ఒక వినతి పత్రాన్ని ఇచ్చారా? ఈ కోరిక ఉద్యోగుల నుంచి మాత్రమే వస్తున్నది ఎందుకు? వారు బస్సులను నడిపి, సంపాదించి బడుగువర్గాలకు సహాయం చేద్దామనా? కానేకాదు. ఇప్పుడు వారి జీతాలను ఆర్టీసీ భరిస్తున్నది. ఉద్యోగుల సామర్థ్యలేమి వల్ల జీతాలను సంస్థ భరించలేని పరిస్థితి ఏర్పడుతున్నది. జీతాల పరిస్థితే ఇలా ఉంటే జీతాల పెరుగుదల ఎక్కడ. పరిస్థితి ఇలాగే ఉంటే ఉద్యోగ భద్రత కూడా ముప్పులో పడ్డట్లే. అదే ప్రభుత్వంలో ఒక శాఖ అయితే ఇక ఆదాయంతో సంబంధమే ఉండదు. ప్రభుత్వ దవాఖానలు, రోడ్లశాఖ, నీటి పారుదల శాఖ లాంటివి ఖర్చు పెట్టేటప్పుడు ఆదాయాన్ని గురించి ఆలోచించవు. అలానే బస్సు వ్యవస్థ కూడా ఉంటే సమ్మె చేసి, ఒత్తిడిని తెచ్చి తమ గొంతెమ్మ కోరికలను సాధించుకోవచ్చు. ఎంత అసమర్థంగా పని చేసినా ఉద్యోగ భద్రతకు ముప్పే లేదు. ఆర్టీసీలో జీతం సరిగా రావటం లేదనీ, జీతాలను సరిగా పెంచటం లేదనీ, ఉద్యోగ భద్రత, పింఛన్ లేదనీ ఉద్యోగులు అంటున్నారు. జీతాలు సరిగా రావకపోటానికి కారణం సరైన ఆదాయం వచ్చేట్లు ఉద్యోగులు కావలిసిన పనిచేయకపోవటమే. జీతాల ను పెంచకపోవటానికి కారణం కూడా అదే.

ఈ ఉద్యోగులు పదవీవిరమణ చేశాక వీరికి జీవితాంతం జీతం లాగ పింఛన్ ఇస్తూనే ఉండాలనటం అసమంజసం. పనికి సంబం ధం లేకుండా చెల్లింపులుంటే ఆర్థికమైన అభివృద్ధి ఉండదు. ప్రభుత్వ ఆదాయాన్ని ఇలా చెల్లిస్తుంటే ఆ రాష్ట్రం కూడా వెనుకబడిపోతుంది.

అసలు జీతాలు ఎలా నిర్ణయించబడుతాయో మనం కొంత గమనించాలి. ఒక ఉద్యోగి తొలిగిపోతే వేరే ఉద్యోగి రూ.10 వేలకు వచ్చే అవకాశం ఉండగా లక్ష రూపాయలు ఇచ్చి ఉద్యోగిని తీసుకోరు. ఏదైనా కృత్రిమ ఏర్పాట్లతో లక్ష రూపాయలు ఇస్తే అటువంటి సంస్థలు ఎక్కువకాలం ఆ కొనసాగవు. అటువంటి కృత్రిమ వ్యవస్థలు ఈ ప్రపంచపోటీలో బతుకలేవు. మార్కెట్ రేట్ కన్నా ఎక్కువ జీతం ఇస్తే ఆ దేశం తన సరుకులను, సేవలను అందించటంలో ఇతర దేశాలతో పోటీపడలేదు. తక్కువ జీతం ఇస్తే నీ మనుషులు ఇతర వ్యవస్థలకు, దేశాలకు పారిపోతారు.

నిజంగా ఈ సమ్మె చేస్తున్న ఉద్యోగులకు తక్కువ జీతాలు వస్తుంటే వారు ఈ సంస్థలో పనిచేయటం మానివేయవచ్చు. కానీ వారికి తెలుసు వారు బయటకుపోతే ఇంతకన్నా తక్కువ జీతానికి పనిచేసేవారు సంస్థకు దొరుకుతారు. వారికి మాత్రం బయట పనే దొరుకదు. అందుకని వారు ఈ సంస్థ గుత్తాధిపత్యాన్ని వాడుకొని, పండుగరోజుల్లో ప్రజలను ఇబ్బందులకు గురిచేసి ప్రభుత్వం మీద ఒత్తిడిని తెచ్చి పబ్బం గడుపుకోవాలని చేస్తున్న ఆలోచనే ఈ సమ్మె. ఏ మాత్రం ప్రజా సంక్షేమం పట్ల నిబద్ధత ఉన్న ప్రభుత్వమైనా ఇలాంటి ఒత్తిడికి లొంగకూడదు.

ఆర్టీసీ ఉద్యోగులు ఇప్పుడు చేస్తున్న సమ్మె న్యాయసమ్మతమైనదేనా అంటే, కాదనే చెప్పాలె. న్యాయస్థానాలు కూడా అలాంటి సమ్మెలను చేయకూడదని తీర్పులు ఇచ్చాయి. చట్టబద్ధంగా ఉద్యోగులు నడువదలుచుకుంటే ముందు న్యాయబద్ధతను కోర్టులో తేల్చాలి. తరువాత సమ్మెలోకి దిగాలి. ఎవరైనా సమ్మెకు దిగేముందే ఆలోచించాలి తమ పరిస్థితి గురించి. ముందుచూపు లేకుండా చేస్తే పశ్చాత్తాపపడుతారు. సమ్మె చేయటానికి ప్రధాన కారణం సంఘాల గుత్తాధిపత్యమే. దానికి శాశ్వత చికిత్సకు ఇప్పుడు అవకాశం వచ్చింది. ఈ విషయమై ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపు ముదావహం. ఆర్టీసీలో 20 శాతం కాదు, 50 శాతం వరకు ప్రైవేట్ స్టేజీ క్యారీర్ల ను అనుమతించాలి. దానివల్ల ప్రభుత్వానికి, బ్యాంకులకు, బడుగువర్గాలకు, ప్రయాణికులకు మేలు జరుగుతుందనడంలో సందేహం లేదు.


ఈ చట్ట వ్యతిరేక సమ్మెను తగురీతిలో పరిష్కరించి ఇటువంటి సమ్మె మళ్లీ జరుగకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. బడుగువర్గాల డబ్బులు అనవసరంగా ఖర్చుచేయకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ సరైన, శాశ్వత పరిష్కారాన్ని కనుగొంటారని ఈ రాష్ట్ర ప్రజలే కాదు, దేశ ప్రజలు కూడా ఆసక్తితో ఎదురుచూస్తున్నారు.

**ఆర్టీసీ ఉద్యోగులు ఇప్పుడు చేస్తున్న సమ్మె న్యాయసమ్మతమైనదేనా అంటే, కాదనే చెప్పాలె. న్యాయస్థానాలు కూడా అలాంటి సమ్మెలను చేయకూడదని తీర్పులు ఇచ్చాయి. చట్టబద్ధంగా ఉద్యోగులు నడువదలుచుకుంటే ముందు న్యాయబద్ధతను కోర్టులో తేల్చాలి. తరువాత సమ్మెలోకి దిగాలి. ఎవరైనా సమ్మెకు దిగేముందే ఆలోచించాలి తమ పరిస్థితి గురించి.**

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

# ఎన్నెన్నో మలుపులు

## అయోధ్య వివాదానికి 134 ఏండ్ల చరిత్ర



**1528:** మొఘల్ చక్రవర్తి బాబర్ హయాంలో బాబ్రీ మసీదు నిర్మాణం.

**1885:** వివాదాస్పద రామజన్మభూమి-బాబ్రీ మసీదు కట్టడం వెలుపల మండపం నిర్మాణానికి అనుమతి కోసం ఫైసలాబాద్ జిల్లా కోర్టులో మహంత్ రఘువీర్‌దాస్ పిటిషన్ దాఖలు.. తిరస్కరించిన కోర్టు.

**1949:** కట్టడం వెలుపల రామ్‌లల్లా (బాల రాముడి) విగ్రహాల ప్రతిష్ట

**1950:** విగ్రహాలకు పూజ చేసేందుకు అనుమతి కోసం ఫైసలాబాద్ జిల్లా కోర్టులో పిటిషన్ వేసిన గోపాల్ సిమ్లు విశారద్.

**1959:** వివాదాస్పద స్థలం కోసం నిర్మోహి అఖారా పిటిషన్.

**1981:** ఆ స్థలం కోసం యూపీ సున్నీ వక్ఫ్ బోర్డు కూడా వ్యాజ్యం దాఖలు.

**1986 ఫిబ్రవరి 1:** హిందూ భక్తుల కోసం ఆ స్థలాన్ని తెరువాలని స్థానిక కోర్టు ఆదేశాలు.

**1989 ఆగస్టు 14:** యథాతథ స్థితి కొనసాగించాలని అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులు.

**1992 డిసెంబర్ 6:** బాబ్రీ మసీదు కూల్చివేత.

**1993 ఏప్రిల్ 3:** వివాదాస్పద స్థలం స్వాధీనానికి కేంద్రం చట్టం. దాన్ని సవాల్ చేస్తూ ఇస్మాయిల్ ఫారుఖీ తదితరుల పిటిషన్లు.

**1994 అక్టోబర్ 24:** ఇస్లాంలో మసీదు అంతర్భాగం కాదంటూ ఇస్మాయిల్ ఫారుఖీ కేసులో సుప్రీంకోర్టు సంచలన తీర్పు.

**2002 ఏప్రిల్:** వివాదాస్పద స్థలం ఎవరికి చెందాలన్నదానిపై అలహాబాద్ హైకోర్టులో విచారణ ప్రారంభం.

**2003 మార్చి 13:** సమీకరించిన భూమిలో ఎలాంటి మతపరమైన కార్యక్రమాలు చేపట్టొద్దని సుప్రీంకోర్టు ఆదేశాలు.

**2010 సెప్టెంబర్ 30:** వివాదాస్పద స్థలాన్ని సున్నీ వక్ఫ్ బోర్డు, నిర్మోహి అఖారా, రామ్‌లల్లా మధ్య సమానంగా పంచుతూ అలహాబాద్ హైకోర్టు తీర్పు.

**2011 మే 9:** హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే.

**2017 మార్చి 21:** కోర్టు వెలుపల వివాదాన్ని పరిష్కరించుకోవాలని నాటి సీజేఐ జేఎస్ ఖేహర్ సూచన.

**2017 ఆగస్టు 7:** 1994నాటి సుప్రీంకోర్టు తీర్పును సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్లపై త్రిసభ్య ధర్మాసనం ఏర్పాటు.

**2018 ఫిబ్రవరి 8:** సివిల్ అప్పీళ్లపై సుప్రీంకోర్టు విచారణ ప్రారంభం.

**జూలై 20:** సుప్రీంకోర్టు తీర్పు రిజర్వ్

**సెప్టెంబర్ 27:** కేసును ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగించేందుకు సుప్రీంకోర్టు నిరాకరణ. అక్టోబర్ 29న త్రిసభ్య ధర్మాసనం విచారిస్తుందని వెల్లడి.

**అక్టోబర్ 29:** జనవరి మొదటి వారంలో విచారణ చేపడుతుందని వెల్లడి.

**2019 జనవరి 8:** సీజేఐ గొగోయ్ నేతృత్వంలో ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఏర్పాటు.

**జనవరి 29:** 67 ఎకరాలను అసలైన యజమానులకు తిరిగిచ్చేందుకు అనుమతించాలని సుప్రీంకు కేంద్రం విన్నపం.

**మార్చి 8:** అయోధ్య వివాదంపై జస్టిస్ ఖలీఫుల్లా నేతృత్వంలో మధ్యవర్తిత్వ కమిటీని నియమించిన సుప్రీంకోర్టు.

**మే 9:** సుప్రీంకోర్టుకు మధ్యంతర నివేదికను సమర్పించిన కమిటీ.

**ఆగస్టు 1:** తుది నివేదిక అందజేత.

**ఆగస్టు 2:** మధ్యవర్తిత్వం విఫలమైందన్న కోర్టు. ఆగస్టు 6 నుంచి రోజువారీ విచారణ చేపడుతామని వెల్లడి.

**ఆగస్టు 6:** రోజువారీ విచారణ ప్రారంభం.

**అక్టోబర్ 4:** అక్టోబర్ 17తో విచారణ పూర్తి చేసి, నవంబర్ 17నాటికి తుది తీర్పు వెలువరిస్తామన్న సుప్రీంకోర్టు.

**అక్టోబర్ 16:** విచారణ ముగించిన సుప్రీంకోర్టు. తీర్పు రిజర్వ్.



అయోధ్య కేసు తుదివిచారణ నేపథ్యంలో బుధవారం ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య నగరంలో ఆంక్షలు విధించారు. ఈ సందర్భంగా ఓ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

## హిందూ పక్షాల వాదనలు

1. శతాబ్దాల కిందట చక్రవర్తి విక్రమాదిత్య పాలనలో అయోధ్యలో రామాలయ నిర్మాణం జరిగింది. సుమారు 11వ శతాబ్దంలో దాన్ని పునర్నిర్మించారు. 1526లో బాబర్ హయాంలో ఆలయాన్ని కూల్చివేశారు. 17వ శతాబ్దంలో ఔరంగజేబు కూల్చివేశాడన్న అభిప్రాయం కూడా ఉంది.
2. స్కంద పురాణం వంటి చారిత్రక రచనలతోపాటు పలువురు సందర్శకుల కథనాల ప్రకారం అయోధ్య శ్రీరాముడి జన్మస్థలం అన్నది ప్రజల విశ్వాసం.
3. మసీదుకు సంబంధించిన ఇస్లామిక్ రచనలు పవిత్ర ఖురాన్‌ను, హదిత్‌ను ఉల్లంఘిస్తున్నాయి.
4. రామమందిరం ఒకప్పుడు ఉండేదని, దానిని కూల్చివేశారని భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) నివేదిక రుజువు చేస్తున్నది.

## ముస్లిం పక్షాల వాదనలు

1. 1528 నాటి నుంచి ఆ వివాదాస్పద స్థలంలో మసీదు ఉన్నది. 1855, 1934లో మసీదుపై దాడులు జరిగాయన్న రికార్డులను బట్టి అక్కడ మసీదు ఉన్నదని నిర్ధారణ అవుతున్నది.
2. బాబర్ మసీదుకు నిధులు( గ్రాంట్) ఇచ్చారన్నది బ్రిటిష్ ప్రభుత్వం కూడా గుర్తించింది. అనంతరం నవాబులు దాన్ని కొనసాగించారు.
3. 1885నాటి వ్యాజ్యానికి సంబంధించిన పత్రాలు మసీదు ఉనికిని నిర్ధారిస్తున్నాయి. ఆ స్థలం ముస్లింల అధీనంలోనే కొనసాగుతూ వచ్చింది. 1949 డిసెంబర్ 22, 23 వరకు అక్కడ ఈద్ ప్రార్థనలు జరిగాయి.
4. మసీదు కింద ఆలయ శిథిలాలు ఉన్నాయన్న ఎస్ఎస్ఐ నివేదికలోని అంశాలు శాస్త్రీయంగా నిరూపితం కాలేదు.



# సుప్రీం తీర్పు రిజర్వ్

మొదటిపేజీ తరువాయి...

సీజేఐ గొగోయ్ పదవీ విరమణ చేయనుండటంతో ఆలోపే తీర్పు వెలువడొచ్చని అంచనా. అయితే నవంబర్ 4 నుంచి 17వ తేదీలోగా తీర్పు వెలువడవచ్చనే వార్తలు వస్తున్నాయి. హిందూ మహాసభ తరపు న్యాయవాది వరుణ్ సిన్హా మీడియాతో మాట్లాడుతూ 23 రోజుల్లోగా తీర్పు రావొచ్చని చెప్పారు. కాగా, అయోధ్య కేసులో జరిగిన విచారణ సుప్రీంకోర్టు చరిత్రలో సుదీర్ఘంగా సాగిన రెండో విచారణగా రికార్డు సృష్టించింది. గతంలో కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు ధర్మాసనం అత్యధికంగా 68 రోజులు విచారణ జరిపింది.

### గంట ముందే ముగిసిన విచారణ

బుధవారం 40వ రోజు విచారణ సందర్భంగా సీజేఐ రంజన్ గొగోయ్ నేతృత్వంలో జస్టిస్‌లు ఎస్ఏ బోబ్డే, డీవై చంద్రచూడ్, అశోక్ భూషణ్, ఎస్‌కే నజీర్‌తో కూడిన ధర్మాసనం హిందూ, ముస్లిం పక్షాల వాదనలను విన్నది. విచారణ ప్రారంభం కాగానే సాయంత్రం 5 గంటల వరకే వాదనలు వింటామని సీజేఐ స్పష్టం చేశారు. షెడ్యూల్ ప్రకారం కక్షిదారులకు సమయాన్ని కేటాయించారు. చివరికి గంట ముందుగానే వాదనలు ముగిశాయి. బుధవారం న్యాయస్థానంలో వాడివేడి వాదనలు, నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. మొఘల్ చక్రవర్తి బాబర్ అయోధ్యలోని వివాదాస్పద స్థలంలో మసీదును నిర్మించాడనే వాదనను సున్నీ వక్ఫ్‌బోర్డ్ సహా ముస్లిం కక్షిదారులు నిరూపించలేకపోయారని హిందూ కక్షిదారుల తరపు న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ పేర్కొన్నారు. వివాదాస్పద 2.77 ఎకరాల స్థలంపై తమకే హక్కులు కల్పించాలంటూ 1961లో సున్నీ వక్ఫ్‌బోర్డు వేసిన దావాకు వ్యతిరేకంగా ఆయన బుధవారం వాదనలు వినిపించారు. ఆ స్థలానికి నిజమైన యజమాని ఎవరో వారు నిరూపించలేకపోయారని చెప్పారు. అక్కడ దీర్ఘకాలంగా రాముడికి పూజలు జరుగుతున్నాయన్న నిజాన్ని బోర్డు అంగీకరించాలని సూచించారు. నిర్మోహి అఖాడా తరపున హాజరైన సుశీల్ జైన్ వాదిస్తూ వివాదాస్పద స్థలంలోని కట్టడం పూర్వకాలం నుంచి ఆలయంగా కొనసాగుతున్నదని చెప్పారు.

### వెనక్కి తగ్గిన సున్నీ వక్ఫ్‌బోర్డు!


వివాదాస్పద స్థలం తమదేనంటూ వాదిస్తున్న సున్నీ వక్ఫ్‌బోర్డు వెనక్కి తగ్గినట్టు సమాచారం. 2.77 ఎకరాల స్థలంపై హక్కులు కల్పించాలంటూ బోర్డు గతంలో వేసిన దావాను వెనక్కి తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నదని గతంలో సుప్రీంకోర్టు ఏర్పాటుచేసిన మధ్యవర్తుల కమిటీ రాజ్యాంగ ధర్మాసనానికి సమాచారం అందించింది. బోర్డు సభ్యుల మధ్య వివాదాలు చెలరేగడం, బోర్డుకు చెందిన స్థలాలను అధ్యక్షుడు జడ్ఏ ఫారూఖీ అక్రమంగా అమ్మేశారన్న ఆరోపణలపై కేసు నమోదు కావడం, ఈ అంశంలో సీబీఐ విచారణకు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ఆదేశించడం వంటి కారణాల వల్లే అయోధ్య కేసు నుంచి సున్నీ వక్ఫ్ బోర్డు తప్పుకుంటున్నట్టు సమాచారం. అయితే ఈ వాదనలను బోర్డు తరపు న్యాయవాదుల్లో ఒకరైన జఫర్యాబ్ జిలానీ ఖండించారు. దావాను వెనక్కి తీసుకోవాలంటే కోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాల్సి ఉంటుందని, ఇప్పటివరకు అలాంటిదేమీ జరుగలేదని స్పష్టం చేశారు.

### మధ్యవర్తిత్వ కమిటీ నివేదికపై నేడు చర్చ

ఈ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు గతంలో ఏర్పాటుచేసిన మధ్యవర్తిత్వ కమిటీ తమ నివేదికను బుధవారం సీల్డ్‌కవర్‌లో రాజ్యాంగ ధర్మాసనానికి అందజేసింది. ఈ నివేదికపై ధర్మాసనం గురువారం అంతర్గత విచారణ (క్లోజ్డ్ డోర్ ప్రొసీడింగ్స్) జరుపనున్నది. అనంతరం తదుపరి కార్యాచరణ నిర్ణయించనున్నది. సుప్రీంకోర్టు ఈ ఏడాది మార్చి 8న జస్టిస్ ఎఫ్ఎంఐ ఖలీఫుల్లా నేతృత్వంలో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్, సీనియర్ న్యాయవాది శ్రీరామ్ పంచు సభ్యులుగా మధ్యవర్తిత్వ కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ నాలుగు నెలలపాటు చర్చలు జరిపినా పరిష్కారం లభించలేదు.

### ఇదీ కోర్టు వివాదాల చరిత్ర

అయోధ్యలోని వివాదాస్పద 2.77 ఎకరాల స్థలాన్ని మూడు సమాన భాగాలుగా చేసి కక్షిదారులైన రామ్ లల్లా, నిర్మోహి అఖాడా, సున్నీ వక్ఫ్‌బోర్డుకు సమానంగా పంచాలని 2010లో అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో 14 పిటిషన్లు దాఖలయ్యాయి. ఏండ్లపాటు వాదోపవాదనలు జరిగిన అనంతరం ఈ వివాదాన్ని మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు ఈ ఏడాది ప్రారంభంలో సూచించింది. ముగ్గురు మధ్యవర్తులతో కమిటీని ఏర్పాటుచేసింది. అయితే మధ్యవర్తిత్వం విఫలం కావడంతో ఆగస్టు 6 నుంచి రోజువారీ విచారణ ప్రారంభించింది.




బుధవారం న్యాయవాది రాజీవ్ ధవన్ ఇటువంటి 'అయోధ్య భూమి మ్యాప్'నే చింపారు

### సుప్రీంకోర్టు తీర్పును గౌరవిద్దాం

అయోధ్య కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు ఎలాంటి తీర్పు ఇచ్చినా అందరూ శిరసావహించాల్సిందేనని పలువురు ముస్లిం నేతలు పిలుపునిచ్చారు. ఆలిండియా ఉలేమా కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి మౌలానా మహబూబ్ దర్యాది మాట్లాడుతూ.. కోర్టు మత విశ్వాసాల దృష్టిలో కాకుండా ఆధారాలను బట్టి తీర్పు వెలువరించాలని కోరారు. తీర్పు ఎవరి పక్షాన ఉన్నా, అవతలి పక్షం అంగీకరించాలన్నారు. తీర్పు సమయంలో ముస్లింలంతా సంయమనంతో ఉండాలని కోరారు. మరోవైపు అయోధ్యలో ఆంక్షలు విధించారు.

## మ్యాప్‌ను చింపేసిన న్యాయవాది

- అయోధ్య కేసు విచారణ సందర్భంగా న్యాయవాదుల మధ్య వాగ్వాదం
- ఆగ్రహం వ్యక్తం చేసిన ధర్మాసనం..



**న్యూఢిల్లీ:** అయోధ్య కేసుపై చివరి రోజు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టులో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ముస్లిం కక్షిదారుల తరపు న్యాయవాది రాజీవ్ ధవన్ కోర్టు గదిలోనే ఓ మ్యాప్‌ను చించివేయడం సంచలనంగా మారింది. అఖిల భారత హిందూ మహాసభ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ వాదనలు వినిపిస్తూ వివాదాస్పద భూమి రాముడు జన్మించిన స్థలమని దీర్ఘకాలంగా హిందువులు నమ్ముతున్నారని, అక్కడ పూజలు కూడా చేస్తున్నారని చెప్పారు. దీనికి సంబంధించి పలు పత్రాలను సమర్పించారు. వివాదాస్పద స్థలానికి సంబంధించి మాజీ ఐపీఎస్ అధికారి కిశోర్ కృణాల్ రాసిన 'అయోధ్య రీవిజిటెడ్' అనే పుస్తకంలోని కొన్ని పేజీలను, అందులో పొందుపరిచిన ఓ మ్యాప్‌ను ధర్మాసనానికి సమర్పించారు. దీనిపై రాజీవ్ ధవన్ అభ్యంతరం వ్యక్తంచేశారు. వీటి ప్రస్తావన ఇప్పుడు అనవసరమని, అలహాబాద్ హైకోర్టులో పేర్కొన్న అంశాల గురించే చర్చ జరుగాలని ధర్మాసనాన్ని కోరారు. వికాస్ సింగ్ తన వాదనలను కొనసాగిస్తుండగా ధవన్ పదేపదే అడ్డుపడ్డారు. దీంతో మ్యాప్‌ను రికార్డుల్లో చేర్చాలన్న తన వాదనను వెనక్కి తీసుకుంటున్నట్టు వికాస్‌సింగ్ తెలిపారు. ఈ నేపథ్యంలో 'మరి ఆ మ్యాప్‌ను ఏం చేయమంటారు?' అని ధవన్ ధర్మాసనాన్ని ప్రశ్నించగా.. 'మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండి. కావాలంటే ముక్కలుగా చింపేయొచ్చు' అని సీజేఐ చెప్పారు. దీంతో ధవన్ ఆ మ్యాప్‌ను ముక్కలుగా చించివేశారు. తర్వాత కూడా న్యాయవాదులిద్దరి మధ్య వాగ్వివాదం కొనసాగింది. ఈ పరిణామాలతో ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. వాదనలు ఇలాగే కొనసాగితే తాము బయటికి వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. అయితే.. ధవన్ ఉద్దేశపూర్వకంగానే పత్రాలను చించివేశారంటూ కోర్టు బయట విపరీతంగా ప్రచారం జరిగింది. భోజన విరామం అనంతరం వాదనల సందర్భంగా ధవన్ ఈ అంశాన్ని లేవనెత్తారు. దీనిపై సీజేఐ గొగోయ్ స్పష్టతనిచ్చారు. ధర్మాసనం చెప్పిన తర్వాతే రాజీవ్ ధవన్ ఆ మ్యాప్‌ను చించివేశారని చెప్పారు. ఈ విషయాన్ని కూడా ప్రచారం చేయాలని సూచించారు.

## సుప్రీంకోర్టు చరిత్రలో సుదీర్ఘ విచారణ.. కేశవానంద కేసు

**దేశంలో** ఏకధాటిగా అత్యధిక రోజులపాటు విచారణ జరిగిన వ్యాజ్యంగా కేశవానందభారతి కేసు (68 రోజులపాటు) రికార్డులకెక్కింది. కేరళలోని కాసర్‌గోడ్ జిల్లా ఎడ్నీర్‌లోని హిందూ మఠం ఆస్తులపై రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడాన్ని సవాలు చేస్తూ మఠం ప్రధాన పూజారి కేశవానంద భారతి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు భూసంస్కరణ చట్టాలను అడ్డం పెట్టుకొని తమ ఆస్తులపై ఆంక్షలు విధించేందుకు ప్రయత్నిస్తున్నదని తెలిపారు. ఈ కేసులో 1972, అక్టోబర్ 31న మొదలైన వాదనలు 68 రోజులపాటు సాగి 1973, మార్చి 23న ముగిశాయి. 13 మంది సభ్యుల ధర్మాసనం దీనిని విచారించింది. న్యాయమూర్తులు 7-6 మెజారిటీతో తీర్పును వెలువరించారు. పార్లమెంట్‌కు విస్తృత అధికారాలుంటాయని, అయితే రాజ్యాంగంలోని మౌలిక అంశాలను ధ్వంసం చేసే అధికారం లేదని తీర్పు చెప్పారు.

## సీజేఐ విదేశీ పర్యటనలు రద్దు

**సుప్రీంకోర్టు** చీఫ్ జస్టిస్ (సీజేఐ) రంజన్ గొగోయి తన విదేశీ పర్యటనలను రద్దుచేసుకున్నట్లు సమాచారం. వచ్చేనెల 17వ తేదీన పదవీ విరమణ చేయడానికి ముందు ఆయన కొన్ని దక్షిణ అమెరికా దేశాలు, మధ్యప్రాచ్యం దేశాల్లో పర్యటించాలని నిర్ణయించుకున్నారు. అయితే కొన్ని అవసరాల రీత్యా తన విదేశీ పర్యటనలను జస్టిస్ గొగోయ్ రద్దు చేసుకున్నారని తెలుస్తున్నది.

# ఆఫ్రికాతో బంధానికి దృఢ పునాది

## విజయవంతంగా ముగిసిన వెంకయ్యనాయుడు పర్యటన



కామెరోస్ పార్లమెంట్‌లో వెంకయ్య ప్రసంగం

**సియెర్రా లియోన్ నుంచి నమస్తే తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి:** భారత్‌కు, ఆఫ్రికా దేశాలకు మధ్య స్నేహం బలోపేతమవుతున్నది. కామెరోస్, సియెర్రా లియోన్ దేశాల్లో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆరు రోజుల పర్యటన మంగళవారంతో ముగిసింది. ఆ దేశాల్లో భారత ఉప రాష్ట్రపతి పర్యటించడం ఇదే తొలిసారి. ఈ పర్యటన సందర్భంగా వ్యవసాయం, ఆహార శుద్ధి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మౌలిక సదుపాయాల కల్పన తదితర రంగాలకు సంబంధించి ఆ దేశాలతో ఒప్పందాలు కుదిరాయి. ఐక్యరాజ్యసమితిలో భారత్, ఆఫ్రికాదేశాలు కలిసి ఒకే గొంతు వినిపించాలన్న అభిప్రాయానికి వచ్చారు. ఈ పర్యటనలో కశ్మీర్ సహా పలు అంశాలపై ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడారు. మరోవైపు ఆఫ్రికా దేశాల్లో భారత్ కొత్తగా 18 రాయబార కార్యాలయాలు నెలకొల్పాలని నిర్ణయించింది. సియెర్రా లియోన్‌లో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా సౌజన్యంతో కొన్ని పరిశ్రమలను ఏర్పాటు చేయాలని భారత్ భావిస్తున్నది. కామెరోస్‌లో నౌకాయాన సంబంధ పరిశ్రమలపైనా దృష్టిసారించింది.

# జాతీయ పాఠ్యప్రణాళికలో మార్పులు

**న్యూఢిల్లీ:** నూతన జాతీయ విద్యా విధానాన్ని (ఎన్‌ఈపీ) అనుసరించి 14 ఏండ్ల నాటి జాతీయ పాఠ్యప్రణాళిక స్వరూపాన్ని (నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్-ఎన్‌సీఎఫ్) మార్పు చేయాలని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) సంస్థ ప్రణాళిక రచిస్తున్నది. ఇందుకు సంబంధించి ఈ నెలాఖరు నాటికి ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ హృషికేశ్ సేనాపతి బుధవారం తెలిపారు. ఎన్‌సీఎఫ్‌ను ఇప్పటివరకు నాలుగుసార్లు (1975, 1988, 2000, 2005) సవరించారు. 'ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని ఖరారు చేయడం కోసం మేం ఎదురుచూస్తున్నాం. పాఠ్యప్రణాళిక సవరణకు సంబంధించి ఈ నెలాఖరు నాటికి ఒక కమిటీని నియమిస్తాం. ఎన్‌ఈపీని ఆధారంగా చేసుకుని ఆ కమిటీ సవరణలను ప్రతిపాదిస్తుంది. తదనుగుణంగా పాఠ్య పుస్తకాలను రివైజ్ చేస్తాం' అని ఆయన వివరించారు. ప్రస్తుతమున్న ఎన్‌ఈపీని 1986లో రూపొందించారు. 1992లో సవరించారు. నూతన విద్యా విధానాన్ని తీసుకొస్తామని బీజేపీ 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చింది.

# ప్రభావశీల మహిళల్లో మనోళ్లు ఏడుగురు

## 100 మంది జాబితాను విడుదల చేసిన బీబీసీ

**న్యూఢిల్లీ:** ప్రపంచంలో అత్యంత ప్రభావశీల 100 మంది మహిళల జాబితాను బీబీసీ బుధవారం విడుదల చేసింది. ఇందులో ఏడుగురు భారతీయ మహిళలకు చోటు లభించింది. వీరిలో రచయితలు, మహిళల సాధికారత కోసం పోరాడిన వాళ్లు ఉన్నారు. వారి గురించి క్లుప్తంగా..



పర్వీనా అహంగర్, వందనా శివ, అరణ్య జోహార్

**పర్వీనా అహంగర్:** 'కశ్మీర్ ఉక్కు మహిళ'గా ఈమెకు పేరుంది. కశ్మీర్‌లో మానవ హక్కుల కోసం పోరాడుతున్నారు. 90వ దశకంలో తన కుమారుడు అదృశ్యంకావడంతో అతడి కోసం చాలా కాలం వెతికారు. కానీ ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో చలించిపోయిన పర్వీనా 'అదృశ్యమైన వ్యక్తుల తల్లిదండ్రుల సంస్థ' (ఏపీడీపీ)ని స్థాపించారు. కశ్మీర్‌లో వ్యక్తుల అదృశ్యాలకు వ్యతిరేకంగా ఈ సంస్థ ప్రచారం నిర్వహిస్తున్నది.

**వందనా శివ:** చిప్కో ఉద్యమం స్ఫూర్తిగా పర్యావరణ పరిరక్షణ కోసం పనిచేస్తున్నారు. పరిశోధకురాలిగానూ, లింగసమానత్వం కోసం పోరాడుతున్న వ్యక్తిగానూ, రచయితగానూ వ్యవహరిస్తున్నారు. ఇప్పటి వరకు 20 పుస్తకాలను రాశారు. జీవవైవిధ్యం ద్వారా జీవ సంబంధ, ఆర్థిక సంబంధ సమస్యల పరిష్కారాన్ని కనుగొనేందుకు ఈమె 'నవ్‌ధాన్య' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు.

**అరణ్య జోహార్:** ముంబైలోని షోఫియా కాలేజీ విద్యార్థిని, రచయిత, వ్యాఖ్యాత అరణ్య జోహర్‌కు జాబితాలో అన్యూహంగా చోటుదక్కింది. ఈమె రాసిన కవిత 'ఏ బ్రౌన్ గర్ల్స్ గైడ్ టు జెండర్' సోషల్ మీడియాలో వైరల్ కావడంతో 2017లో వెలుగులోకి వచ్చారు. లైంగిక వేధింపులు, లింగ అసమానత్వం తదితరాల గురించి తన కవితల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నారు.

**సుస్మిత మొహంతి:** దేశంలోనే ప్రైవేట్ రంగంలో తొలి అంతరిక్ష అంకుర సంస్థ (స్టార్టప్)ను ప్రారంభించిన యువతిగా సుస్మితా రికార్డు సృష్టించారు. అమెరికా అంతరిక్ష సంస్థ నాసాలోనూ పనిచేసిన సుస్మితా.. భారత అంతరిక్ష సంస్థ ఇస్రో, యురోపియన్ స్పేస్ ఏజెన్సీ లాంటి సంస్థలకు కన్సల్టెంట్‌గాను వ్యవహరిస్తున్నారు. 2008లో 'ఎర్త్2ఆర్బిట్' అనే స్టార్టప్‌ను స్థాపించిన ఈమె వాతావరణ మార్పుల గురించి తెలుసుకోవడానికి అంతరిక్ష పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు.

**సుబ్బలక్ష్మి నంది:** ఆసియాలో లింగసమానత్వం కోసం గత 15 ఏండ్లుగా పనిచేస్తున్నారు. ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఉమెన్ సంస్థకు పాలసీ డైరెక్టర్‌గానూ వ్యవహరిస్తున్నారు. ఐక్యరాజ్యసమితికి చెందిన మహిళా ఆర్థిక సాధికారత విభాగానికి అధ్యక్షురాలిగానూ పనిచేశారు. మహిళా రైతుల అభ్యున్నతి, మహిళల విద్య కోసం కృషి చేస్తున్నారు.

**నటాశా నోయల్:** ముంబైలో జన్మించిన ఈమె తన మూడవ ఏటనే తల్లిని కోల్పోయారు. యుక్త వయసులో లైంగికవేధింపులకు గురయ్యారు. ప్రస్తుతం 26 ఏండ్ల వయసున్న నటాశా యోగా గురువుగా, వ్యక్తిత్వ వికాస నిపుణురాలిగా, సోషల్ మీడియాలో ప్రభావశీల మహిళగా పనిచేస్తున్నారు.

**డాక్టర్ ప్రగతి సింగ్:** తన దగ్గరకు చికిత్స కోసం వచ్చిన మహిళల్లో చాలా మంది తమకు శృంగార కోరికలు కలుగడం లేదని చెప్పడంతో ఈ అంశంపై డాక్టర్ ప్రగతి సింగ్ పరిశోధనలు చేపట్టారు. ఇలాంటి సమస్యలు ఉన్న మహిళలు, పురుషుల కోసం ఈమె ఓ ఆన్‌లైన్ కమ్యూనిటీ సంస్థను 2014లో స్థాపించారు. ప్రగతిసింగ్ రచయితగా కూడా వ్యవహరిస్తున్నారు.

## చిదంబరాన్ని అరెస్ట్ చేసిన ఈడీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 16:** ఐఎన్ఎక్స్ మీడియా కేసులో కేంద్ర మాజీ మంత్రి పీ చిదంబరాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్ట్ చేసింది. చిదంబరాన్ని విచారించేందుకు మంగళవారం ఢిల్లీలోని ప్రత్యేక న్యాయస్థానం ఈడీకి అనుమతినిచ్చిన విషయం తెలిసిందే. ఇదే కేసులో ప్రస్తుతం తీహార్ జైలులో రిమాండ్‌లో ఉన్న చిదంబరాన్ని ప్రశ్నించడానికి బుధవారం ఈడీ బృందం వచ్చింది. రెండు గంటల పాటు ఆయనను ప్రశ్నించారు. హవాలా లావాదేవీల నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద చిదంబరాన్ని అరెస్ట్ చేసి, ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేశామని వారు చెప్పారు. మరోవైపు, చిదంబరాన్ని గురువారం మధ్యాహ్నం మూడు గంటల్లోపు తమ ముందు విచారణకు హాజరుపర్చాలని ఢిల్లీలోని ప్రత్యేక న్యాయస్థానం జడ్జి అజయ్‌కుమార్ కుహర్.. ఈడీ అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా సుప్రీంకోర్టులో చిదంబరం దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను సీబీఐ వ్యతిరేకించింది.

## అమెరికాలో ఎన్నారై ఘాతుకం

**శాన్‌ఫ్రాన్సిస్కో/ రోసెవిల్లే (కాలిఫోర్నియా), అక్టోబర్ 16:** అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో రాష్ట్ర పరిధిలో భారతీయ అమెరికన్ ఐటీ నిపుణుడు శంకర్ నాగప్ప హంగుద్ (53) తన కుటుంబానికి చెందిన నలుగురిని హత్యచేశాడు. ఒక మృతదేహాన్ని కారులో తీసుకుని పోలీస్ స్టేషన్‌కు వచ్చి లొంగిపోయి నేరాన్ని అంగీకరించాడు. నలుగురు మృతులు నిందితుడి కుటుంబ సభ్యులేనని రోస్‌విల్లే పోలీసుశాఖ కెప్టెన్ జాషువా సైమన్ మీడియాకు చెప్పారు. మృతుల్లో ఇద్దరు పెద్దలు కాగా, మరో ఇద్దరు పిల్లలున్నారన్నారు. శంకర్ నాగప్పను రిమాండ్ ఖైదీగా ఉంచినట్లు తెలిపారు. సాక్రామెంటో ప్రాంతంలోని పలు కంపెనీల్లో డేటా స్పెషలిస్టుగా శంకర్ పనిచేశాడు. పోలీసులు అతడి అపార్ట్‌మెంట్‌లో తనిఖీలు నిర్వహించారు. మిగతా ముగ్గురు మృతదేహాలను కనుగొన్నారు. ఈ హత్యాకాండ కొన్ని రోజుల వ్యవధిలో సాగి ఉండొచ్చునని పోలీసు అధికారి సిమోన్ చెప్పారు.

## ఫిలిప్పీన్స్‌లో శక్తిమంతమైన భూకంపం

**మనీలా, అక్టోబర్ 16:** దక్షిణ ఫిలిప్పీన్స్‌లో బుధవారం శక్తిమంతమైన భూకంపం సంభవించింది. ఇది రిక్టర్ స్కేల్‌పై 6.4గా నమోదైంది. దీని ప్రభావంతో ఇంటి గోడ కూలి ఒక బాలుడు మరణించాడు. మరో నలుగురు గాయపడ్డారు. సుమారు 20 మంది గాయాలతో మేగసేసే పట్టణ దవాఖానలో చికిత్స పొందుతున్నారని అధికారులు తెలిపారు.

# పేదరికం తగ్గింది భారత్‌లో ఆకలి పెరిగింది!

## పేదరికం తగ్గింది

- గత 15 ఏండ్లలో వృద్ధిరేటు 7శాతం దాటింది
- సంపూర్ణ పేదరిక నిర్మూలన దిశగా భారత్: ప్రపంచబ్యాంక్



**వాషింగ్టన్, అక్టోబర్ 16:** భారత్‌లో 1990 తరువాత పేదరికం సగానికి తగ్గిందని, గత 15 ఏండ్లలో వృద్ధిరేటు ఏడు శాతాన్ని దాటిందని ప్రపంచబ్యాంక్ పేర్కొంది. పేదరిక నిర్మూలనతోపాటు ప్రపంచ అభివృద్ధి అంశాల్లో భారత్ కీలకంగా వ్యవహరిస్తున్నదని, వాతావరణ మార్పుల వంటి సమస్యల పరిష్కారంలో ప్రభావవంతంగా వ్యవహరిస్తున్నదని ప్రశంసించింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్)తో వార్షిక భేటీ జరుగనున్న నేపథ్యంలో ప్రపంచబ్యాంక్ భారత్ విషయంలో పలు కీలక వ్యాఖ్యలు చేసింది. భారత్‌లో అభివృద్ధి రేటు కొనసాగుతుందని, సంపూర్ణ పేదరిక నిర్మూలనను అతి త్వరలో సాధించగలదని వరల్డ్ బ్యాంక్ ఆశాభావం వ్యక్తం చేసింది. అయితే అభివృద్ధి పథంలో సాగుతున్న భారత్ సవాళ్లను కూడా గణనీయంగా ఎదుర్కొంటున్నదని తెలిపింది. అభివృద్ధిని స్థిరపరచాలనుకుంటే వనరుల వినియోగ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచుకోవాలని సూచించింది. దేశంలోని దాదాపు 23 కోట్ల మందికి సరైన విద్యుత్ సదుపాయం లేదని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. విద్యుత్ ఉత్పత్తిలో కర్బన ఉద్గారాలు తక్కువగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంది. ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థలో మౌలిక సదుపాయాలపై పెట్టుబడులను మరింత పెంచాలని సూచించింది. 2030 వరకు ప్రతి ఏడాది దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 8.8 శాతం లేక 34,300 కోట్ల డాలర్లను మౌలిక సదుపాయాల కల్పన కోసం కేటాయించాలని వరల్డ్‌బ్యాంక్ సూచించింది. నిరంతర వృద్ధికి అవకాశాల కల్పన కూడా అవసరమని తెలిపింది. ముఖ్యంగా మెరుగైన, అధిక సంఖ్యలో ఉపాధి అవకాశాలను సృష్టించాలని పేర్కొంది. ప్రతి ఏడాది కొత్తగా 1.3 కోట్ల మంది ఉపాధి కోసం వస్తున్నారని, కానీ వారికి 30 లక్షల ఉద్యోగాలు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయని వరల్డ్ బ్యాంక్ తెలిపింది. భారత్‌లో మహిళా శ్రామిక శక్తి చెప్పుకోదగిన స్థాయిలో లేదని ప్రపంచబ్యాంక్ పేర్కొంది. ఇక ప్రభుత్వరంగ సంస్థలను ఆధునికీకరించాలని తెలిపింది. సేవల వితరణలో దేశంలోని మధ్య ఆదాయ వర్గాల ఆకాంక్షలను తీర్చేవిధంగా ఆ సంస్థలను తీర్చిదిద్దాలని సూచించింది.

### ఆర్థికలోటును అదుపులో ఉంచాలి: ఐఎంఎఫ్

భారత్ ఆదాయ అంచనాలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ.. ఆర్థికలోటును అదుపులో ఉంచుకోవడం ఎంతో ముఖ్యమని ఐఎంఎఫ్ పేర్కొంది. దేశంలో గత ఏడాది వాస్తవ వృద్ధి రేటు 6.8 శాతంగా నమోదైనప్పటికీ ఈ ఏడాది అది 6.1% ఉంటుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది. 2020 నాటికి భారత ఆర్థిక అభివృద్ధి 7 శాతానికి చేరుకోవచ్చని తెలిపింది. ఆర్థిక దుర్బలత్వం, బ్యాంకేతర ఆర్థిక రంగం, వినియోగదారుల కొనుగోలుశక్తి తగ్గడం, చిన్న-మధ్య తరహా సంస్థల రుణాలు పెరుగడం వంటి కారణాల వల్ల భారత్‌లో వృద్ధి రేటుపై ప్రతికూల ప్రభావం పడిందని ఐఎంఎఫ్ ప్రధాన ఆర్థికవేత్త గీతా గోపీనాథ్ పేర్కొన్నారు. ప్రపంచ బ్యాంక్‌తో వార్షిక భేటీకి ముందు గీత బుధవారం మీడియాతో మాట్లాడారు. ఆర్థికపరంగా భారత్ ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తీసుకున్న చర్యలు ప్రశంసనీయమని చెప్పారు. అయితే అలాంటి చర్యలు మరిన్ని తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. ముఖ్యంగా వాణిజ్య బ్యాంకుల బ్యాలెన్స్‌షీట్‌ను ప్రక్షాళన చేయాలని సూచించింది.

## భారత్‌లో ఆకలి పెరిగింది!

- ప్రపంచ ఆకలి సూచిలో మనది 102వ ర్యాంకు
- పాక్, బంగ్లాదేశ్ కన్నా అధ్వానం



**న్యూఢిల్లీ:** ఆకలి కేకలతో భారత్ దద్దరిల్లుతున్నది. ప్రపంచవ్యాప్తంగా ఆకలితో అలమటిస్తున్న వారు, పోషకాహారలోపంతో బాధపడుతున్న వారు మన దేశంలోనే అత్యధికంగా ఉన్నారు. ప్రపంచ ఆకలి సూచి (జీహెచ్ఐ)లో భారత్‌ది 102వ స్థానం. నేపాల్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ కన్నా భారత్‌లోనే అన్నార్తులు ఎక్కువ. ఈ విషయాలను రెండు అంతర్జాతీయ సంస్థలు రూపొందించిన నివేదికలో వెల్లడించాయి. ఐర్లాండ్‌కు చెందిన 'కన్సర్న్ వరల్డ్‌వైడ్', జర్మనీకి చెందిన 'వెల్ట్‌హంగర్‌హిల్ఫే' సంస్థలు ఈ నివేదికను రూపొందించాయి. భారత్‌ను తీవ్రస్థాయిలో ఆకలి ఉన్న దేశంగా ఆ నివేదిక విశ్లేషించింది. మొత్తం 117 దేశాలపై సర్వే నిర్వహించిన ఆ సంస్థలు భారత్‌కు 102వ స్థానాన్ని ఇచ్చాయి. ఆకలి అత్యంత తీవ్ర స్థాయిలో ఉన్న దేశంగా 117వ స్థానంలో సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ నిలిచింది. నాలుగు ప్రమాణాల ఆధారంగా జీహెచ్ఐని రూపొందించారు. అవి పోషకాహార లోపం, పిల్లల్లో ఎదుగుదల లేకపోవడం, బాలలు బలహీనంగా ఉండటం, శిశు మరణాలు. ఈ సూచిలో నేపాల్ 73వ స్థానంలో, బంగ్లాదేశ్ 88, పాకిస్థాన్ 94వ స్థానంలో ఉన్నాయి. భారత్‌లో అత్యధిక జనాభా కారణంగానే ఆకలిస్థాయి అధికంగా ఉందని ఆ నివేదిక వెల్లడించింది. భారత్ తరువాత ఉన్న మిగిలిన 15 దేశాలు ఆఫ్రికన్ ఖండానికి చెందినవే. జీహెచ్ఐ నివేదికను ప్రస్తావిస్తూ ప్రతిపక్షాలు ప్రధానిపై విమర్శలు కురిపించాయి. ప్రధాని మోదీ ప్రతిష్ఠతోపాటే దేశంలో అన్నార్తుల సంఖ్య కూడా పెరుగుతున్నదని కేరళ ఆర్థిక మంత్రి థామస్ ఐజాక్ ఎద్దేవా చేశారు. 2014లో జీహెచ్ఐలో భారత్ 55వ స్థానంలో ఉందని, ఇప్పుడు 102వ ర్యాంక్‌కు దిగజారిందని పేర్కొన్నారు. 'దేశంలో ఇంకా అచ్చే దిన్ వస్తాయని చాలా మంది నమ్ముతున్నారు. కానీ అది ఎప్పుడు అన్నదే ప్రశ్న? ఆకలితో అలమటించే వారంతా మరణించాక ఆ అచ్చే దిన్ వస్తాయా?' అని కర్ణాటక మాజీ సీఎం సిద్దరామయ్య నిలదీశారు.

## సీఎం కేసీఆర్‌కు అడ్వకేట్ జేఏసీ ధన్యవాదాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న న్యాయవాదులకు ప్రభుత్వంలో భాగస్వామ్యం కల్పిస్తున్న సీఎం కేసీఆర్‌కు తెలంగాణ అడ్వకేట్ జేఏసీ ధన్యవాదాలు తెలిపింది. తెలంగాణ సాధనలో కేసీఆర్ అడుగుజాడల్లో నడిచిన పలువురిని ఇప్పటికే భాగస్వాములుగా చేశారని అడ్వకేట్ జేఏసీ అధికార ప్రతినిధి ఉపేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ న్యాయవాది పులిగారి గోవర్ధన్‌రెడ్డిని పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ సభ్యుడిగా నియమించినందుకు ఆయన ధన్యవాదాలు చెప్పారు. నియామకానికి కృషిచేసిన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

## బయోబ్రిక్.. కాలుష్యానికి చెక్

- వ్యవసాయ వ్యర్థాలతో ఇటుకల తయారీ
- పర్యావరణ హితం కోసమే సృష్టి
- ఐఐటీ హైదరాబాద్, కేఐఐటీ భువనేశ్వర్ పరిశోధకుల ఘనత

**కంది:** పర్యావరణ హితం కోసం ఐఐటీ హైదరాబాద్, కేఐఐటీ భువనేశ్వర్ పరిశోధకులు సంయుక్తంగా నడుంబిగించారు. వ్యవసాయ వ్యర్థాలతో బయోబ్రిక్స్ తయారుచేశారు. వాయు కాలుష్యానికి చెక్ పెట్టేందుకు సరికొత్త రూపకల్పన చేసి ప్రశంసలు అందుకుంటున్నారు. సాధారణంగా ఇండ్లు, ఇతర నిర్మాణాల కోసం వాడే ఇటుకలను ఎర్రమట్టితో తయారు చేస్తారనే సంగతి అందరికీ తెలిసిందే. కానీ, వ్యవసాయ వ్యర్థాలతో ఉత్పత్తి అవుతున్న వాయు కాలుష్యానికి అడ్డుకట్ట వేసేందుకు పరిశోధకులు ఆ వ్యర్థాలతో బయోబ్రిక్స్ రూపొందిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా కంది సమీపంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) హైదరాబాద్, కే ఐఐటీ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ భువనేశ్వర్ పరిశోధకులు సంయుక్తంగా బయోబ్రిక్స్ (జీవవైవిధ్య ఇటుకలు) తయారీని చేపడుతున్నారు. ఈ ఇటుకల తయారీతో పర్యావరణహితానికి కృషి చేస్తున్నామని, వ్యవసాయ వ్యర్థాలను కాల్చడం ద్వారా ఏర్పడే కాలుష్యాన్ని నివారించుకోవచ్చని ఐఐటీ హైదరాబాద్ పరిశోధకులు చెప్పున్నారు. ఐఐటీ హైదరాబాద్ డిజైన్ విభాగం పీహెచ్‌డీ స్కాలర్ ప్రియాబ్రాత రౌత్రే, కేఐఐటీ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ భువనేశ్వర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అవిక్‌రాయ్ ఈ పరిశోధన చేపట్టారు. ఐఐటీ హైదరాబాద్ డిజైన్ విభాగం అధినేత దీపక్ జాన్ మాథ్యూ, ఆస్ట్రేలియాలోని స్విన్‌బర్నె యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీకి చెందిన బోరిస్ ఈసెన్‌బార్ట్ నేతృత్వంలో చేపట్టిన ఈ పరిశోధనలను నెదర్లాండ్స్‌లో ఇటీవల జరిగిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఇంజినీరింగ్ డిజైన్ (ఐసీఈడీ-2019) సదస్సులో ప్రవేశపెట్టారు. గ్రామీణ ఇన్నోవేటర్స్ స్టార్టప్ కాన్‌క్లేవ్‌లోనూ బయోబ్రిక్ గుర్తింపును పొందింది.

**బయోబ్రిక్స్‌ను తయారుచేయడం ఇలా..**

బయోబ్రిక్స్ తయారీకి పూర్తిగా వ్యవసాయ వ్యర్థాలనే ఉపయోగిస్తారు. ముఖ్యంగా వరి, గోధుమ, చెరుకు, పత్తి పంటల ద్వారా వచ్చే వ్యర్థాలను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం దేశంలో ప్రతి సంవత్సరం 500 మిలియన్ టన్నుల వ్యవసాయ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఇందులో 84 నుంచి 141 టన్నుల వ్యర్థాలను కాల్చివేస్తున్నారు. ఈ వ్యర్థాలను కాల్చడం ద్వారా దేశంలో యేటా వాయు కాలుష్యం పెరిగిపోతున్నది. దేశంలోని వాయుకాలుష్యంలో 22 శాతం నిర్మాణ రంగానికి సం బంధించిన వ్యర్థాల నుంచే ఏర్పడుతున్నదని పరిశోధకులు ఒక అంచనాకు వచ్చారు. సాధారణ ఇటుకలను తయారుచేసినట్టే బయోబ్రిక్స్‌ను తయారుచేస్తారు. దీనివల్ల వాయుకాలుష్యం అనేది సగానికి పైగా తగ్గుతుందని పరిశోధకులు ప్రియాబ్రాత రౌత్రే, అవిక్‌రాయ్ చెప్తున్నారు. తక్కువ ఖర్చుతో చేపట్టే.. వెదురు, మెటల్‌తో నిర్మించే ఇండ్లకు ఈ బయోబ్రిక్స్‌ను ఉపయోగించవచ్చని తెలిపారు.



## హెల్త్ వాచ్

### సంతోషంగా ఉంటే గుండె సేఫ్!



సంతోషం, ఆనందం గుండె నుంచి పుట్టుకురాకపోవచ్చు. కానీ గుండెకు మాత్రం ఎంతో మేలుచేస్తాయి. ఉల్లాసంగా, సంతోషంగా గడిపేవారిలో గుండె వేగం, రక్తపోటు తక్కువగా ఉంటున్నట్టు కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ అధ్యయనాలు పేర్కొంటున్నాయి. సంతోషంగా గడిపేవారి రక్తంలో గుండెజబ్బు ముప్పును పెంచే ఫైబ్రినోజెన్ ప్రొటీన్ స్థాయి తక్కువగా ఉంటున్నట్టు వెల్లడైంది. సంతోషంగా ఉన్న రోజున పరీక్షించగా.. అంతకు ముందు కన్నా గుండె మరింత సమర్థంగా పనిచేస్తున్నట్టు వెల్లడైంది. సానుకూల భావనల మూలంగా గుండెజబ్బు ముప్పు 22% తగ్గుతుందని ఈ పరిశోధనలు మూకుమ్మడిగా తెలియజేస్తున్నాయి. మనకు ఎదురయ్యే పరిస్థితుల వల్లనో, అవతలివాళ్ల ప్రవర్తన వల్లనో మనకు సంతోషం కలుగుతుందనుకోవడం భ్రమ. సంతోషంగా ఉండాలి అనుకునేవాళ్ల పై ఏ పరిస్థితులూ ఏ ప్రభావాన్నీ చూపించవు. అందుకే సానుకూల ఆలోచనలు, భావాలను కలిగివుండేవాళ్లు పరిస్థితులతో సంబంధం లేకుండా ఎప్పటికీ సంతోషంగా ఉండగలుగుతారు.

### క్యాన్సర్ డాక్టర్.. సూర్యుడు!



క్యాన్సర్‌ను తగ్గించడంలో సూర్యుడి పాత్ర కీలకమైందని అంటున్నారు అమెరికాలోని మిషిగాన్ స్టేట్ యూనివర్సిటీ పరిశోధకులు. క్యాన్సర్ వ్యాధిని గుర్తించడం ఎంత కష్టమో నివారణ కూడా అంతే కష్టం. అయితే సూర్యరశ్మి ద్వారా క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేయొచ్చంటున్నాయి వీరి పరిశోధనలు. అంతేకాదు.. క్యాన్సర్ మరణాలను సైతం 13% అడ్డుకోవచ్చని పేర్కొంటున్నాయి. ప్రజలు సూర్యరశ్మిలో గడపడం మంచిదేనని క్యాన్సర్‌పై ఇటీవల జరిగిన ప్రపంచస్థాయి సదస్సులో పరిశోధకులు వెల్లడించారు. సూర్యరశ్మి నుంచి విడుదలయ్యే విటమిన్ డీ క్యాన్సర్ నివారించే శక్తి కలిగి ఉంటుందని తెలిపారు. షికాగోలో జరిగిన అమెరికన్ సొసైటీ ఆఫ్ క్లినికల్ ఆంకాలజీ వార్షిక సదస్సులో ఈ పరిశోధన అంశాలను వెల్లడించారు. ఇకపై క్యాన్సర్ వైద్యనిపుణులు తమ ప్రిస్క్రిప్షన్లలో విటమిన్ డీ టాబ్లెట్లను కూడా చేర్చాలని సూచిస్తున్నారు. ఉదయాన్నే సూర్యరశ్మితో లభించే విటమిన్ డీ వల్ల గానీ, విటమిన్ డీ టాబ్లెట్ల వల్ల గానీ వాళ్లు మరింత కాలం జీవించ వచ్చని అంటున్నారు.

### బాటిల్ నీళ్లు భద్రమేనా?



బయటికి వెళితే మంచినీళ్ల బాటిల్ కొనుక్కుని తాగడం చాలామందికి అలవాటే. ఇంట్లోనూ మినరల్ వాటర్ క్యాన్లను తెప్పించుకుంటారు. మినరల్ వాటర్ బాటిళ్లలో ప్లాస్టిక్ రేణువులు ఉంటాయని తాజా పరిశోధనల్లో వెల్లడైంది. 259 వాటర్ బాటిళ్లను పరిశీలిస్తే.. 90% కంటే ఎక్కువ బాటిళ్లలో మనిషి వెంట్రుక కంటే కొంచెం లావైన ప్లాస్టిక్ రేణువులు ఉన్నట్టు తేలిందని ప్రపంచ ఆరోగ్యసంస్థ తెలిపింది. అమెరికాలోని ఓర్బ్ మీడియా తరపున న్యూయార్క్ స్టేట్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. మన దేశంతోపాటు అమెరికా, చైనా, బ్రెజిల్, ఇండోనేషియా, మెక్సికో, లెబనాన్, కెన్యా, థాయిలాండ్ల నుంచి తెప్పించిన మంచినీటి బాటిళ్లను విశ్లేషించగా.. మైక్రోప్లాస్టిక్స్ లేదా 5 మిల్లీమీటర్ల కంటే తక్కువ పొడవున్న ప్లాస్టిక్ పదార్థాలతో 93% నీళ్లు కలుషితం అయ్యాయని తేలింది. ప్లాస్టిక్ రేణువులు మన ఆరోగ్యాన్ని దెబ్బతీసే రసాయనాలను విడుదల చేస్తాయంటున్నారు అధ్యయనం చేసిన ప్రొఫెసర్ షెర్రీ మాసన్.

# కొత్త భవనమే అవశ్యం

- ప్రస్తుత భవనాలు నవీకరణకు అనుకూలంగా లేవు
- సచివాలయ భవనాల కూల్చివేతపై ప్రభుత్వం వాదనలు
- చట్టపరమైన ఉల్లంఘనలు ఉంటే నిరూపించాలి: హైకోర్టు
- సాంకేతికాంశాలను తేల్చడానికి ఆర్కిటెక్టులం.. ఇంజినీర్లం కాదని వ్యాఖ్య



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రస్తుత సచివాలయ ప్రాంగణంలోని భవనాలను కూల్చివేసి.. నూతన సమీకృత సచివాలయాన్ని నిర్మించడం తప్ప మరో మార్గంలేదని రాష్ట్రప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. అంతర్గత అనుసంధాన వ్యవస్థ కలిగిన అత్యాధునిక భవన నిర్మాణం ద్వారానే పరిపాలనా సౌలభ్యం ఉంటుందని పేర్కొన్నది. ప్రస్తుత సచివాలయాన్ని కూల్చాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై విచారణ సందర్భంగా బుధవారం ప్రభుత్వం తరపున అదనపు అడ్వకేట్ జనరల్ జే రామచంద్రరావు వాదనలు వినిపించారు. సచివాలయ భవనాల స్థితిగతులపై పలు శాఖల ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ)లతో కూడిన టెక్నికల్ కమిటీ ఇచ్చిన నివేదికను చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనానికి అందజేశారు. ఈ సందర్భంగా వాదనలు వినిపిస్తూ.. ఇప్పుడున్న భవనాలను ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా నవీకరించడం, వాటిని కూల్చివేసి నూతన భవనాన్ని నిర్మించడమనే రెండు అంశాలపై టెక్నికల్ కమిటీ అధ్యయనం చేసిందని తెలిపారు. సచివాలయ సముదాయంలో రెండు భవనాలు మినహా మిగిలినవన్నీ 40 నుంచి 60 ఏండ్ల క్రితం కట్టినవేనని, డీ, హెచ్ బ్లాకులు మినహా మరే భవనం విధులు నిర్వహించడానికి అనుకూలంగా లేవని స్పష్టంచేశారు. భవనాలు శిథిలావస్థకు చేరాయని, గ్రీన్ బిల్డింగ్ నిబంధనల ప్రకారం లేవని టెక్నికల్ కమిటీ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశం నిర్వహించడానికిసమావేశ మందిరాలు లేవని పేర్కొన్నారు.

### ఒకే మార్గం.. భద్రతా సమస్యలు

వీవీఐపీ, వీఐపీలకు భద్రత కల్పించే విషయంలో సమస్యలు ఎదురవుతున్నాయని, అందరికీ ఒకే ప్రవేశమార్గం ఉన్నదని ఏఏజీ తెలిపారు. మోడల్ సెక్రటేరియట్ బిల్డింగ్ అవసరమని ధర్మాసనానికి నివేదించారు. హెచ్ బ్లాక్ కొత్తగా నిర్మించినదే కదా? అని ధర్మాసనం ప్రశ్నించగా.. హెచ్ బ్లాక్ భవనాల్లో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ లేదని, గతంలో హెచ్ బ్లాక్‌లో అగ్ని ప్రమాదం జరిగిన విషయాన్ని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. నూతన సచివాలయం ప్రణాళికలు తమకు సమర్పించాలని ధర్మాసనం ఏఏజీని ఆదేశించగా.. భవనాల కూల్చివేత అంశం కోర్టు పరిశీలనలో ఉండటంతో తాము ముందుకు వెళ్లలేదని వివరించారు. 10 లక్షల చదరపు అడుగుల్లో నూతన భవనం నిర్మిస్తామని తెలిపారు. పిల్ దాఖలు చేసినవారిలో చట్టసభల సభ్యులు ఉన్నారని, ప్రజాప్రయోజనం ముసుగులో వేసే కేసులను అడ్డుకోవాలని విన్నవించారు. మరోవైపు ప్రభుత్వాలు తీసుకునే విధాన నిర్ణయాల్లో జోక్యం తగదని సుప్రీంకోర్టు పలు కేసుల్లో ఇచ్చిన ఆదేశాలను ఏఏజీ ధర్మాసనం ముందుంచారు. ప్రభుత్వ నిర్ణయాలపై హైకోర్టు అప్పీలేట్ అథారిటీ కాదని, ఈ మేరకు వ్యవస్థ నడుమ అధికార విభజన స్పష్టంగా ఉన్నదని చెప్పారు.

### విధాన నిర్ణయాల్లో జోక్యం ఎలా?

ప్రభుత్వం తీసుకునే విధాన నిర్ణయాల్లో జోక్యం వద్దని పలు కేసుల్లో సుప్రీంకోర్టు తీర్పులు ఇచ్చిందని హైకోర్టు వ్యాఖ్యానించింది. క్యాబినెట్ నిర్ణయంలో రాజ్యాంగపరమైన లేదా చట్టపరమైన ఉల్లంఘనలు ఉంటే నిరూపించాలని కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి తరపున హాజరైన న్యాయవాదికి సూచించింది. ఈఎన్సీ స్థాయి అధికారులతో కూడిన కమిటీ భవనాలను కూల్చాలని చెప్తున్నదని, టెక్నికల్ అంశాలను పరిశీలించడానికి తాము ఆర్కిటెక్టులం, ఇంజినీర్లం కాదని ధర్మాసనం పేర్కొన్నది. 'ప్రభుత్వ నిర్ణయం నిర్హేతుకమని పిటిషనర్లు చెప్తున్నారని.. మీకు నిర్హేతుకమనిపించిన విషయం మాక్కూడా అనిపించాలని ఎక్కడా లేదు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇతర పిటిషనర్ల వాదనల కోసం విచారణను ఈ నెల 21కి వాయిదావేసింది.

## లంగరుకు తగిలిన బోటు

### బలంగా లాగడంతో తప్పిన పట్టు

### ములకల్లంకలో మృతదేహం లభ్యం

### బోటు బాధితుడిగా అనుమానం

**తూర్పు గోదావరి:** గత నెల 15న ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా కచ్చులూరు సమీపంలో గోదావరిలో మునిగిపోయిన రాయల్ వశిష్ట బోటును వెలికితీసేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. గోదావరిలో వరద ఉధృతి తగ్గి, వాతావరణం అనుకూలించడం తో కాకినాడకు చెందిన ధర్మాడి సత్యం బృందం బుధవారం మరోసారి బోటు వెలికితీత పనులు చేపట్టింది. జేసీబీ, భారీ లంగ రు, మూడు వేల అడుగుల ఇనుప తాడు, సుమారు 700 అడుగులు ఉన్న నైలాన్ తాడు సాయంతో బోటును వెలికితీసే ప్రయత్నాలు చేస్తున్నారు. గోదావరిలో మునిగిన బోటు లంగరుకు తగిలిందని ధర్మాడి సత్యం బృంతం తెలిపింది. ఇనుప తాడును జేసీబీకి కట్టి బలంగా లాగడంతో లంగరు జారిపోయినట్టు చెప్పారు. బోటుకు సంబంధించిన తెల్లని రంగు నీళ్లపైకి తేలిందని, ప్రమాదం జరిగిన చోటునుంచి 500 మీటర్ల వరకు బోటు తీరంవైపు కదిలిందని చెప్తున్నారు. విశాఖకు చెందిన గజ ఈతగాళ్లు అంగీకరిస్తే నదిలోపలకు పంపి లంగరును బోటుకు తగిలించి లాగే ప్రయత్నం చేస్తామని, లేదంటే ప్రస్తుతం అనుసరిస్తున్న విధానంలోనే వెలికితీత పనులు కొనసాగిస్తామని ధర్మాడి సత్యం బృందం వెల్లడించింది. ఇదిలా ఉండగా, తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలంలోని ములకల్లంక వద్ద గుర్తుతెలియని మృతదేహాన్ని బుధవారం స్థానికులు గుర్తించారు. మృతదేహానికి లైఫ్ జాకెట్ ఉండటంతో కచ్చులూరు బోటు ప్రమాదంలో గల్లంతైన వ్యక్తిగా అనుమానిస్తున్నారు. మృతదేహం నీళ్లు మింగి ఉబ్బి ఉండకపోవడంతో లైఫ్ జాకెట్ వల్ల ఒడ్డుకు చేరుకొని అక్కడినుంచి కదలలేక ఆకలితో ప్రాణాలుకోల్పోయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం దవాఖానకు తరలించారు.

## ఈ- ఆఫీస్ పరిధిలోకి ఇంటర్మీడియట్ బోర్డు

- ఏర్పాట్లు చేస్తున్న ఉన్నతాధికారులు
- త్వరలో కాగితరహిత కార్యకలాపాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇంటర్మీడియట్‌బోర్డులో కాగితరహిత కార్యకలాపాలు సాగించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యకలాపాలను ఈ -ఆఫీస్ పరిధిలోకి తీసుకురాబోతున్నారు. పరీక్షల పనులు, విద్యార్థులసేవలు వంటివి ఇప్పటికే ఆన్‌లైన్ పరిధిలోకి తీసుకువచ్చామని, ఇక నుంచి పరిపాలనకు సంబంధించిన వ్యవహారాలు కూడా ఈ - ఆఫీస్ పరిధిలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని ఇంటర్మీడియట్ విద్యాశాఖ కమిషనర్ సయ్యద్ ఒమర్ జలీల్ తెలిపారు. బోర్డుకు సంబంధించిన జిల్లా ఇంటర్ విద్యాధికారుల కార్యాలయం, క్షేత్రస్థాయి అధికారుల కార్యాలయాల నుంచే ఈ -ఆఫీస్ పరిపాలన కొనసాగిస్తామన్నారు. ఇందు కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల పనితీరు, బోధన, బోధనేతర సిబ్బందికి సంబంధించిన సెలవులు, అధికారిక కార్యకలాపాలు కూడా ఈ - ఆఫీస్ ద్వారా పర్యవేక్షించనున్నట్టు చెప్పారు.

**మౌలిక వసతులపై దృష్టి**

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి, విద్యాసంబంధ అంశాల కోసం కూడా ఈ - ఆఫీస్‌ను ఉపయోగించే ప్రయత్నం చేస్తున్నారు.

## తెలంగాణలో అటవీ పరిరక్షణ భేష్

- ప్రశంసించిన వివిధ రాష్ట్రాల అటవీ అధికారులు
- మేడ్చల్, సిద్దిపేట జిల్లాల్లో క్షేత్రస్థాయి పర్యటన
- అడవుల సంరక్షణపై ఆస్కిలో జాతీయ సదస్సు



హైదరాబాద్ శివారులోని కండ్లకోయ ఆక్సిజన్ పార్క్ వద్ద వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులతో తెలంగాణ పీసీసీఎఫ్ ఆర్ శోభ, సీఎంవో ఓఎస్డీ ప్రియాంక వర్గీస్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అటవీ పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలు భేషుగ్గా ఉన్నాయని వివిధ రాష్ట్రాలకు చెందిన అటవీ సంరక్షణ ప్రధాన అధికారులు ప్రశంసించారు. కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో వాతావరణ మార్పులు, అడవుల సంరక్షణలో ఎదురవుతున్న సవాళ్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హైదరాబాద్ అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ (ఆస్కి)లో జాతీయ సదస్సు జరుగుతున్నది. సదస్సులో భాగంగా 20 రాష్ట్రాల అటవీ ఉన్నతాధికారులు బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. మేడ్చల్ జిల్లా కండ్లకోయలోని ఆక్సిజన్ అర్బన్ ఫారెస్ట్ పార్క్‌తోపాటు, సిద్దిపేట జిల్లా గజ్వేల్ అటవీ ప్రాంతాల్లో పర్యటించారు. తెలంగాణ ప్రభుత్వం అటవీ అభివృద్ధితోపాటు పచ్చదనం పెంపుదల, అటవీ పునరుజ్జీవన చర్యలకు ఇస్తున్న ప్రాధాన్యం, తెలంగాణకు హరితహారం విశిష్ఠత, అమలవుతున్న తీరును తెలంగాణ పీసీసీఎఫ్ ఆర్ శోభ వివరించారు. హైదరాబాద్ చుట్టూ అటవీ ప్రాంతాల్లో అభివృద్ధి చేస్తున్న అర్బన్ పార్కులపై ఇతర రాష్ట్రాల అటవీ ఉన్నతాధికారులు ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. భవిష్యత్‌లో ఈ పార్కులన్నీ ప్రజలకు మంచి పర్యావరణ ఆస్తులుగా మిగులుతాయని ప్రశంసించారు. గజ్వేల్ షరీఫ్ రిజర్వ్ ఫారెస్ట్ బ్లాక్ పరిధిలోని సింగాయపల్లిలో క్షీణించిన అటవీ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో పునరుజ్జీవనం చేసిన విధానాన్ని ప్రత్యక్షంగా చూశారు. గజ్వేల్, కోమటిబండ ప్రాంతాల్లో అభివృద్ధి చేసిన రహదారి వనాలను (అవెన్యూ ప్లాంటేషన్) పరిశీలించారు. సింగాయపల్లిలో తవ్విన కందకాలు, గట్లపై సహజ సిద్ధ కంచెగా పెంచుతున్న గచ్చకాయ చెట్లను చూసి.. ఈ నమూనాను తమ రాష్ట్రాల్లో కూడా అమలుచేస్తామని కొందరు పీసీసీఎఫ్‌లు వెల్లడించారు. గజ్వేల్ సమీపంలోని సంగాపూర్ ఫారెస్ట్ పార్క్‌ను కూడా సందర్శించారు. కొత్త రాష్ట్రమైనా అటవీ సంరక్షణ, పచ్చదనం పెంపుదలకు తీసుకొంటున్న చర్యలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని పలువురు అధికారులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సీఎంవో ఓఎస్డీ ప్రియాంకా వర్గీస్, హైదరాబాద్ సీసీఎఫ్ చంద్రశేఖర్‌రెడ్డి, మెదక్ సీసీఎఫ్ శరవణన్, ఆస్కి ప్రోగ్రాం డైరెక్టర్ వల్లిమాణికం, మేడ్చల్, సిద్దిపేట జిల్లాల అటవీ అధికారులు సుధాకర్ రెడ్డి, శ్రీధర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



బీడుభూములకు బ్యాక్‌వాటర్ తరలింపు పనులపై మ్యాపును పరిశీలిస్తున్న చెన్నూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్కసుమన్, నీటిపారుదలశాఖ ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు

## బీడు భూములకు బ్యాక్‌వాటర్

- కాళేశ్వరం బరాజ్‌ల బ్యాక్‌వాటర్‌తో 1.38 లక్షల ఎకరాలకు జీవం
- మూడు బరాజ్‌ల వద్ద మూడు లిఫ్ట్‌లకు ప్రతిపాదనలు
- నీటి పారుదలశాఖ అధికారులతో చర్చించిన విప్ బాల్క సుమన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన మూడు బరాజ్‌ల బ్యాక్‌వాటర్‌ను బీడు భూములకు తరలించే ప్రతిపాదనపై ప్రభుత్వం దృష్టిసారించింది. లక్ష్మీ (మేడిగడ్డ), సరస్వతి (అన్నారం), పార్వతి (సుందిల్ల) బరాజ్‌ల ఫోర్‌షోర్ వద్ద ఈ లిఫ్టులను ఏర్పాటు చేసి బ్యాక్‌వాటర్‌ను వినియోగించనున్నది. దీనద్వారా చెన్నూరు నియోజకవర్గంలోని 1,31,840 ఎకరాలతోపాటు బెల్లంపల్లి నియోజకవర్గంలో 6,300 ఎకరాలకు జీవం పోసేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నది. ఇందులో 53,700 ఎకరాల స్థిరీకరణతోపాటు 84,440 ఎకరాల కొత్త ఆయకట్టు ఉన్నది. కాళేశ్వరం ద్వారా ఎక్కువ నీటిని వినియోగించుకోవాలనే సీఎం కేసీఆర్ సంకల్పానికి అనుగుణంగా ఈ ప్రతిపాదనలపై సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపొందిస్తున్నారు. ఈ ప్రతిపాదనలపై చెన్నూరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బాల్క సుమన్ మంగళవారం జలసౌధలో నీటిపారుదల శాఖ ఈఎన్సీ మురళీధర్‌రావు, ఆదిలాబాద్ సీఈ జీ శ్రీనివాస్‌రెడ్డి, ప్రాణహిత ప్రాజెక్ట్ ఎస్ఈ ఎం విష్ణుప్రసాద్, డీఈఈ జీ రామకృష్ణ, ఇతర అధికారులతో సమగ్రంగా చర్చించారు. గ్యాప్ ఆయకట్టుకు సాగునీరు అందేలా డీపీఆర్‌ను రూపొందించాలని ఈఎన్సీ మురళీధర్‌రావు.. ఆదిలాబాద్ చీఫ్ ఇంజినీర్‌ను ఆదేశించారు. లిఫ్టు పథకాలకు చేపట్టాల్సిన పనుల నివేదిక సమర్పించాలని సూచించారు. అనంతరం వాటిని ప్రభుత్వ అనుమతికి పంపనున్నట్లు ఈఎన్సీ స్పష్టంచేశారు.

## 'నైరుతి' నిష్క్రమణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నైరుతి రుతుపవనాలు బుధవారంతో భారతదేశం నుంచి పూర్తిగా నిష్క్రమించినట్టు భారత వాతావరణ విభాగం(ఐఎండీ) వెల్లడించింది. వాయవ్య భారత్ నుంచి తిరోగమనం ప్రారంభమైన ఎనిమిది రోజుల తర్వాత రుతుపవనాలు పూర్తిగా నిష్క్రమించాయని పేర్కొన్నది. నైరుతి రుతుపవనాలు అత్యంత వేగంగా నిష్క్రమించినట్టు ఐఎండీ భావిస్తున్నది. ఇదే సమయంలో దేశంలోకి ఈశాన్య రుతుపవనాల ప్రవేశంతో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ ప్రాంతాల్లో వర్షాలు ప్రారంభమయ్యాయని తెలిపింది. దక్షిణ తమిళనాడు తీరానికి దగ్గరలో ఉన్న నైరుతి బంగాళాఖాతం నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు 1.5 కి.మీ నుంచి 2.1 కి.మీ ఎత్తులో ఉపరితల ద్రోణి ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొన్నది. దీని ప్రభావంతో రాబోయే రెండ్రోజుల్లో తెలంగాణలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతోపాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురుస్తాయని తెలిపింది. గురువారం ఒకటి, రెండుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నది. కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోని పలుచోట్ల గురు, శుక్రవారాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురువొచ్చని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

## కల్కి ఆశ్రమాలపై ఐటీ దాడులు

మొదటిపేజీ తరువాయి...


అందుబాటులో లేరని సమాచారం. పన్ను ఎగవేత, నిధుల దుర్వినియోగానికి సంబంధించి ఐటీ అధికారులకు సమాచారం అందడంతో ఈ సోదాలు చేపట్టినట్లు తెలిసింది. కల్కి ట్రస్టుకు వచ్చిన విదేశీ విరాళాలపై అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. ఆశ్రమ నిధులను కృష్ణ దారిమళ్లించి చెన్నైలోని పలు ప్రైవేట్ కంపెనీల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టినట్లు ఐటీ వర్గాలు తెలిపాయి. గోవర్ధన్‌పూర్‌లోని కృష్ణ కార్యాలయంలోనూ ఐటీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కల్కి ఆశ్రమ ట్రస్ట్ మేనేజర్ లోకేశ్ దాసాజీని కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఐటీ అధికారులు నిర్వహించిన దాడుల్లో వందల కోట్ల రూపాయల విలువైన అక్రమ ఆస్తులను గుర్తించినట్లు సమాచారం. బినామీల పేరుతో వేల ఎకరాల భూముల క్రయ విక్రయాలు జరిపినట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. తనిఖీలకు సంబంధించి కల్కి ఆశ్రమం నుంచి గానీ, ఐటీ శాఖ నుంచి గానీ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. కాగా, ఐటీ సోదాలు నేడూ కొనసాగే అవకాశం ఉన్నది.

**ఎల్ఐసీ క్లర్క్‌గా ప్రస్థానం మొదలు..**

కల్కి భగవాన్ అసలు పేరు విజయ్‌కుమార్‌నాయుడు. వరదరాజులునాయుడు, వైదర్భి దంపతులకు 1949 మార్చి 7న జన్మించిన ఆయన మొదట లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో (ఎల్ఐసీ) క్లర్క్‌గా పనిచేశారు. అనంతరం ఉద్యోగం వదిలేసి తన స్నేహితుడు శంకర్‌తో కలిసి 1984లో చిత్తూరులో జీవాశ్రం పేరిట రెసిడెన్షియల్ స్కూల్‌ను స్థాపించారు. అయితే అందులో నష్టాలు రావడంతో అజ్ఞాతంలోకి వెళ్లారు. ఆ తర్వాత విష్ణుమూర్తి పదో అవతారం కల్కి భగవాన్‌గా చెప్పుకుంటూ 1989లో చిత్తూరులో ప్రత్యక్షమయ్యారు. తనతోపాటు తన భార్యను కూడా దైవాంశ సంభూతిరాలిగా తనను తాను పేర్కొన్నారు. క్రమంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఆశ్రమాలను విస్తరించారు.

**ప్రత్యేక దర్శనానికి రూ.25 వేలు!**

దేశవ్యాప్తంగా అనేకమంది సంపన్నులతోపాటు ప్రవాస భారతీయులు కూడా కల్కి భగవాన్‌కు భక్తులుగా ఉన్నారు. కల్కి భగవాన్ దంపతుల సాధారణ దర్శనానికి రూ.5 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రత్యేక దర్శనానికి



చిత్తూరులోని కల్కి ఆశ్రమం (ఫైల్)

ఏకంగా రూ.25 వేలు చెల్లించుకోవాల్సిందే. ఇక కల్కి భగవాన్‌పై అనేక ఆరోపణలు ఉన్నాయి. ఆశ్రమానికి వచ్చిన భక్తులకు మత్తు పదార్థాలు ఇచ్చి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు గతంలో ఆరోపణలు వినిపించాయి. కల్కి ఆశ్రమంలో చాలా మంది ప్రముఖులకు బినామీ ఆస్తులు ఉన్నట్లు ఆరోపణలున్నాయి. భూ కబ్జాకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 2010లో విచారణకు ఆదేశించింది. అయితే విచారణలో ఏం తేలిందనేదానిపై స్పష్టత లేదు. 2008లో చిత్తూరులోని కల్కి ఆశ్రమంలో తొక్కిసలాట జరుగడంతో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు.

## ఏపీలో 'వైఎస్సార్ నేతన్న నేస్తం'

- ఏటా రూ.24 వేలు సాయానికి నిర్ణయం
- మధ్యాహ్న భోజన కార్మికుల వేతనం రూ.3 వేలకు పెంపు
- రైతులకు ఉచిత బోర్లు వేసేందుకు 200 డ్రిల్లింగ్ యంత్రాలు
- ఏపీ క్యాబినెట్‌లో పలు అంశాలకు ఆమోదం.. వెల్లడించిన మంత్రి పేర్ని నాని

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** చేనేత కార్మిక కుటుంబాలకు 'వైఎస్ఆర్ నేతన్న నేస్తం' పేరుతో ఏటా రూ.24 వేలు సాయం చేయాలని, మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఇచ్చే సాయం రూ.10 వేలకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం నిర్ణయించింది. బుధవారం ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను సమాచార, రవాణాశాఖల మంత్రి పేర్ని నాని మీడియాకు వెల్లడించారు. వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకం కింద ఏటా డిసెంబర్ 21న ఆర్థిక సాయం చేయనున్నారు. వేట నిషేధ సమయంలో ఇచ్చే సాయం మత్స్యకారుల్లో మెకనైజ్డ్ బోటు ఉన్నవారికే కాకుండా తెప్పలపై వేట సాగించేవారికి కూడా తొలిసారిగా ఈ పథకం కింద రూ.10 వేలు ఇవ్వాలని నిర్ణయించారు. అంతర్జాతీయ మత్స్య దినోత్సవం సందర్భంగా నవంబర్ 21న ఈ పథకం ప్రారంభించనున్నారు. హోంగార్డులకు రోజుకు ఇచ్చే రూ.600 అలవెన్స్‌ను రూ.710కి పెంచారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల వేతనం రూ.వెయ్యి నుంచి రూ.3 వేలకు పెంచారు. సురక్షితమైన మంచినీటి కోసం వాటర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు నిర్ణయించారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో రూ.50 కోట్లతో నిర్మించనున్న 200 పడకల కిడ్నీ దవాఖాన రీసెర్చ్ సెంటర్‌లో 5 రెగ్యులర్, 100 కాంట్రాక్ట్, 60 అవుట్ సోర్సింగ్ పోస్టుల నియామకానికి అనుమతి ఇచ్చారు. బార్ అసోసియేషన్‌లో సభ్యులుగా ఉన్న మూడేండ్లలోపు జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5 వేలు. రైతులకు ఉచిత బోర్లు వేసేందుకు 200 డ్రిల్లింగ్ యంత్రాల కొనుగోలు చేయనున్నారు. ఆర్టీసీలో కాలం చెల్లిన సుమారు 3,500 బస్సులను తొలగించి కొత్త బస్సుల కొనుగోలుకు రూ.వెయ్యి కోట్ల రుణానికి అనుమతి ఇచ్చారు.


తెలంగాణ ప్రభుత్వం
జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్ కార్యాలయం (పి.ఆర్) పి.ఐ.యు మేడ్చల్-మల్కాజ్గిరి
షార్ట్ టెండరు నోటీసు
సంఖ్య T5/05/2019-20, తేది: 15.10.2019
(60) పనులకు రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి టెండర్లు ఆహ్వానించడమైనది. **పనులు:** 60 పనులు, **అంచనా విలువ: రూ. 444.40 లక్షలు, దరఖాస్తు తీసుకొనుటకు చివరి తేది:** 24.10.2019న సా. 5.00 గంటల వరకు, **టెండరు షెడ్యూల్ పొందుటకు చివరి తేది:** 28.10.2019, **టెండరు వేయు తేది:** 29.10.2019న సా. 3.00 గంటల వరకు, **టెండరు తెరచు తేది:** 29.10.2019న సా. 3.30 గంటలకు
మరిన్ని వివరాలు ఈ కార్యాలయంలోని నోటీసు బోర్డులో ప్రదర్శించబడిన టెండరు నోటీస్‌లో లభించును.
సం/- జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్ (పి.ఆర్) పి.ఐ.యు మేడ్చల్-మల్కాజ్గిరి
DIPR RO. No. 1389-DP/CL/Advt/1/2019-20, Dt: 16/10/2019

JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY HYDERABAD
(Established by Govt. Act No. 30 of 2008)
Kukatpally, Hyderabad - 500 085, Telangana (India)
CONVENTIONAL TENDER BOX NOTICE

| Sl.No. | NIT No. & Date | Details of Annual maintenance contract |
|---|---|---|
| 1 | JNTUH/ED/HBD/3628/2019-20 Dt: 17.10.2019. | Sealed tenders are invited for A) "Annual maintenance and Operation of GYM at JNTUH Indoor Stadium, Kukatpally, Hyderabad". B) "Annual maintenance and Operation of Swimming Pool at JNTUH Indoor Stadium, Kukatpally, Hyderabad". |

Further details available on www.jntuh.ac.in Sd/- REGISTRAR

తెలంగాణ రాష్ట్ర వైద్యసేవలు మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ
డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కేంపస్, సుల్తాన్ బజార్, హైదరాబాద్-500 095, తెలంగాణ రాష్ట్రం
టెండరు ప్రకటన నెం. 4/TSMSIDC/MW/సర్జికల్స్/2019, తేది: 15-10-2019
ఎ) 2019-21 (రెండు సం||లు) రేట్ కాంట్రాక్టు కాలవ్యవధి కొరకు డైరెక్ట్ తయారీదారులు, డైరెక్ట్ ఎగుమతిదారులు మరియు అధీకృత పంపిణీదారులు మరియు (రిజర్వుడ్ ఐటమ్‌ల కొరకు తెలంగాణ SSI యూనిట్లు మాత్రమే) నుండి సర్జికల్, కన్స్యూమబుల్స్, CTS & ఆప్తాల్మిక్ మెటీరియల్స్ కలిపి **ముఖ్యమైన సర్జికల్స్** యొక్క సేకరణ కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫాం (ఆన్‌లైన్) ద్వారా టెండరు కోరబడుతోంది.
బి) 2019-21 (రెండు సం||లు) రేట్ కాంట్రాక్టు కాలవ్యవధి కొరకు డైరెక్ట్ తయారీదారులు, డైరెక్ట్ ఎగుమతిదారులు మరియు అధీకృత పంపిణీదారులు మరియు (రిజర్వుడ్ ఐటమ్‌ల కొరకు తెలంగాణ SSI యూనిట్లు మాత్రమే) నుండి సర్జికల్, కన్స్యూమబుల్స్, CTS & ఆప్తాల్మిక్ మెటీరియల్స్ కలిపి **అదనపు సర్జికల్స్** యొక్క సేకరణ కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫాం (ఆన్‌లైన్) ద్వారా టెండరు కోరబడుతోంది.
సి) 2019-21 (రెండు సం||లు) రేట్ కాంట్రాక్టు కాలవ్యవధి కొరకు డైరెక్ట్ తయారీదారులు, డైరెక్ట్ ఎగుమతిదారులు మరియు అధీకృత పంపిణీదారుల నుండి డెంటల్ మెటీరియల్స్ & స్కీమ్‌ల ఐటమ్‌ల యొక్క సేకరణ కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫాం (ఆన్‌లైన్) ద్వారా టెండరు కోరబడుతోంది.
ఏ విధమైన కారణం తెలుపకుండానే ఏ సమయం వద్ద అయినా టెండరును రద్దుచేయు హక్కు మేనేజింగ్ డైరెక్టర్ TSMSIDC గారికి రిజర్వు కాబడి ఉంటుంది. పూర్తి వివరాల కొరకు **తేది: 24-10-2019 నుండి వెబ్‌సైట్: https://tender.telangana.gov.in దర్శించగలరు.**
DIPR RO.No. 429-PP/CL/ADVT/1/2019-20, Dt: 16-10-2019 సం/- మేనేజింగ్ డైరెక్టర్

# భక్తిశ్రద్ధలతో చండీయాగం

నాలుగో రోజు హాజరైన చినజీయర్‌స్వామి
నేడు పూర్ణాహుతితో యాగం పరిసమాప్తి

**కల్లూరు:** ఖమ్మం జిల్లా కల్లూరు మండలం నారాయణపురంలో ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో చేపట్టిన సహస్ర చండీయాగం బుధవారం నాలుగో రోజు వైభవంగా కొనసాగింది. శృంగేరి పండితులు విరివింటి ఫణిశంశాంకశర్మ, వ్యాసోజుల గోపీకృష్ణశర్మ వైదిక నిర్వహణ చేశారు. యాగంలో చినజీయర్‌స్వామిజీతో పాటు హళదీ పురకృష్ణాశ్రమ మఠాధిపతులు వామనాశ్రమ స్వామి పాల్గొన్నారు. అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, ఎంపీ కే కేశవరావు, మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గురువారం సహస్ర చండీ పూర్ణాహుతితో యాగం ముగియనున్నది. చివరి రోజు విశాఖ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్రస్వామి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.



బుధవారం సహస్ర చండీయాగంలో పాల్గొన్న చిన జీయర్‌స్వామి, పొంగులేటి దంపతులు తదితరులు
(ఇన్‌సెట్) చినజీయర్‌స్వామి ఆశీస్సులు తీసుకుంటున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

# మంత్రి కేటీఆర్ ఔదార్యం

ప్రమాదానికి గురైన
యువకుడికి రూ.1.50 లక్షల ఎల్వోసీ
కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబం

**ఎల్లారెడ్డిపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన ఓ యువకుడు ట్రాక్టర్ కిందపడి వెన్నెముకకు తీవ్రగాయాలు కాగా ఆపరేషన్ కోసం సాయం అందించి మంత్రి కేటీఆర్ ఔదార్యాన్ని చాటుకున్నారు. బుధవారం బాధిత కుటుంబసభ్యులు మీడియాకు వివరాలు తెలిపారు. గ్రామానికి చెందిన ద్యావ శ్రీకాంత్ ఇటీవల ట్రాక్టర్ నడుపుతూ కిందపడిపోగా వెన్నెముక దెబ్బతిన్నది. వైద్యులు ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని, డబ్బులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. దీంతో స్థానిక టీఆర్ఎస్ నాయకుడు కొండ రమేశ్ తదితరులు ఈ విషయాన్ని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన కేటీఆర్ రూ.1.50 లక్షలకు సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ ఇప్పించి ఔదార్యం చాటుకున్నారు. బాధిత కుటుంబం మంత్రికి కృతజ్ఞతలు తెలిపింది. ఎల్వోసీని బాధితుడు శ్రీకాంత్‌కు సర్పంచ్ పాశం సరోజన అందించారు.



బుధవారం శ్రీకాంత్‌కు ఎల్వోసీని అందిస్తున్న సర్పంచ్ పాశం సరోజన



# ప్రయాణం.. ప్రశాంతం

## 12వ రోజు నిరాటంకంగా బస్సు సర్వీసులు

- ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు
- సురక్షిత ప్రయాణానికి పటిష్ఠ చర్యలు
- బుధవారం 64.38 శాతం వాహనాల సేవలు
- మారుమూల గ్రామాలకు వెళ్లిన పల్లెవెలుగు బస్సులు



బుధవారం నిజామాబాద్ బస్టాండ్‌లో బస్సుల రద్దీ

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** ఆర్టీసీ కార్మికుల సమ్మె ప్రభావం లేకుండా ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యామ్నాయ చర్యలతో ప్రజారవాణా సాఫీగా కొనసాగుతున్నది. 12వ రోజు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా బస్సులను అధికార యంత్రాంగం బస్సులను నిరాటంకంగా నడిపించింది. వంద శాతం బస్సులు నడిపాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో 64.38 శాతం ఆర్టీసీ బస్సులతోపాటు అద్దెబస్సులు, ప్రైవేటు వాహనాలు, స్కూలు బస్సులు, మాక్సి క్యాబ్‌లు నడవడంతో ప్రజానీకం సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకున్నది.

✦ కరీంనగర్ రీజియన్ పరిధిలోని పది డిపోల్లో బుధవారం 95.75 శాతం బస్సులు నడిచాయి. మొత్తం 659 బస్సులు నడపాల్సి ఉండగా, 631 బస్సులు నడిపారు. ఇందులో 433 ఆర్టీసీ, 198 అద్దె బస్సులున్నాయి. 226 బస్సుల్లో టిమ్ మిషన్ల ద్వారా, 36 బస్సుల్లో టికెట్ల ద్వారా చార్జీలు వసూలు చేశారు. వరంగల్ రీజియన్‌లోని తొమ్మిది డిపోల పరిధిలో 680 సర్వీసులు నడిపినట్టు రీజినల్ మేనేజర్ శ్రీధర్ తెలిపారు. టికెట్లు ఇచ్చే పద్ధతి 57 శాతానికి చేరిందన్నారు. నల్లగొండ జిల్లాలో నాలుగు డిపోల నుంచి 311 బస్సులు నడిచాయి. ఇప్పటికే నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే నాన్‌స్టాప్ బస్సుల్లో టికెట్లు అందిస్తుండగా మిగతా ప్రాంతాల్లో కూడా టికెట్లు ఇచ్చేందుకు వీలుగా తాత్కాలిక కండక్టర్లకు శిక్షణ ఇస్తున్నారు. సూర్యాపేట డిపో పరిధిలో 123 బస్సులు నడవగా.. కోదాడ డిపోలో 60 బస్సులు ప్రయాణికులకు సేవలు అందించాయి. వికారాబాద్ జిల్లా వికారాబాద్, తాండూరు, పరిగి డిపోల నుంచి 191 బస్సులు నడిచాయి. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో 455 బస్సులు నడిచాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం డిపోల పరిధిలో 148 బస్సులు, 64 హైర్‌బస్సులు బస్సులు నడిచాయి. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లాలో 76 ఆర్టీసీ, 33 హైర్, 20 ప్రైవేటు ట్రావెల్ బస్సులు రాకపోకలు కొనసాగించాయి. జోగుళాంబ గద్వాలజిల్లాలో వివిధ రూట్లల్లో 92 బస్సులు పరుగులు పెట్టాయి. నారాయణపేట జిల్లాలో పేట డిపో పరిధిలో 45 ఆర్టీసీ బస్సులు, 34 హైర్ బస్సులు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాయి. అలాగే 110కిపైగా జీపులు, క్రూయిజర్లు తిరిగాయి. మొత్తం 8 వేలకుపైగా ప్రయాణికులు ప్రయాణం కొనసాగించారు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో 535 బస్సుల ద్వారా ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరవేశారు. 367 ఆర్టీసీ బస్సులు, 158 ప్రైవేట్ బస్సులు తిరిగాయి.

✦ యాదగిరిగుట్ట డిపోనుంచి 57 ఆర్టీసీ బస్సులు, 15 అద్దె బస్సులను నడిపించారు. విజయవాడ, కర్నూల్ వెళ్లే ప్రయాణికుల కోసం బుధవారం ఆరు సూపర్ లగ్జరీ బస్సులను అందుబాటులో ఉంచారు.

**మారుమూల గ్రామాలకు నడిచిన బస్సులు**

మారుమూల పల్లెలకు కూడా బస్సు సర్వీసులు నడిచాయి. బుధవారం ఖమ్మం జిల్లాలోని చాలా గ్రామాలకు అధికారులు బస్సులను నడిపించారు. ఖమ్మం ఆర్టీసీ డివిజన్ పరిధిలోని ఖమ్మం, సత్తుపల్లి, మధిర డిపోల్లో పూర్తిస్థాయిలో బస్సులను తిప్పారు. ఆర్టీసీ షెడ్యూల్ ప్రకారం అర్ధరాత్రి 12 గంటల నుంచే బస్సు సర్వీసు ప్రారంభమైంది. వివిధ డిపోల నుంచి హైదరాబాద్, రాజమండ్రి, భద్రాచలం, తొర్రూరు, వరంగల్, శ్రీశైలం దూర ప్రాంతాలకు సీనియర్ డ్రైవర్లతో బస్సులు నడిపించారు. ఖమ్మం డిపోలో 60 బస్సులు, 56 అద్దె బస్సులు, మధిర నుంచి 30 ఆర్టీసీ, 20 అద్దె బస్సులు, సత్తుపల్లి 74 ఆర్టీసీ, 30 అద్దెబస్సులు తిప్పారు. జిల్లాలో 374 బస్సులతోపాటు మ్యాక్సీక్యాబ్‌లు నడిచాయి.



కరీంనగర్ బస్‌స్టేషన్‌లో ప్రయాణికులను తరలించేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాగారం వద్ద బస్సులో తనిఖీ చేస్తున్న అధికారులు



ఖమ్మం బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



బుధవారం కరీంనగర్‌లో ఆన్‌లైన్‌లో డ్యాష్‌బోర్డును ప్రారంభిస్తున్న పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్. చిత్రంతో మంత్రులు ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్ తదితరులు

# పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

- అధికారులతో మంత్రులు ఈటల, గంగుల, కొప్పుల సమీక్ష
- పౌరసరఫరాలశాఖ డ్యాష్‌బోర్డు ప్రారంభం

**కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** వానకాలం సీజన్‌లో రికార్డుస్థాయిలో ధాన్యంవచ్చే అవకాశం ఉందని, పకడ్బందీగా కొనుగోలు చేసేలా ఏర్పాట్లుచేయాలని రాష్ట్ర మంత్రులు ఈటల రాజేందర్, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధికారులు, పౌర సరఫరాలశాఖ కమిషనర్ అకున్ సబర్వాల్‌తో కలిసి వానకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లు- ప్రణాళికపై మంత్రులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పౌర సరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. గత సీజన్‌లో 41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే.. ఈసారి 55 నుంచి 58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. రైతుల ధాన్యం పూర్తిస్థాయిలో కొనేది దేశంలో ఒక్క తెలంగాణ రాష్ట్రమేనని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం వచ్చే అవకాశాలున్నాయని, వాటిని సమర్థంగా అడ్డుకోకపోతే రాష్ట్ర రైతులు నష్టపోయే ప్రమాదమున్నదని చెప్పారు. ఎక్కడ ఎక్కువ దిగుబడులు వస్తాయో అక్కడ ఎక్కువ కేంద్రాలు ఏర్పాటుచేయాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ సూచించారు. సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. రైతులు దశలవారీగా కేంద్రాలకు ధాన్యం తెచ్చేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించేందుకు ఏర్పాటుచేసిన డ్యాష్ బోర్డును మంత్రి కమలాకర్ ఆవిష్కరించారు. కనీస మద్దతు ధర పోస్టర్‌ను మంత్రులు రాజేందర్, కమలాకర్, ఈశ్వర్ ఆవిష్కరించారు. సమావేశంలో జెడ్పీ అధ్యక్షురాలు కనుమల్ల విజయ, కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌తోపాటు కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల జేసీలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గోదావరిలో ఇక రెగట్టా పోటీలు

సీఎం కేసీఆర్ ఆదేశాలతో పరిశీలన

**గోదావరిఖని, నమస్తే తెలంగాణ:** పెద్దపల్లి జిల్లా గోదావరిఖని శివారులోని గోదావరినదిలో రెగట్టా పోటీలు నిర్వహించనున్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో క్రీడానిపుణులు బుధవారం ఖని సమీపంలోని గోదావరి నదిని సందర్శించారు. గతనెల 29న రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ రాష్ట్రస్థాయి తెప్పల పోటీలు నిర్వహించారు. దీనిపై సీఎం కేసీఆర్‌కు ఫొటో ప్రజెంటేషన్ ఇచ్చారు. దీంతో అక్కడ ఏటా రెగట్టా పడవల పోటీలు నిర్వహించాలని సంబంధితశాఖ మంత్రికి సీఎం కేసీఆర్ ఆదేశించిన నేపథ్యంలో.. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల క్రీడా, యువజన శాఖ అధికారులు రాజవీరు, శ్రీకాంత్‌రెడ్డి, హైదరాబాద్ నుంచి రెగట్టా పోటీల నిర్వహణ టెక్నికల్ టీం సభ్యుడు రామకృష్ణ వచ్చి గోదావరి నదిని పరిశీలించారు. రెగట్టా పోటీల నిర్వహణ సాధ్యాసాధ్యాలపై నివేదికను రూపొందించనున్నట్టు వారు తెలిపారు.

# పలు జిల్లాల్లో ఓ మోస్తరు వాన

- వరంగల్ రూరల్ జిల్లాలో పిడుగుపాటుకు ఇద్దరి మృతి
- గ్రేటర్ హైదరాబాద్‌లో తేలికపాటి జల్లులు

**యాదగిరిగుట్ట, నర్సంపేట, నమస్తే తెలంగాణ/ఆత్మకూరు:** యాదాద్రి భువనగిరి, వరంగల్ రూరల్, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంతో పాటు బీబీనగర్, పోచంపల్లి, యాదగిరిగుట్ట, మోత్కూరు, అడ్డగూడురు మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురువగా వలిగొండ, ఆత్మకూరు(ఎం), ఆలేరు, మోటకొండూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో చిరుజల్లులు కురిశాయి. వరంగల్ రూరల్ జిల్లాలో బుధవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. 6 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. గత కొన్నిరోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పంటలకు నష్టం వాటిల్లుతున్నది. పత్తి పంట జాలువారింది. చేతికి వచ్చిన మొక్కజొన్నలు తడిసిపోయి నల్లబారి పోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గీసుగొండ, చెన్నారావుపేట మండలాల్లో పిడుగులు పడి బర్రెలు మృతిచెందాయి. వరంగల్ రూరల్ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేటకు చెందిన నన్నెబోయిన పూలమ్మ (46) తన కుమారుడు నాగరాజుతో కలిసి పత్తి ఏరుతుండగా పిడుగుపాటుకు గురయ్యారు. పూలమ్మ అక్కడికక్కడే మృతి చెందగా.. నాగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. గీసుగొండ మండలం మచ్చాపురంలో పొలం పనులు చేస్తుండగా మర్రి దూడయ్య (42) అనే రైతు పిడుగుపడి మృతి చెందాడు.

**గ్రేటర్ హైదరాబాద్‌లో పలుచోట్ల వర్షం**

**సిటీబ్యూరో(హైదరాబాద్) :** బంగాళాఖాతం నుంచి తమిళనాడు వరకు ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. రాజేంద్రనగర్, బేగంబజార్, పురానాపూల్, కార్వాన్, మెహిదీపట్నం, ఖైరతాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి, మేడిపల్లి, ఆసిఫ్‌నగర్, హిమాయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. మేడ్చల్ పరిధిలోని సింగపూర్ సిటీలో అత్యధికంగా 3.2 సెంటీమీటర్లు, నందనవనం 3.1 సెం.మీ. మేడిపల్లిలో 2.3 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. ఉపరితల ద్రోణి ప్రభావంతో రాగల మరో రెండు రోజులపాటు గ్రేటర్‌లో తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు అధికారులు వెల్లడించారు.

# కృష్ణవేణికి కొనసాగుతున్న వరద

- ఆల్మట్టికి 31 వేలు, జూరాలకు 46 వేలు, నారాయణపురకు 36 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- సాగర్ రెండుగేట్ల ద్వారా నీటివిడుదల
- నిలకడగా శ్రీరాంసాగర్ నీటిమట్టం



నాగార్జునసాగర్ ప్రాజెక్టు రెండు క్రస్టు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు



జూరాల ప్రాజెక్టులో నీటి నిల్వ

**జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ ప్రతినిధి/అయిజ/నందికొండ/మహదేవపూర్/మెండోరా, నమస్తే తెలంగాణ:** కృష్ణాబేసిన్‌లో వరద ప్రవాహం కొనసాగుతున్నది. బుధవారం సాయంత్రం జూరాలకు ఇన్‌ఫ్లో 46 వేల క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 39,466 క్యూసెక్కులు నమోదైంది. ప్రవాహం తగ్గిపోవడంతో విద్యుత్ ఉత్పత్తిని నిలిపేశారు. ఎగువనున్న ఆల్మట్టి, నారాయణపుర ప్రాజెక్ట్‌లకు స్వల్పంగా వరద వస్తున్నది. ఆల్మట్టికి ఇన్‌ఫ్లో 30,991 క్యూసెక్కులు వస్తుండగా అదేస్థాయిలో నీటిని కిందికి వదులుతున్నారు. నారాయణపురకు ఇన్‌ఫ్లో 36,387 క్యూసెక్కులుండగా, అవుట్‌ఫ్లో 35,137 క్యూసెక్కులుగా రికార్డయింది. కర్ణాటక ఎగువప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర జలాశయానికి వరద కొనసాగుతున్నది. ఇన్‌ఫ్లో 20,589 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 20,289 క్యూసెక్కులు నమోదైంది. టీబీ డ్యామ్ ఐదు స్పిల్‌వే గేట్ల ద్వారా 7,685 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదలచేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు బుధవారం సాయంత్రానికి జూరాల నుంచి 47వేల క్యూసెక్కులు, సుంకేశుల నుంచి 19,432 క్యూసెక్కులు కలిపి 67,013క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు బుధవారం 71,415 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ప్రాజెక్టు రెండు క్రస్టుగేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి 16,200 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. పులిచింతల ప్రాజెక్టుకు 40 వేల పైచిలుకు ఇన్‌ఫ్లో వస్తుండగా.. అదే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. నల్లగొండ జిల్లాలోని మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాలనుంచి 2,100 క్యూసెక్కుల వరద వస్తున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 645 అడుగులు (4.46 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 626.80 అడుగులు (0.98 టీఎంసీలు) ఉన్నది. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాలనుంచి 2,538 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులు (90.313 టీఎంసీలు)కాగా, బుధవారం సాయంత్రానికి 1089.50 అడుగులు (82.215 టీఎంసీలు) నీటి నిల్వ ఉన్నది.

**లక్ష్మీ బరాజ్‌లో తగ్గిన నీటి ప్రవాహం**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాజెక్ట్ లోభాగంగా నిర్మించిన లక్ష్మి (మేడిగడ్డ) బరాజ్‌లో బుధవారం నీటి ప్రవాహం మరింత తగ్గింది. అధికారులు బరాజ్‌లో ఆరు గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు.

# ప్రామాణికంగా 'కుడా' మాస్టర్‌ప్లాన్

పురపాలకశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్‌కుమార్

**వరంగల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని మున్సిపాలిటీలకు వరంగల్ కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మాస్టర్‌ప్లాన్ ప్రామాణికంగా ఉండాలని పురపాలకశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్‌కుమార్ సూచించారు. బుధవారం వరంగల్ అర్బన్ కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, కుడా మున్సిపల్, నీటి పారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. పురపాలకశాఖమంత్రి కేటీఆర్ ప్రస్తావించిన అంశాలను పరిగణనలోకి తీసుకొని 'కుడా' మాస్టర్‌ప్లాన్‌కు తుదిరూపు ఇచ్చేందుకు రూపొందించిన నివేదికలు, మ్యాపులను ఆయన పరిశీలించారు. దీని పరిధిలో 823 చెరువులు ఉన్నాయని, అందులో వరంగల్ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న 190 చెరువులు, కుంటలపై సర్వే నంబర్లు, విస్తీర్ణం, నీటి నిల్వ సామర్థ్యం, పూర్తిస్థాయిలో చెరువు, కుంటల పరిధి, ప్రస్తుత స్థితిపై మ్యాపింగ్ చేయాలన్నారు. మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై ఎప్పటికప్పుడు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్‌కు అందజేయాలని ఆదేశించారు. అనంతరం భద్రకాళీ బండ్ నిర్మాణ పనులను పరిశీలించారు.

# గ్రామాల అభివృద్ధికి విరాళాలు

- కాపులకనపర్తికి ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు లక్ష
- ములుగు సర్పంచ్ నిర్మల అత్త బండారి వెంకటరత్నమ్మ లక్ష



మంత్రి ఎర్రబెల్లి , ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యంకు చెక్కు అందజేస్తున్న గోపాల్‌రావు

**సంగెం/ములుగు, నమస్తే తెలంగాణ:** తమ గ్రామాల అభివృద్ధికి పలువురు దాతలు పెద్ద మొత్తంలో విరాళాలు అందజేస్తున్నారు. వరంగల్ రూరల్ జిల్లా సంగెం మండలం కాపులకనపర్తికి చెందిన ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు తమ గ్రామాభివృద్ధికి లక్ష రూపాయల విరాళం ప్రకటించారు. ఈ మేరకు బుధవారం హన్మకొండలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ ఛీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌లకు చెక్కును అందజేశారు. ములుగు జిల్లాలో కిలో ప్లాస్టిక్‌కు కిలో సన్న బియ్యం కార్యక్రమానికి ప్రోత్సాహంగా, గ్రామాభివృద్ధి కోసం ములుగు సర్పంచ్ బండారి నిర్మల అత్త బండారి వెంకటరత్నమ్మ లక్ష రూపాయల చెక్కును కలెక్టర్ నారాయణ రెడ్డికి బుధవారం అందించారు. గోపాల్ రావు, వెంకటరత్నమ్మ దానగుణాన్ని ఆయా గ్రామాల ప్రజలు ప్రశంసించారు.

# బతికుండగానే వైకుంఠధామానికి..

మానవత్వం మరిచి
భర్తను వదిలి వెళ్లిన భార్య



ఎల్వర్తి వైకుంఠధామం..(ఇన్‌సెట్‌లో) వైకుంఠధామంలో అచేతన స్థితిలో సత్యయ్య

**శంకర్‌పల్లి రూరల్:** అందరూ ఉన్నా ఓ వృద్ధుడు అనాథయ్యాడు. అనారోగ్యానికి గురవ్వడంతో తానేమీ చేయలేనని భార్య వైకుంఠదామంలో వదిలేసి వెళ్లింది. మూడు రోజులుగా శ్మశానంలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని ఎల్వర్తి గ్రామానికి చెందిన కంకంటి సత్యయ్య(56). ఈయనకు భార్య యాదమ్మ, కుమారుడు మహేశ్, కుమార్తె సంతోష ఉన్నారు. తనకున్న మూడెకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కుమారుడు మహేష్ ఎనిమిదేండ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో సత్యయ్య భూమిని అమ్మి, చేవెళ్లలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో గ్రామంలోని ఇంటిని విక్రయించాడు. ఊరిపై మమకారంతో సత్యయ్య గ్రామంలోని డ్వాక్రా భవనంలో నివసిస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం సత్యయ్యకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో కాళ్లకు గాయాలయ్యాయి. దుర్వాసన వెదజల్లడంతో గ్రామస్థులు అతని భార్యకు సమాచారమిచ్చారు. దీంతో గ్రామానికి వచ్చిన యాదమ్మ తాను ఏమీ చేయలేని స్థితిలో ఉన్నాననీ, మూడు రోజుల క్రితం పంచాయతీ రిక్షాలో సత్యయ్యను ఇటీవల నిర్మించిన వైకుంఠదామంలో వదిలేసింది. మూడు రోజులుగా సత్యయ్య తిండి, తిప్పలు లేక విగతజీవిలా పడిఉన్నాడు. సత్యయ్య స్థితి చూసి స్థానికులు విచారం వ్యక్తంచేస్తున్నారు.

# ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య



వెంకటేశం (ఫైల్)

**గజ్వేల్,యాదగిరిగుట్ట నమస్తే తెలంగాణ :** నల్లగొండ 12వ బెటాలియన్ టీఎస్ఎస్పీ హెడ్‌కానిస్టేబుల్ ఎత్తరి వెంకటేశం(38) బుధవారం తుపాకీతో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం చాడ గ్రామానికి చెందిన వెంకటేశం గజ్వేల్‌లో విధుల్లో ఉండగా కార్బన్ వెపన్‌తో కుడి కణతపై కాల్చుకొన్నారు. పోలీసులు హుటాహుటిన గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్టు ధ్రువీకరించారు. మృతుడికి భార్య శోభ, కుమారుడు చందు, కూతురు వెన్నెల ఉన్నారు. సిద్దిపేట పోలీసు కమిషనర్ జోయల్‌డెవిస్ మాట్లాడుతూ .. వెంకటేశం మద్యం మత్తులో కాల్చుకొన్నాడని తెలిపారు. మద్యానికి బానిసై గతంలో చాలారోజులు సెలవులో ఉన్నాడనీ, తాగుడు మాన్పించేందుకు ఎడిక్షన్ సెంటర్‌లో చికిత్స కూడా పొందారన్నారు. గతనెల 29న డ్యూటీలో జాయిన్ అయ్యాడని, తర్వాత మళ్లీ తాగుడు బానిసై సెలవుపై వెళ్లాడన్నారు. ఈనెల 15 అతని భార్య విజ్ఞప్తి మేరకు ఆర్ఐ సింహాచలం ద్వారా విధుల్లో చేరడన్నారు. కానిస్టేబుల్ వెంకటేశ్వర్లుకు గతంలో మద్యం అలవాటు ఉందని, క్షణికావేశంతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని 12వ బెటాలియన్ కమాండెంట్ ఇంచార్జి వీరయ్య అభిప్రాయపడ్డారు. బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూర్ మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు మృతదేహాన్ని ఆయన సందర్శించి నివాళులర్పించారు. ప్రభుత్వం నుంచి తక్షణ సాయం క్రింద అంత్యక్రియల కోసం రూ. 20 వేలు, సీసీఎస్ కింద మరో రూ.10 వేలు వెంకటేశ్వర్లు కుటుంబానికి అందజేశామని తెలిపారు.

# తెలంగాణ క్రీడా హబ్

క్రీడాశాఖ భూముల డిజిటలైజేషన్

ఖేలో ఇండియా పథకంలో పాఠశాలలకు ప్రతిపాదనలు

సమీక్షా సమావేశంలో రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


బుధవారం ఎల్బీ స్టేడియంలో క్రీడాశాఖపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ క్రీడా హబ్‌గా రూపొందిందని క్రీడా, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. 2014 తర్వాత రాష్ట్రంలో 45 స్టేడియాల నిర్మాణం పూర్తి చేశామన్నారు. బుధవారం ఎల్బీ స్టేడియంలో క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్)పై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... శాట్స్ ఆధ్వర్యంలోని క్రీడా శాఖకు చెందిన భూములు, స్థిరాస్తులను డిజిటలైజేషన్ చేసి వాటిని సంరక్షించాలని అధికారులను ఆదేశించారు. క్రీడా శాఖ స్థలాల్లో ప్రైవేట్ వ్యక్తులు తీసుకున్న లీజులపై సమీక్షించారు. లీజుకు తీసుకుని ప్రభుత్వానికి అద్దె చెల్లించకుండా కోర్టుకు వెళ్లిన వారి వివరాలను అందజేయాలని సూచించారు. ప్రస్తుతం కోర్టు వివాదంలో ఉన్న స్థలాల వివరాలను ప్రభుత్వానికి అందజేసి, త్వరగా పరిష్కరించాలని సూచించారు. మార్కెట్‌లో ప్రస్తుతం ఉన్న అద్దెల ప్రకారంగా క్రీడా శాఖ స్థిరాస్తులకు కూడా వర్తింపజేసేలా కార్యాచరణను రూపొందించాలన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో స్టేడియాల్లో మౌళిక వసతుల కల్పనపై చర్చించారు. అంతర్జాతీయ స్థాయి క్రీడా వసతులను ఉపయోగించుకుని క్రీడాకారులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులపై తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. కేంద్ర క్రీడా శాఖ ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన ఖేలో ఇండియా పథకంలో నూతన క్రీడా పాఠశాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కొత్తగా నిర్మించే స్టేడియాలను పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేసేలా తగిన ప్రతిపాదనలను రూపొందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల పట్ల ఎంతో శ్రద్ధతో, క్రీడాకారులను తయారు చేయడానికి రెండు ప్రత్యేక జీవోలను విడుదల చేసిందని, దీని ద్వారా స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాల్లో 2 శాతం రిజర్వేషన్ కల్పించామన్నారు. వృత్తి విద్యా కోర్సుల్లో రిజర్వేషన్ కోసం జీవోలో మార్పులు చేసి క్రీడాకారులకు సౌకర్యంగా ఉండేలా చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో శాట్స్ ఎండీ దినకర్‌బాబు, డిప్యూటీ డైరెక్టర్ సుజాత, లీగల్, ఎస్టేట్ ఆఫీసర్ చంద్రావతి, డిప్యూటీ డైరెక్టర్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ విమలాకర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దీపక్, స్పోర్ట్స్ స్కూల్ ఓఎస్డీ కే నర్సయ్య పాల్గొన్నారు.

## జిమ్నాస్టిక్స్ సంఘానికి ఐవోఏ గుర్తింపు

**అహ్మద్‌నగర్:** తెలంగాణ జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ (టీజీఏ)కు భారత ఒలింపిక్ అసోసియేషన్ (ఐవోఏ) గుర్తింపు లభించింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (జీఏటీ) కు గతంలో ఉన్న గుర్తింపును రద్దు చేస్తూ జిమ్నాస్టిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తీర్మానించినట్లు టీజీఏ అధ్యక్షులు రవి ఈశ్వర్ చంద్, ప్రధాన కార్యదర్శి సోమేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిమ్నాస్టిక్స్ అసోసియేషన్‌లకు ఈనెల10న ఢిల్లీలో జరిగిన నామినేషన్ ప్రక్రియలో పాల్గొన్న జీఏటీ సభ్యత్వాన్ని ఫెడరేషన్ నుంచి పూర్తిగా తొలిగించినట్లు తెలిపారు. ఈ మేరకు జరిగిన గుర్తింపు ఎన్నికల్లో తెలంగాణ జిమ్నాస్టిక్స్ అసోసియేషన్‌కు సోమవారం ఉత్తర్వులు అందినట్లు రవి తెలిపారు. నవంబర్ 5 న జరిగే జిమ్నాస్టిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎన్నికల్లో టీజీఏ పాల్గొంటుందని వారు తెలిపారు.


సునీల్ ఛెత్రి

## అభిమానులను అలరించలేకపోయాం

**కోల్‌కతా:** ఎన్నో అంచనాలతో మైదానానికి వచ్చిన వేలాది మంది ప్రేక్షకులను నిరుత్సాహపరచడం బాధించిందని భారత ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ సునీల్ ఛెత్రి అన్నాడు. ఫిఫా క్వాలిఫయర్‌లో భాగంగా మంగళవారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌ను భారత్ 1-1తో 'డ్రా' చేసుకుంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మన కంటే 83 ర్యాంకుల దిగువన ఉన్న బంగ్లాతో మ్యాచ్‌లో ఛెత్రి సేన పైచేయి సాధిస్తుందనుకుంటే.. అనూహ్యంగా తడబడి చివరకు 'డ్రా'తో గట్టెక్కింది. మ్యాచ్ అనంతరం ఛెత్రి మాట్లాడుతూ.. 'సాల్ట్ లేక్ స్టేడియంకు విచ్చేసిన ప్రేక్షకుల అంచనాలను అందుకోవడంలో విఫలమయ్యాం. మైదానంలో అభిమానులు ఉర్రూతలూగిస్తున్నా.. మ్యాచ్ ఫలితంతో వారిని రంజింపచేయలేకపోయాం. మీ అండదండలుంటే భవిష్యత్తులో తప్పక విజయాలు సాధిస్తాం'అని అన్నాడు. మ్యాచ్‌లో భారత్ తరపున ఏకైక గోల్ చేసి పరువు కాపాడిన ఆదిల్ ఖాన్ మాట్లాడుతూ.. 'జాతీయ జట్టు తరపున నాకు ఇదే తొలి గోల్. దీన్ని ప్రత్యేక సందర్భంగా మలిచిన అభిమానులకు ధన్యవాదాలు. ఒక ఫుట్‌బాల్ ఆటగాడిగా.. ఇలాంటి వాతావరణాన్నే మేము కోరుకునేది. ఈ ప్రేక్షకాభిమానానికే మేము పడి చచ్చేది. కానీ ఫలితంతో మిమ్మల్ని నిరాశ పరిచినందుకు బాధగా ఉంది. నేర్చుకునే దశలో ఇవన్నీ సహజం. ముమ్ముందు తప్పక అలరిస్తాం'అని అన్నాడు.

## నిఖత్‌కు మళ్లీ నిరాశేనా!



**న్యూఢిల్లీ:** తెలంగాణ యువ బాక్సర్ నిఖత్ జరీన్‌కు మళ్లీ నిరాశే ఎదురుకానుందా. అంటే జరుగుతున్న పరిణామాలు చూస్తే అవుననే అనిపిస్తుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే టోక్యో (2020) ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీలో నిఖత్ బరిలోకి దిగేది అనుమానంగా మారింది. మహిళల 51కిలోల విభాగంలో ఎలాంటి ట్రయల్స్ నిర్వహించకుండానే దిగ్గజ బాక్సర్ మేరీకోమ్‌ను పోటీకి దింపేందుకు భారత బాక్సింగ్ సమాఖ్య(బీఎఫ్ఐ) ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంపై బీఎఫ్ఐ అధ్యక్షున్ని సంప్రదించేందుకు నిఖత్ ప్రయత్నించినా లాభం లేకపోయింది.

# ఢిల్లీ X బెంగాల్

ఫైనల్లో అమీతుమీ తేల్చుకోనున్న ఇరు జట్లు

సెమీస్‌లో ఓడిన బెంగళూరు, ముంబై..

ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్



**ఎన్నో ఉత్కంఠ పోరాటాలు.. మరెన్నో అద్భుత ప్రదర్శనలతో గత మూడు నెలలుగా ఇంటిల్లిపాదికి వినోదాన్ని పంచుతున్న ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్ తుది అంకానికి చేరుకుంది. మట్టి కోట నుంచి మ్యాట్ పైకి వచ్చినా.. మల్లయోధుల్లా తలపడ్డ రెండు జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. సీజన్ మొత్తం అదిరిపోయే ఆటతో ఆకట్టుకొని పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన నిలిచిన దబంగ్ ఢిల్లీ.. రెండో ప్లేస్‌తో లీగ్‌ను ముగించిన బెంగాల్ వారియర్స్ రెండూ తుదిపోరుకు అర్హత సాధించాయి. ఈ రెండు జట్లు ఫైనల్ చేరడం ఇదే తొలిసారి కావడంతో.. ఎవరు గెలిచిన పీకేఎల్‌లో కొత్త విజేత అవతరించినట్లే.**

**అహ్మదాబాద్:** మూడు నెలలుగా ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తున్న ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్ ఫైనలిస్టులు ఖరారయ్యారు. బుధవారం హోరాహోరీగా సాగిన సెమీఫైనల్స్‌లో బెంగళూరు బుల్స్‌పై.. దబంగ్ ఢిల్లీ, యు ముంబాపై.. బెంగాల్ వారియర్స్ విజయాలు సాధించి తుదిపోరుకు చేరాయి. తొలి సెమీఫైనల్లో ఢిల్లీ 44-38తో డిఫెండింగ్ చాంపియన్ బెంగళూరును ఓడిస్తే.. రెండో సెమీస్‌లో బెంగాల్ 37-35తో ముంబైను మట్టికరిపించింది. శనివారం ఇక్కడే జరుగనున్న ఫైనల్లో ఢిల్లీ, బెంగాల్ జట్లు ఏడో సీజన్ టైటిల్ కోసం అమీతుమీ తేల్చుకోనున్నాయి. తుదిపోరుకు చేరడం ఇరుజట్లకు ఇదే తొలిసారి కావడం విశేషం.

### నవీన్ వరుసగా 20వ సారి

పాయింట్ల పట్టికలో అగ్రస్థానంతో ప్లేఆఫ్స్‌కు చేరిన ఢిల్లీ.. సెమీఫైనల్లోనూ అదే జోరు కనబర్చింది. నవీన్ కుమార్ (15 పాయింట్లు), చంద్రన్ రంజిత్ (9 పాయింట్లు) చెలరేగడంతో ఆరంభం నుంచి ఆధిక్యంలో నిలిచిన దబంగ్ జట్టు తిరుగులేని విజయంతో తొలిసారి ప్రొ కబడ్డీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఫుల్ ఫామ్‌లో ఉన్న రైడర్ నవీన్ కుమార్ లీగ్‌లో సూపర్-10 సాధించడం ఇది వరుసగా 20వ సారి కావడం విశేషం. బెంగళూరు బుల్స్ తరపున పవన్ షెరావత్ 18 పాయింట్లతో ఒంటరి పోరాటం చేశాడు. స్టార్ రైడర్, బుల్స్ కెప్టెన్ రోహిత్ కుమార్ (5 పాయింట్లు) పెద్దగా ప్రభావం చూపలేకపోవడం కూడా బెంగళూరును దెబ్బకొట్టింది. నవీన్, చంద్రన్ విజృంభణతో మ్యాచ్ ఆరంభమైన మూడో నిమిషంలోనే బెంగళూరు ఆలౌటైంది. దీంతో ఢిల్లీకి ఆరు పాయింట్ల ఆధిక్యం లభించింది. కాపేసటికి పవన్ షెరావత్ సూపర్ రైడ్ ద్వారా 3 పాయింట్లు సాధించి బుల్స్‌ను పోటీలోకి తెచ్చినా తొలి అర్ధభాగంలోనే బెంగళూరు మరోసారి ఆలౌటవడంతో ఇరు జట్ల మధ్య పాయింట్ల అంతరం బాగా పెరిగిపోయింది. దీంతో ఫస్ట్ హాఫ్ ముగిసేసరికి ఢిల్లీ 26-18తో నిలిచింది. తొలి సగంలోనే సూపర్-10 సాధించిన నవీన్ ఆ తర్వాత కాస్త నెమ్మదించగా.. బుల్స్ రైడర్ పవన్ షెరావత్ ద్వితీయార్ధంలో రెచ్చిపోయాడు. వరుస రైడ్లలో పాయింట్లు సాధిస్తూ.. అంతరాన్ని తగ్గించే ప్రయత్నం చేశాడు. అయితే పవన్‌కు సహకారం అందించే వారు కరువవడంతో.. బెంగళూరు కోలుకోలేకపోయింది. మరో నాలుగు నిమిషాల్లో ఆట ముగుస్తుందనగా.. బుల్స్ మరోసారి ఆలౌటవడంతో ఢిల్లీ విజయం ఖాయమైంది. మొత్తం మ్యాచ్‌లో ఢిల్లీ రైడర్లు 23 పాయింట్లు సాధిస్తే.. బుల్స్ ఆటగాళ్లు 28 ఖాతాలో వేసుకున్నారు. కానీ, ట్యాక్లింగ్‌లో దబంగ్ జట్టు 15 మందిని పట్టేస్తే.. బెంగళూరు మాత్రం కేవలం 6 పాయింట్లే చేజిక్కించుకోగలిగింది. బుల్స్ మూడు సార్లు ఆలౌట్‌కావడంతో బెంగళూరుకు అదనంగా ఆరు పాయింట్లు చేరడం కూడా కలిసొచ్చింది.

### ఉత్కంఠను దాటుకొని..

హోరాహోరీగా సాగిన మరో సెమీస్‌లో బెంగాల్ వారియర్స్‌దే పైచేయి అయింది. ఇరు జట్లు నువ్వా నేనా అన్నట్లు పోరాడటంతో మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. తొలి సగంలో పోరు రసవత్తరంగా సాగడంతో పలుమార్లు స్కోర్లు సమమయ్యాయి. మరో ఐదు నిమిషాల్లో ఫస్ట్ హాఫ్ ముగుస్తుందనగా.. ముంబై ఆలౌటవడంతో బెంగాల్ నాలుగు పాయింట్ల ఆధిక్యం సాధించింది. అదో జోరులో వారియర్స్ 18-12తో తొలి అర్ధభాగాన్ని ముగించింది. రెండో సగంలో కాస్త పోటీనిచ్చేలా కనిపించిన ముంబైను సుఖేశ్ హెగ్డే గట్టి దెబ్బకొట్టాడు. ఒకే రైడ్‌లో నాలుగు పాయింట్లు సాధించి ఆధిక్యాన్ని 10 పాయింట్లకు పెంచాడు. ఐదు నిమిషాల్లో ఆట ముగుస్తుందనగా.. బెంగాల్ 33-25తో నిలిచింది. ఈ దశలో ముంబై రైడర్ అజింక్యా సూపర్ రైడ్ ద్వారా 4 పాయింట్లు సాధించడంతో మ్యాచ్ ఉత్కంఠంగా మారింది. ఇదే ఊపులో ప్రత్యర్థిని ఆలౌట్ చేసిన దబంగ్ జట్టు కేవలం 2 పాయింట్ల అంతరానికి చేరింది. అభిషేక్ సింగ్ రైడింగ్‌లో పాయింట్ తేవడంతో పాటు ట్యాక్లింగ్‌లో సందీప్ నర్వాల్ ప్రత్యర్థి రైడర్‌ను పట్టేయడంతో ఇరు జట్ల స్కోర్లు 35-35తో సమమయ్యాయి. ఇక రెండు నిమిషాల ఆట మాత్రమే మిగిలుండటంతో.. ఉత్కంఠ తారాస్థాయికి చేరింది. తదుపరి రైడ్‌లో అభిషేక్ ప్రత్యర్థి కోర్టులో పట్టుబడటంతో పాటు చివరి రైడ్‌లో అర్జున్ ప్రభావం చూపలేకపోవడంతో రెండు పాయింట్ల తేడాతో ముంబై ఓటమి పాలవగా.. బెంగాల్ తొలిసారి ఫైనల్లో అడుగుపెట్టింది.

## నేనూ మామూలు మనిషినే..

భావోద్వేగాల నియంత్రణపై ధోనీ వ్యాఖ్య



**న్యూఢిల్లీ:** మిగతా ప్లేయర్ల లాగే మైదానంలో కోపం, అసహనం తనకూ వస్తాయని అంతర్జాతీయ క్రికెట్‌లో 'మిస్టర్ కూల్'గా గుర్తింపు పొందిన టీమ్ఇండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ అన్నాడు. కాకపోతే తక్కిన వాళ్లతో పోల్చుకుంటే తాను భావోద్వేగాలను నియంత్రించుకోవడంలో ఓ అడుగు ముందుంటానని పేర్కొన్నాడు. ఓ ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం మహీ మాట్లాడుతూ.. 'నాకూ అందరిలాగే భావోద్వేగాలు ఉంటాయి. కానీ ఇతరులతో పోల్చుకుంటే నేను వాటిని చక్కగా నియంత్రించుకోగలను. గ్రౌండ్‌లో చాలాసార్లు నిరాశకు గురవుతుంటా. అసహనం, కోపం వస్తుంటాయి. కానీ, ఆ క్షణంలో నా భావోద్వేగాల కంటే జట్టు ప్రయోజనాలే నాకు ముఖ్యం. దీంతో వాటిని అధిగమించి జరగాల్సిన దానిపై దృష్టి పెడుతా. తదుపరి ఓవర్‌లో ఎవరు బౌలింగ్ చేస్తారు. ప్రస్తుత పరిస్థితిలో ఎవరు బంతినందుకుంటే లాభం చేకూరుతుంది లాంటి అంశాల గురించి ఆలోచిస్తా. దీంతో భావోద్వేగాల అంశాన్ని మర్చిపోతా. ఇక్కడ ఫార్మాట్‌ను బట్టి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. సుదీర్ఘ ఫార్మాట్‌లో ప్రణాళికలు అమలు చేసేందుకు కావాల్సినంత సమయం ఉంటుంది. కానీ, పొట్టి ఫార్మాట్‌లో ఆ చాన్స్ ఉండదు. ఏ నిర్ణయమైన క్షణాల్లో తీసుకోవాల్సిందే. ఆ క్షణంలో మనం అనుకున్న ప్రణాళికలు కొన్ని సార్లు తప్పు కావచ్చు. కానీ ప్రత్యర్థిపై గెలువడమే అంతిమ లక్ష్యం' అని ధోనీ వివరించాడు. ప్రతిష్ఠాత్మక వన్డే ప్రపంచ కప్ సెమీఫైనల్ ఓటమి తర్వాత జట్టుకు దూరంగా ఉంటున్న 38 ఏండ్ల ధోనీ.. మెగా టోర్నీ అనంతరం రెండు నెలల కాలం భారత సైన్యానికి సేవలందించాడు. ప్రస్తుతం కుటుంబంతో కలిసి విశ్రాంతి తీసుకుంటున్న మహీ రిటైర్మెంట్‌కు సంబంధించిన వార్తలు గత కొన్నాళ్లుగా చక్కర్లు కొడుతూనే ఉన్నాయి.

## 'సూపర్ ఓవర్' మంచిదే



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మెగాటోర్నీల్లో ఫలితం తేల్చేందుకు వినియోగిస్తున్న 'బౌండ్రీల సంఖ్య' నిబంధనను తొలగించడంపై క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ హర్షం వ్యక్తం చేశాడు. ఎక్కువ బౌండ్రీలు బాదిన జట్టును విజేతగా ప్రకటించకుండా ఫలితం తేలేవరకు 'సూపర్ ఓవర్' నిర్వహించాలని ఐసీసీ తీసుకున్న నిర్ణయాన్ని మాస్టర్ స్వాగతించాడు. 'ఇరుజట్లు సమానంగా నిలిచినప్పుడు విజేతను తేల్చేందుకు ఇది సరైన విధానమని భావిస్తున్నా' అని సచిన్ ట్వీట్ చేశాడు.

దుబాయ్ వేదికగా సోమవారం జరిగిన బోర్డు మీటింగ్‌లో ఐసీసీ కీలక నిర్ణయాలు తీసుకున్న విషయం తెలిసిందే. ఇకపై ఐసీసీ టోర్నీ నాకౌట్ స్టేజ్‌లో మ్యాచ్ టై అయితే సూపర్ ఓవర్‌ను నిర్వహించడంతో పాటు.. ఫలితం తేలేవరకు ఆ సూపర్ ఓవర్‌ను కొనసాగించనుంది. గ్రూప్ దశలో టై అయిన మ్యాచ్‌కు కూడా సూపర్ ఓవర్ నిర్వహిస్తారు. అది కూడా 'టై'గా ముగిస్తే.. మ్యాచ్‌ను 'టై'గా ప్రకటిస్తారు. ఈ ఏడాది వేసవిలో న్యూజిలాండ్, ఇంగ్లండ్ మధ్య జరిగిన వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఇరు జట్ల స్కోర్లు సమంకాగా.. విజేతను నిర్ణయించేందుకు సూపర్ ఓవర్‌ను నిర్వహించారు. అయితే అందులోనూ స్కోర్లు సమానం కావడంతో మ్యాచ్‌లో ఎక్కువ బౌండ్రీలు కొట్టిన ఇంగ్లండ్‌ను విజేతగా ప్రకటించారు. దీంతో ఈ నిబంధనపై సర్వత్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. దిక్కుమాలిన నిబంధన అంటూ దుమ్మెత్తిపోయడంతో ఐసీసీ దిద్దుబాటు చర్యలకు పూనుకుంది.

## ధోనీతో మాట్లాడుతా..



**కోల్‌కతా:** టీమ్ఇండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ కెరీర్ గురించి సెలెక్టర్లు ఏం ఆలోచిస్తున్నారో త్వరలోనే తెలుసుకుంటానని బీసీసీఐ నయా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న సౌరవ్ గంగూలీ పేర్కొన్నాడు. అక్టోబర్ 23న అధికారికంగా బాధ్యతలు చేపట్టనున్న బెంగాల్ టైగర్ మరుసటి రోజు సెలెక్షన్ కమిటీతో సమావేశం కానున్నాడు. 'అక్టోబర్ 24న సెలెక్టర్లతో సమావేశమవుతా. ధోనీ కెరీర్‌కు సంబంధించి వారు ఏం ఆలోచిస్తున్నారో తెలుసుకుంటా. ఆ తర్వాతే ఈ అంశంపై మాట్లాడుతా. ధోనీ మనసులో ఏముందో కనుక్కుంటా. అతడు ఏం చేయాలనుకుంటున్నాడో.. ఏం చేయకూడదో అతడితో చర్చిస్తా' అని గంగూలీ అన్నాడు. ఈ సందర్భంగా తనకు శుభాకాంక్షలు తెలిపిన సెహ్వాగ్, జహీర్, రహానే, ధవన్, పంత్, హర్భజన్, జయసూర్యలకు దాదా కృతజ్ఞతలు తెలిపాడు.

# 'జై'స్వాల్ డబుల్ ధమాకా

పిన్న వయసు ప్లేయర్‌గా రికార్డు



**బెంగళూరు:** దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో యువ ఆటగాళ్ల మెరుపులు కొనసాగుతున్నాయి. వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ సంజూ శాంసన్ డబుల్ సెంచరీ మరువకముందే.. ముంబై యువ ఆటగాడు యశస్వీ జైస్వాల్ (154 బంతుల్లో 203; 17 ఫోర్లు, 12 సిక్సర్లు) ఆ ఫీట్ రిపీట్ చేశాడు. ఎలైట్ గ్రూప్-ఏలో భాగంగా జార్ఖండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ 17 ఏండ్ల చిచ్చరపిడుగు చెలరేగిపోయాడు. దీంతో లిస్ట్-ఏ క్రికెట్‌లో అత్యంత పిన్న వయసు (17 ఏండ్ల 192 రోజులు)లో డబుల్ సెంచరీ బాదిన ఆటగాడిగా రికార్డుల్లోకి ఎక్కాడు. యశస్వీ దూకుడుతో మొదట బ్యాటింగ్ చేసిన ముంబై నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్లకు 358 పరుగులు చేసింది. ఆదిత్య తారే (78) కూడా రాణించాడు. అనంతరం లక్ష్య ఛేదనలో జార్ఖండ్ 46.4 ఓవర్లలో 319 పరుగులకు ఆలౌటైంది. 66 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ జార్ఖండ్‌ను విరాట్ సింగ్ (100), సౌరభ్ తివారీ (77) ఆదుకున్నారు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 171 పరుగులు జోడించడంతో ఒక దశలో జార్ఖండ్ విజయం సాధిస్తుందనిపించినా.. ముంబై పేసర్ ధవల్ కులకర్ణి (5/37) కీలక సమయాల్లో వికెట్లు పడగొట్టి జట్టును గెలిపించాడు.

### ఐపీఎల్ రేసులోకి..

వచ్చే సీజన్ కోసం యువ ఆటగాళ్లను జట్టులోకి తీసుకోవాలని చూస్తున్న ఐపీఎల్ ఫ్రాంచైజీల కండ్లు ఇప్పటికే ఈ కుర్రాడి మీద పడి ఉంటాయనడంలో సందేహం లేదు. ప్రతిభను ఒడిసిపట్టేందుకు కింగ్స్ ఎలెవన్ పంజాబ్ ఫ్రాంచైజీ కోట్నీ వాల్ష్ లాంటి దిగ్గజాన్ని నియమించుకుంటే.. మిగిలిన జట్లు కూడా దేశవాళీ టోర్నీలపై ఓ కన్నేసి ఉంచాయి. ఈ నేపథ్యంలో 17 ఏండ్ల యశస్వీని దక్కించుకునేందుకు ఈసారి వేలంలో పోటీ నెలకొనే అవకాశాలున్నాయి. ఉత్తర ప్రదేశ్‌లో పుట్టిన ఈ ఎడమచేతి వాటం ఓపెనర్.. ధాటిగా ఆడటమే లక్ష్యంగా దూసుకుపోతున్నాడు. భారత అండర్-19 జట్టు తరపున ఇటీవల ఇంగ్లండ్‌లో పర్యటించిన జైస్వాల్ అక్కడ కూడా తన బ్యాటింగ్‌తో ఫర్వాలేదనిపించాడు. స్టార్ ఆటగాళ్లతో నిండి ఉండే ముంబై జట్టులో చోటు దక్కించుకోవడమే కష్టం అనుకుంటే.. తానాడిన ఐదో ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లోనే ద్విశతకంతో అదరగొట్టాడు. పృథ్వీ షా గైర్హాజరీలో ఓపెనర్‌గా చాన్స్ దక్కించుకున్న ఈ చిచ్చరపిడుగు ముమ్ముందు ఎలాంటి ప్రదర్శనలు చేస్తాడో చూడాలి.



## వాలీబాల్ టోర్నీ షురూ..

**నవీపేట:** నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం జన్నేపల్లిలో సీబీఎస్ఈ చెన్నై రీజియన్ అంతర్రాష్ట్ర అండర్-17, 19 వాలీబాల్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ టోర్నీలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 70 జట్లు, 800 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈనెల 19 వరకు నాలుగు రోజుల పాటు టోర్నీ జరుగనుంది. ఈ పోటీలను జిల్లా కలెక్టర్ రామ్మోహన్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో సీబీఎస్ఈ క్రీడలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. సీబీఎస్ఈ క్రీడలు పట్టణాలకే పరిమితమైనప్పటికీ, సెంట్రల్ బోర్డు ఆదేశానుసారం గ్రామీణ ప్రాంతమైన జన్నేపల్లిలో సీబీఎస్ఈ టోర్నీ నిర్వహించడం జిల్లాకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మారయ్యగౌడ్, ఎండీ హరిత, ప్రిన్సిపాల్ భాస్కర్, సీబీఎస్ఈ చెన్నై రీజియన్ పర్యవేక్షకుడు చిన్నయాన్, శివప్రసాద్ పాల్గొన్నారు.

## ఫైనల్లో భారత కుర్రాళ్లు



**జొహర్ బహ్రు (మలేషియా):** వరుస విజయాలతో దూకుడుమీదున్న భారత జూనియర్ హాకీ జట్టు సుల్తాన్ జొహర్ కప్ ఫైనల్‌కు చేరింది. రౌండ్ రాబిన్ టోర్నీలో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 5-1తో ఆస్ట్రేలియాను చిత్తుచేసి తుదిపోరుకు అర్హత సాధించింది. శైలానంద్ లక్రా (26వ, 29వ నిమిషాల్లో) డబుల్ గోల్స్‌తో మెరిస్తే.. దిల్‌ప్రీత్ సింగ్ (44వ ని.లో), గుర్‌సాహిబ్‌జిత్ సింగ్ (48వ ని.లో), మన్‌దీప్ మోర్ (50వ ని.లో) ఒక్కో గోల్ కొట్టి విజయంలో తమవంతు పాత్ర పోషించారు. తొలి క్వార్టర్‌లో ఇరు జట్లు ఖాతా తెరువలేకపోయాయి. రెండో క్వార్టర్‌లో దిల్‌ప్రీత్ సింగ్ అందించిన పాస్‌ను శైలానంద్ లక్రా.. ప్రత్యర్థి డిఫెన్స్‌కు అందకుండ గోల్‌గా మలచడంతో మన జట్టు ఖాతా తెరిచింది. మరో రెండు నిమిషాల అనంతరం లభించిన పెనాల్టీ కార్నర్‌ను మరోసారి లక్రా సద్వినియోగం చేసుకోవడంతో హాఫ్ టైమ్ ముగిసేసరికి భారత్ 2-0తో ముందంజలో నిలిచింది. రెండోసగంలోనూ అదే జోరు కొనసాగించిన భారత్ మరో మూడు గోల్స్ సాధిస్తే.. ప్రత్యర్థి జట్టు ఒక్క గోల్‌తో సరిపెట్టుకుంది.

## సెమీస్‌లో మెదక్, పాలమూరు

**ఎదులాపురం:** జిల్లా కేంద్రంలో ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో 65వ రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. బుధవారం జరిగిన వేర్వేరు మ్యాచ్‌ల్లో విజయాల ద్వారా మెదక్, పాలమూరు, ఆదిలాబాద్, వరంగల్ జట్లు సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరుగుతున్న టోర్నీలో ఆతిథ్య ఆదిలాబాద్‌పై మహబూబ్‌నగర్ 1-0తో విజయం సాధించింది. మిగతా మ్యాచ్‌ల్లో ఖమ్మంపై ఆదిలాబాద్ 8-0తో, నిజామాబాద్, మెదక్ మ్యాచ్ 1-1తో డ్రా కాగా, వరంగల్ 8-0తో హైదరాబాద్‌పై, మహబూబ్‌నగర్ 8-0తో కరీంనగర్‌పై, రంగారెడ్డి 2-1తో నిజామాబాద్‌పై, మెదక్ 11-0తో హైదరాబాద్‌పై, నిజామాబాద్, వరంగల్ 1-1తో, ఖమ్మం 2-0తో కరీంనగర్‌పై గెలిచాయి.



## సైనా నిష్క్రమణ

**ఒడెన్స్(డెన్మార్క్):** భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ పేలవ ఫామ్ కొనసాగుతూనే ఉన్నది. డెన్మార్క్ ఓపెన్ తొలి రౌండ్‌లో సైనా 15-21, 21-23తో సయాకా తకహాషి(జపాన్) చేతిలో ఓటమిపాలైంది. పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ 14-21, 18-21తో అండర్స్ అంటోన్సెన్(డెన్మార్క్) చేతిలో ఓడి టోర్నీ నుంచి వైదొలిగాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రణవ్ జెర్రీ చోప్రా, సిక్కీ రెడ్డి జంట ముందంజ వేసింది. పురుషుల సింగిల్స్‌లో సమీర్‌వర్మ 21-11, 21-11తో కాంటా సుమెన్యయమా(జపాన్)పై గెలిచాడు.


బుధవారం బార్సిలోనాలో ఆరోసారి గోల్డెన్ బూట్ అవార్డు అందుకుంటున్న అర్జెంటీనా సాకర్ స్టార్ లియోనెల్ మెస్సీ

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 38,599 | 11,464 |
| ↗ 93 | ↗ 36 |

ముడి చమురు (బ్రెంట్) ↗ 59.40 డాలర్లు

| బంగారం ధరలు | |
|---|---|
| న్యూఢిల్లీ (రూ.లలో) | |
| 24 క్యారెట్లు | 39,030 |
| 22 క్యారెట్లు | --- |
| వెండి (కిలో) | 46,809 |

## 27న మూరత్ ట్రేడింగ్..28న సెలవు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 16:** దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 27న గంటపాటు మూరత్ ట్రేడింగ్‌ను నిర్వహించనున్నారు. సాయంత్రం 6.15 గంటల నుంచి 7.15 గంటల వరకు ఈ ట్రేడింగ్ జరుగనున్నదని స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రత్యేకంగా సమాచారం ఇచ్చింది. ఆ మరుసటి రోజు ఈ నెల 28న దివాలి బలిప్రతిపదా కావడంతో మార్కెట్లు మూసివేసి వుంచనున్నారు. హిందు క్యాలెండర్ ప్రకారం దీపావళి నుంచి నూతన సంవత్ సంవత్సరం ప్రారంభమవుతున్నది.

# బ్యాంకులు ఆగమాగం

## మన్మోహన్ సింగ్, రాజన్ హయాంలో పనితీరు దారుణంగా దిగజారింది

### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ధ్వజం


మంగళవారం న్యూయార్క్‌లోని కొలంబియా యూనివర్సిటీలో మాట్లాడుతున్న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూయార్క్, అక్టోబర్ 16:** భారత్‌లో ప్రభుత్వ రంగ బ్యాంకుల పనితీరు మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్, రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్‌ల హయాంలో దారుణంగా దిగజారిందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ధ్వజమెత్తారు. ఈ ఇరువురి కారణంగా దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ ఆగమాగమైందని విరుచుకుపడ్డారు. చావుబతుకుల్లో ఉన్న బ్యాంకులకు తిరిగి ప్రాణం పోసే పనిలో ఇప్పుడు తమ ప్రభుత్వం ఉందన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న నిర్మలా సీతారామన్.. మంగళవారం ఇక్కడ ప్రతిష్ఠాత్మక కొలంబియా యూనివర్సిటీస్ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్, పబ్లిక్ అఫైర్స్ వద్ద 'భారత ఆర్థిక వ్యవస్థ: సవాళ్లు-అవకాశాలు' అన్న అంశంపై ఉపన్యాసం ఇచ్చారు. మన్మోహన్, రాజన్ హయాంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మొండి బకాయిలు (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ) ప్రమాదకర స్థాయికి చేరాయని, వాటిని పరిష్కరించే బాధ్యత తాము తీసుకున్నామని చెప్పారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది ఆగస్టులో ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ.70 వేల కోట్ల మూలధన సాయాన్ని అందించామని గుర్తుచేశారు. అంతేగాక 10 బ్యాంకులను నాలుగు బ్యాంకులుగా విలీనం చేశామని తెలిపారు. రాజన్ హయాంలో ఇష్టారాజ్యంగా బ్యాంకులు ఇచ్చిన రుణాలు.. పెద్ద ఎత్తున మొండి బకాయిలుగా పేరుకుపోయాయని మండిపడ్డారు. ఆర్బీఐ గవర్నర్‌గా రాజన్ పదవీ బాధ్యతలు చేపట్టినప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థ బాగుందని, కీలకమైన బ్యాంకింగ్ రంగాన్ని ఆయన భ్రష్టు పట్టించడం వల్లే ఇప్పుడీ దుస్థితి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మన్మోహన్ సింగ్, రాజన్‌ల హయానికి ముందు భారత బ్యాంకులు బలంగా ఉన్నాయనీ నొక్కిచెప్పారు. కాగా, నిరుడు మార్చి ఆఖరు నుంచి ఈ ఏడాది మార్చి చివరిదాకా ఏడాది కాలంలో ఎన్‌పీఏలను రూ.89,189 కోట్లు తగ్గించామన్న మంత్రి.. ఈ మార్చి 31 నాటికి భారతీయ ప్రభుత్వ రంగ బ్యాంకుల మొండి బకాయిలు రూ.8,06,412 కోట్లుగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ అర్వింద్ పనగరియా, ప్రొఫెసర్, ప్రముఖ ఆర్థిక వేత్త జగదీష్ భగవతీ, న్యూయార్క్‌లో భారత కాన్సుల్ జనరల్ సందీప్ చక్రవర్తి కూడా పాల్గొన్నారు.

**అమెరికాతో వాణిజ్య చర్చలపై..**

భారత్, అమెరికా మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు ఆశాజనకంగా కొనసాగుతున్నాయని, త్వరలోనే ముగుస్తాయన్న ఆశాభావాన్ని నిర్మలా సీతారామన్ ఈ సందర్భంగా వెలిబుచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటనకు ముందే ఈ చర్చలు ముగియాల్సి ఉన్నా.. భారతీయ మార్కెట్‌లోకి స్టెంట్లు తదితర వైద్య పరికరాలు, కమ్యూనికేషన్ టెక్నాలజీ, పాల ఉత్పత్తుల అనుమతి కోసం అమెరికా ప్రయత్నిస్తుండటంతో ముగియలేదు. కాగా, వాణిజ్య లోటుపై అమెరికా అభ్యంతరాలనూ పరిష్కరించాలన్న దిశగా ఈ చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు.

## సవాలే కానీ.. సాధ్యమే



**భారత** ఆర్థిక వ్యవస్థను 5 లక్షల కోట్ల డాలర్లకు చేర్చాలన్న ఆశయం ఓ సవాలేనన్న నిర్మలా సీతారామన్ అది సాధ్యమేనన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. 2024-25కల్లా దేశ జీడీపీ విలువను 5 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్న లక్ష్యా న్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్దేశించిన విషయం తెలిసిందే. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం (2019-20)లో మరిన్ని సంస్కరణలు ఉంటాయన్న సంకేతాలను ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ ఇచ్చారు. ద్వితీయార్థం ప్రారంభంలోనే ఉన్నామని, ఈ ఆరు నెలల్లో ఇంకా ఎన్నో ఆర్థిక సంస్కరణలను తెస్తామన్నారు. 2014లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి దేశ ఆర్థిక వ్యవస్థ విలువ పెరుగుతూనే ఉందని, నాడు 1.7 లక్షల కోట్ల డాలర్లుగా ఉంటే.. ఐదేండ్లలో లక్ష కోట్ల డాలర్లు ఎగిసి 2.7 లక్షల కోట్ల డాలర్లకు చేరిందని తెలిపారు. ఈ క్రమంలోనే 2024-25 నాటికి 5 లక్షల కోట్ల డాలర్లకు చేర్చాలంటే కష్టమేనన్న నిర్మలా సీతారామన్.. ప్ర యత్నిస్తే సాధ్యమేనన్న ధీమాను కనబరిచారు. ప్రైవేట్ రం గంలో పెట్టుబడులను పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికీ తాము ఈసారి వృద్ధి రేటు 7 శాతంగానే ఉంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) భారత జీడీపీని 6.1 శాతంగానే అంచనా వేసిన నేపథ్యంలో ప్రపంచ వృద్ధిరేటును 3.2 శాతానికి తగ్గించిన క్రమంలోనే అలా జరిగిందన్నారు.



# బజాజ్ ఎలక్ట్రిక్ చేతక్

## మార్కెట్‌లోకి మళ్లీ వస్తున్న ఎవర్‌గ్రీన్ మోడల్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 16:** దేశీయ రోడ్లపై ఒకప్పుడు దూసుకుపోయిన ఐకానిక్ స్కూటర్ బ్రాండ్ బజాజ్ చేతక్ మళ్లీ రోడ్లపైకి వచ్చింది. కానీ, ఈసారి ఎలక్ట్రిక్ అవతార్ రూపంలో ప్రత్యక్షమైంది. చేతక్ బ్రాండ్‌తో విడుదల చేసిన ఈ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను వచ్చే జనవరి నుంచి దేశవ్యాప్తంగా విక్రయించనున్నట్లు ప్రకటించింది. పుణెలోని చకాన్ ప్లాంట్లో ఈ స్కూటర్‌ను కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ, నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్, బజాజ్ ఆటో ఎండీ రాహుల్ బజాజ్‌లు ఆవిష్కరించారు. ఈ స్కూటర్ కోసం దేశవ్యాప్తంగా కంపెనీ ఉన్న డీలర్ల వద్ద ముందస్తు బుకింగ్ చేసుకోవచ్చునని సూచించింది. ప్రస్తుతానికి దేశవ్యాప్తంగా విక్రయించనున్న ఈ స్కూటర్‌ను వచ్చే ఏడాది చివరినాటి నుంచి యూరప్ దేశాలకు ఎగుమతి చేయనున్నది. ఈ స్కూటర్ ధర కంపెనీ వెల్లడించకపోయినప్పటికీ..గరిష్ఠంగా రూ.1.5 లక్షల లోపు ఉంటుందని అంచనా. ఈ స్కూటర్ బ్యాటరీని 5 గంటలపాటు రీచార్జి చేస్తే స్పోర్ట్ మోడల్ 85 కిలోమీటర్లు ప్రయాణించనుండగా, ఎకో మోడల్ 95 కిలోమీటర్లు ఇవ్వనున్నది. నితిన్ గడ్కరీ మాట్లాడుతూ..ఆటోమొబైల్ ఇండస్ట్రీ మొత్తం ఎకో-ఫ్రెండ్లీ టెక్నాలజీని వాడుతున్నాయని, ముఖ్యంగా విద్యుత్, బయోఫ్యూయల్ బాట పట్టాయన్నారు. 2023 నాటికి ప్రతి మూడు చక్రాల వాహనం, 2025 నాటికి 150 సీసీ కంటే తక్కువ సామర్థ్యం కలిగిన బైకులు 100 శాతం విద్యుత్‌తో నడిచే వాహనాలు ఉండాలని నీతి ఆయోగ్ లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ సందర్భంగా రాహుల్ బజాజ్ మాట్లాడుతూ..70 దశకంలో అందుబాటులోకి వచ్చిన ఈ స్కూటర్ అప్పట్లోనే కోటికి పైగా అమ్ముడయ్యాయని, ఈ వాహనం హమారా బజాజ్‌గా మారిపోయిందన్నారు. ఆ తర్వాతి క్రమంలో మోటర్‌సైకిళ్లు రంగప్రవేశం చేయడంతో 2000 మధ్య నుంచి స్కూటర్ల ఉత్పత్తిని నిలిపివేసినట్లు చెప్పారు.



## హ్యావెల్స్ నుంచి సరికొత్త స్విచ్‌గేర్లు

**హైదరాబాద్, అక్టోబర్ 16:** కన్జ్యూమర్ ఎలక్ట్రికల్ పరికరాల తయారీ సంస్థ హ్యావెల్స్.. దేశీయ మార్కెట్లోకి స్టడెక్స్ స్మార్ట్‌రేంజ స్విచ్‌గేర్లను విడుదల చేసింది. అడ్వాన్స్ టెక్నాలజీతో రూపొందించిన ఈ పరికరాలు విద్యుత్ షాక్‌లు జరిగినప్పటికీ దానంతటదే పడిపోనున్నదని కంపెనీ ఇండియా ప్రెసిడెంట్ సౌరబ్ గోయెల్ తెలిపారు. వినియోగదారులు కోరుకుంటున్న విధంగా రూపొందించిన ఈ స్విచ్‌గేర్లు...హోటళ్లు, కార్యాలయాలు, ఫంక్షలను సులువుగా నిర్వహించడానికి వీలు పడుతుందన్నారు.

## వరుస లాభాల్లో స్టాక్ మార్కెట్లు

**ముంబై, అక్టోబర్ 16:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస లాభాల్లో కొనసాగుతున్నాయి. బుధవారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 92.90 పాయింట్లు పుంజుకుని 38,598.99 వద్ద ముగియగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 35.70 పాయింట్లు పెరిగి 11,464 వద్ద నిలిచింది. బజాజ్ ఫైనాన్స్, ఓఎన్జీసీ, యెస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్సీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్, ఆర్ఐఎల్ షేర్ల విలువ 3.57% పెరిగింది.

# డిజిటల్ హైదరాబాద్

### జోరుగా ఆన్‌లైన్ లావాదేవీలు
### నగదు రహిత చెల్లింపులకే నగర వాసుల మొగ్గు
### పెద్ద ఎత్తున గూగుల్ పే, ఫోన్‌పే వినియోగం
### రాజోర్‌పే తాజా నివేదికలో వెల్లడి

**హైదరాబాద్, అక్టోబర్ 16:** టెక్నాలజీని వేగంగా అందిపుచ్చుకునే హైదరాబాదీలు.. డిజిటల్ పేమెంట్లలో దూసుకుపోతున్నారు. చలామణిలో నగదు లభ్యత ఉన్నా.. నగర వాసులు మాత్రం ఆన్‌లైన్ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్-యూపీఐ) చెల్లింపులకే మొగ్గు చూపుతున్నారు. దీంతో ఆర్థిక సేవలు, ఆహారోత్పత్తులు, శీతల పానియాలు తదితర కొనుగోళ్లు, ఇతరత్రా వినీమయ సేవల చెల్లింపులన్నీ అధిక శాతం నగదు రహిత లావాదేవీల్లోనే జరుగుతున్నాయి. గత మూడు నెలల్లో ఈ టాప్-3 రంగాల్లో దాదాపు 51 శాతం వృద్ధి నమోదైంది. ఆర్థిక సేవల్లో 22 శాతం, ఆహారోత్పత్తులు, పానియాల కొనుగోళ్లలో 18 శాతం, ఇతరత్రా సేవల చెల్లింపుల్లో 10 శాతం మేర ఆన్‌లైన్‌లో జరిగాయి. దేశీయ తొలి ఆన్‌లైన్ చెల్లింపుల పరిష్కారాలు, అవసరాల సంస్థ రాజోర్‌పే వివరాల ప్రకారం మూడు నెలల్లోనే భాగ్యనగర డిజిటల్ చెల్లింపులు 58 శాతం వృద్ధి చెందాయి. 'విస్తరిస్తున్న ఫిన్‌టెక్ శకం' పేరుతో ప్రారంభించిన మూడో విడుత నివేదికలో హైదరాబాద్ ఆన్‌లైన్ లావాదేవీలు దేశంలో ఆకర్షణీయంగా ఉన్నట్లు తేలిందని బుధవారం రాజోర్‌పే ప్రకటించింది. బెంగళూరు తర్వాత హైదరాబాదేనని వెల్లడించింది. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు యూపీఐ లావాదేవీలు ఏకంగా 142 శాతం పెరిగాయని స్పష్టం చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)తో చూస్తే రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో హైదరాబాద్ డిజిటల్ పేమెంట్ లావాదేవీలు 9 శాతం పుంజుకున్నట్లు పేర్కొన్నది.



**పీటుఎంలో కార్డులదే హవా**

హైదరాబాద్ షాపింగ్‌లో కార్డులదే హవా. క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారానే భారీగా లావాదేవీలు నడుస్తున్నాయి. ఈ జూలై-సెప్టెంబర్ కాలంలో వ్యక్తి నుంచి వ్యాపారికి చెల్లింపుల (పీటుఎం) విభాగంలో 41 శాతం వాటా కార్డులదే. ఆ తర్వాత యూపీఐ చెల్లింపులు (39 శాతం) ఉండగా, నెట్ బ్యాంకింగ్ (18 శాతం) తర్వాతి స్థానంలో ఉన్నాయి. అయితే అంతకు ముందు త్రైమాసికం (ఏప్రిల్-జూన్)తో పోల్చితే కార్డు లావాదేవీలు 11 శాతం పడిపోగా, యూపీఐ లావాదేవీలు 58 శాతం పెరిగాయి. ఇక యూపీఐ చెల్లింపుల్లో గూగుల్ పే ఆధిపత్యం కొనసాగుతున్నది. అత్యధికులు గూగుల్ పే యాప్ ద్వారానే చెల్లింపులు జరుపుతుండగా, జూలై-సెప్టెంబర్ వ్యవధిలో ఇవి 59 శాతంగా నమోదైనట్లు తాజా సర్వేలో తేలింది. గూగుల్ పే తర్వాత ఫోన్‌పేను 32 శాతం మంది వినియోగించారు. ఏప్రిల్-జూన్‌తో పోల్చితే ఫోన్‌పే లావాదేవీలు ఏకంగా 84 శాతం ఎగబాకడం గమనార్హం.

**జిల్లాల్లో ఖమ్మం టాప్**

రాష్ట్రంలో జంట నగరాలు హైదరాబాద్, సికింద్రాబాద్‌ల తర్వాత అత్యధికంగా డిజిటల్ లావాదేవీలు నమోదైన జిల్లాల్లో ఖమ్మం ముందున్నది. ఖమ్మం వాసులు పెద్ద ఎత్తున ఆన్‌లైన్ చెల్లింపులు జరుపుతున్నారని తాజా నివేదికలో రాజోర్‌పే స్పష్టం చేసింది. ఆ తర్వాత కరీంనగర్, వరంగల్, పాల్వంచలున్నాయి. కాగా, రాజోర్‌పే వేదికగా జరిగిన లావాదేవీల ఆధారంగా ఈ నివేదిక మొత్తం తయారవ్వగా, హైదరాబాద్‌లోని చిన్న, మధ్యతరహా సంస్థ (ఎస్ఎంఈ)ల్లో పేమెంట్ లింక్స్, పేమెంట్ పేజీల ఇచ్చిపుచ్చుకోవడాలూ గణనీయంగా పెరిగినట్లు తేలింది.

### దేశవ్యాప్తంగా..

దేశవ్యాప్తంగా నిరుడు ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు డిజిటల్ లావాదేవీలు 383 శాతం పెరిగాయి. బెంగళూరు మొదటి స్థానంలో ఉండగా, హైదరాబాద్ రెండో స్థానంలో ఉన్నది. ఢిల్లీ, ముంబై, పుణె తర్వాతి స్థానాల్లో నిలిచాయి. యూపీఐ, నెట్ బ్యాంకింగ్ లావాదేవీలు ఈ జనవరి నుంచి సెప్టెంబర్ వరకు వరుసగా 222 శాతం, 19 శాతం పెరిగాయి. యూపీఐ చెల్లింపుల్లో గూగుల్ పే (62 శాతం) అగ్రస్థానంలో ఉండగా, తర్వాతి స్థానాల్లో ఫోన్‌పే, పేటీఎం, భీమ్ యాప్‌లున్నాయి. ఆహారోత్పత్తులు, శీతల పానియాల కోసం ఎక్కువ మంది ఉపయోగించగా, ఆర్థిక లావాదేవీలు, ప్రయాణాల కోసం ఆ తర్వాత వాడారు. 'హైదరాబాద్ ఎల్లప్పుడూ కొత్తదనాన్ని, సాంకేతికతను స్వాగతిస్తుంది. డిజిటల్ పేమెంట్లలో నగర ప్రగతి ఆకర్షణీయం. దేశ ఆర్థిక నిర్మాణంలో హైదరాబాద్‌ది ప్రత్యేక పాత్ర' అని రాజోర్‌పే సహ వ్యవస్థాపకుడు, సీటీవో శషాంక్ కుమార్ అన్నారు.

## బిగ్‘సి’ దసరావళి తొలి లక్కీడ్రా విజేతలు వీరే

**హైదరాబాద్, అక్టోబర్ 16:** ప్రముఖ మొబైల్ రిటైల్ దిగ్గజం బిగ్‘సి’ ప్రకటించిన దసరావళి డబుల్ ధమాకా ఆఫర్‌కు వినియోగదారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా తొలివారం లక్కీ డ్రా విజేతలను ఇక్కడ ప్రకటించింది. తొలివారానికిగాను మారుతి ఆల్టో కారు గెలుచుకున్న వారిలో రాము(కూ.నం: 88057), కనకాల గణపతి (కూ.నం:00046), తలారి మార్థమ్మ (కూ. నం:34745), డోరెడ్లా మనోజ్ (కూ. నం: 114140), తిరుపతి (కూ. నం: 34338), సుధీర్ కుమార్(కూ.నం: 23261), అనూష (కూ.నం:93489), సద్దామ్ షేక్ (కూ. నం:119438), సందీప్ కే(రూ.45664), నారాయణ స్వామి (కూ. నం:86859)లు ఉన్నారు. ఈ సందర్భంగా కంపెనీ ఫౌండర్ బాలు చౌదరి మాట్లాడుతూ..మొత్తం మూడు వారాల్లో 30 ఆల్టో కార్లు, 30 బజాజ్ ప్లాటినా బైకులు అందిస్తున్నామని చెప్పారు. ఈ లక్కీ డ్రాతోపాటు పది శాతం వరకు హెచ్‌డీఎఫ్‌సీ క్యాష్‌బ్యాక్, సులభవాయిదా పద్ధతిలో మొబైల్‌ను కొనుగోలు చేసిన వారికి ఒక ఎంఈఐ ఉచితంగా అందిస్తున్న సంస్థ..30 శాతం పేటీఎం క్యాష్‌బ్యాక్, ఓటీఎస్ఆర్ ఉచితం, ప్రతి మొబైల్ కొనుగోలుపై ఖచ్చితమైన బహుమతి, సున్న శాతం డౌన్‌పేమెంట్, వన్‌ప్లస్ మొబైళ్లపై రూ.3 వేల వరకు హెచ్‌డీఎఫ్‌సీ క్యాష్‌బ్యాక్ ఆఫర్‌ను కల్పిస్తున్నది.



లక్కీడ్రా ద్వారా విజేతలను ప్రకటిస్తున్న బిగ్-సి వ్యవస్థాపక సీఎండీ బాలు చౌదరి తదితరులు

## మూడేండ్లలో 2 వేల కోట్ల టర్నోవర్

### జేఎస్‌డబ్ల్యూ జాయింట్ ఎండీ సుందరేశన్

**హైదరాబాద్, అక్టోబర్ 16:** జేఎస్‌డబ్ల్యూ గ్రూపు తాజాగా పెయింట్ రంగంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా జేఎస్‌డబ్ల్యూ జాయింట్ ఎండీ, సీఈవో ఏఎస్ సుందరేశన్ మాట్లాడుతూ..ఒకే ధరకు అన్ని రకాల పెయింట్స్‌ను వినియోగదారులకు అందించడం ద్వారా ధరలు దిగొచ్చే అవకాశం ఉన్నదన్నారు. రూ.600 కోట్లతో మహారాష్ట్ర, కర్ణాటకలో ఏర్పాటు చేసిన యూనిట్ల ద్వారా ప్రతియేటా 1.25 లక్షల కిలోలీటర్లు కలర్స్ ఉత్పత్తి కానున్నాయని చెప్పారు. వచ్చే మూడేండ్లకాలంలో రూ.2 వేల కోట్ల టర్నోవర్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించిన ఆయన..ఇందు కోసం మార్కెట్ వాటా 5 శాతానికి చేరుకునే అవకాశం ఉందన్నారు. ఈ ఏడాది చివరినాటికి దక్షిణాదికి తన వ్యాపారాన్ని విస్తరించనున్న సంస్థ..2022 నాటికి దేశవ్యాప్తంగా అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు.

# సుప్రీం కోర్టుకు పీఎంసీ కేసు

### రేపు అత్యవసర విచారణ



**న్యూఢిల్లీ/ముంబై, అక్టోబర్ 16:** పంజాబ్ అండ్ మహారాష్ట్ర సహకార (పీఎంసీ) బ్యాంక్ కేసు సుప్రీం కోర్టుకు చేరింది. ఈ వ్యవహారంలో డిపాజిటర్ల సొమ్ము రక్షణార్థం మార్గదర్శకాలు జారీ చేయాలంటూ ఢిల్లీకి చెందిన బెజోన్ కుమార్ మిశ్రా వేసిన అత్యవసర పిటిషన్‌ను బుధవారం అత్యున్నత న్యాయస్థానం స్వీకరించింది. ఈ క్రమంలోనే శుక్రవారం దీనిపై విచారణ జరిపేందుకు అంగీకరించింది. పీఎంసీ బ్యాంక్‌లో రూ.4,355 కోట్ల కుంభకోణం జరుగగా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఆరు నెలలపాటు ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. దీంతో డిపాజిటర్లు రూ.40 వేలకు మించి తమ నగదును బ్యాంకు నుంచి ఉపసంహరించుకోలేని పరిస్థితులు వచ్చాయి. దీనిపై డిపాజిటర్ల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమవుతుండగా, ఆందోళనల బాట పట్టిన సంగతీ విదితమే. అయితే సోమవారం ఇద్దరు, మంగళవారం ఒక డిపాజిటర్ చనిపోయిన నేపథ్యంలో దాఖలైన మిశ్రా పిటిషన్‌పై జస్టిస్ ఎన్వీ రమణ, ఆర్ సుభాష్ రెడ్డి, బీఆర్ గవాయ్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం స్పందించింది. శుక్రవారం విచారణ జరుగుతుందని కోర్టు రిజిస్ట్రీకి సూచించింది. కాగా, కొందరు అక్రమార్కుల వల్ల వేలాది డిపాజిటర్లు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తన పిటిషన్‌లో మిశ్రా పేర్కొన్నారు. ఈ కేసును దృష్టిలో పెట్టుకుని సహకార బ్యాంకులతోపాటు జాతీయ బ్యాంకుల్లోని డిపాజిట్లకు కేంద్ర ప్రభుత్వం, ఆర్బీఐ 100 శాతం బీమాను కల్పించేలా సూచనలు చేయాలని సుప్రీంను కోరారు. అంతేగాక అన్ని సహకార బ్యాంకుల కార్యకలాపాల పర్యవేక్షణకు ఓ ఉన్నతస్థాయి కమిటీని వేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. తద్వారా బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కల్పించాలన్నారు. ముఖ్యంగా పీఎంసీ బ్యాంక్‌పై, అందులోని నగదు ఉపసంహరణలపై ఆర్బీఐ విధించిన ఆంక్షలను తొలగించాలని కోరారు.

**23దాకా ముగ్గురికి రిమాండ్**

పీఎంసీ బ్యాంక్ కుంభకోణం కేసులో అరెస్టయిన ముగ్గురికి ఈ నెల 23 వరకు కోర్టు జ్యూడీషియల్ రిమాండ్ విధించింది. హెచ్‌డీఐఎల్ చైర్మన్, ఎండీ రాకేశ్ వాధవాన్, ఆయన కుమారుడు సారంగ్ వాధవాన్‌తోపాటు బ్యాంక్ మాజీ చైర్మన్ వాయం సింగ్‌లకు బుధవారం ముంబై మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎస్‌జీ షేక్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. నిర్మాణ రంగ సంస్థ హెచ్‌డీఐఎల్, ఆ గ్రూప్ కంపెనీలు పీఎంసీ బ్యాంక్ నుంచి 44 రుణాలను పొందినట్లు సమాచారం. ఇదే పీఎంసీ సంక్షోభానికి మూల కారణమైంది. హెడీఐఎల్ గ్రూప్ బ్యాంక్‌కు రూ.6,500 కోట్లు బకాయి పడగా, మొత్తం రూ.9,000 కోట్ల బ్యాంక్ రుణాల్లో ఇది 70 శాతానికి సమానం కావడం గమనార్హం. ఇక హెచ్‌డీఐఎల్ కోసం బ్యాంక్ 21 వేలకుపైగా నకిలీ ఖాతాలను సృష్టించిందని ఆర్బీఐ విచారణలో తేలింది. పైగా అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2017-18)తో పోల్చితే గత ఆర్థిక సంవత్సరం (2018-19) బ్యాంక్ మొండి బకాయిలు (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ) రెండింతలకుపైగా పెరిగిన నేపథ్యంలో నిబంధనల ఉల్లంఘన, నియంత్రణ లోపాలను ఎత్తిచూపుతూ బ్యాంక్‌పై ఆంక్షలు విధించింది.

## భయాలు వద్దు: పీఎంసీ బ్యాంక్

**డిపాజిటర్లు** మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యలు చేసుకోవడం, గుండెపోటుకు గురై మరణిస్తున్న నేపథ్యంలో భయపడవద్దని పీఎంసీ బ్యాంక్ పర్యవేక్షకుడిగా వ్యవహరిస్తున్న ఆర్బీఐ నియమిత జేబీ భోరియా పిలుపునిచ్చారు. డిపాజిటర్ల సొమ్ము భద్రంగా ఉంటుందన్న హామీ ఇచ్చారు. బుధవారం ఆయన ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్‌తోపాటు, డిప్యూటీ గవర్నర్, ఇతర సీనియర్ ఉన్నతస్థాయి వర్గాలను కలిశారు. బ్యాంక్‌లో నెల కొన్న పరిణామాలను ఈ సందర్భంగా వివరించినట్లు తెలుస్తున్నది. కాగా, బ్యాంక్ లావాదేవీలకు సంబంధించి వాస్తవాలను వెల్లడించేందుకు తాజా బ్యాలెన్స్ షీట్‌ను పీఎంసీ బ్యాంక్ రూపొందిస్తున్నదని ఆర్బీఐ తెలిపింది. సోమవారం సంజయ్ గులాటీ (రూ.90 లక్షలు) అనే డిపాజిట్‌దారు గుండెపోటుతో చనిపోగా, డాక్టర్ బిజ్లానీ (రూ.కోటి) అనే మరో డిపాజిట్‌దారు ఆత్మహత్య చేసుకున్నారు. మంగళవారం ఫట్టోమల్ పంజాబీ (రూ.10 లక్షలు) ఇంకో డిపాజిట్‌దారు కూడా గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. ఈ కేసుపై దర్యాప్తు జరుపుతున్న ఈడీ.. హెచ్‌డీఐఎల్ ప్రమోటర్లకు చెందిన దాదాపు రూ.4 వేల కోట్ల ఆస్తులను జప్తు చేసిన సంగతీ విదితమే.

# సంక్షోభంలో బ్యాంకులు

### తక్షణ చర్యలు అవసరం.. నోబెల్ గ్రహీత అభిజిత్ బెనర్జీ

> “ ఆర్బీఐ అప్రమత్తంగా లేదు

**కోల్‌కతా, అక్టోబర్ 16:** దేశీయ బ్యాంకింగ్ రంగం.. పెను సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని, బ్యాంకులు పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోతున్నాయని ఆర్థిక నోబెల్ పురస్కార గ్రహీత అభిజిత్ బెనర్జీ ఆందోళన వ్యక్తం చేశారు. నానాటికీ పెరుగుతున్న బ్యాంకింగ్ సమస్యలు, పంజాబ్ అండ్ మహారాష్ట్ర సహకార (పీఎంసీ) బ్యాంక్ కుంభకోణం నేపథ్యంలో బుధవారం ఆయన ఇక్కడ పైవిధంగా స్పందించారు. 'ప్రస్తుతం భారత బ్యాంకింగ్ వ్యవస్థ పెను సమస్యను ఎదుర్కొంటున్నది. ఎన్నో ఏండ్ల నుంచి ఈ సమస్య ఉందనిపిస్తున్నది. ఇప్పుడు అది తారాస్థాయికి చేరింది. బ్యాంకులకు సరిపడా నగదు నిల్వలను ప్రభుత్వం సమకూర్చకపోవడం వల్లే ఇదంతా. ఇబ్బందుల్లో ఉన్న బ్యాంకులను అమ్మేయడానికి దీన్ని ఓ అవకాశంగా కేంద్ర ప్రభుత్వం వినియోగించుకోవచ్చు' అని ఓ ప్రముఖ జాతీయ వార్తా చానెల్‌కు ఫోన్ ద్వారా ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో అభిప్రాయపడ్డారు. తాజా పరిస్థితులు ప్రభుత్వ బ్యాంకుల ప్రైవేటీకరణకు చక్కగా ఉపయోగపడుతాయన్నారు. 'ప్రతీసారి ఓ కొత్త బ్యాంక్ సమస్యల్లో పడుతున్నది. నిన్నటిదాకా బాగానే కనిపించిన బ్యాంకు.. ఒక్కసారిగా సంక్షోభంలో కూరుకుపోతున్నది. ఇప్పుడు పీఎంసీ బ్యాంక్. నాకు తెలిసి ఇది లోతైన, విస్తృతమైన సమస్య. చాలా బ్యాంకుల పరిస్థితి బాగాలేదు. వాటన్నిటికీ పెద్ద ఎత్తున ఆర్థిక సాయం అవసరం' అన్నారు. ఈ క్రమంలోనే పీకల్లోతు నష్టాల్లో ఉన్న బ్యాంకులను అమ్మేసి.. ఇతర బ్యాంకులను ఆదుకోవడం ఉత్తమమని ప్రభుత్వాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఇబ్బందుల్లో ఉన్నా.. ఆయా బ్యాంకులకు బలమైన సిబ్బంది, విస్తృతమైన శాఖలున్నాయని.. దీని వల్ల ఆ బ్యాంకులు అమ్ముడుపోతాయన్నారు.



బ్యాంకులకు ఈ దుస్థితి రావడం వెనుక రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అప్రమత్తంగా లేకపోవడం కూడా ఓ కారణమేనని అభిజిత్ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. బ్యాంకింగ్ రంగ నియంత్రణా వ్యవస్థగా ఉన్న ఆర్బీఐ ఉదాసీనంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. బ్యాంకులను హెచ్చరించడంలో ఆర్బీఐ విఫలమైందన్నారు. అందుకే ఈ ఆకస్మిక సంక్షోభాలు తెరపైకి వస్తున్నాయని చెప్పారు. కాగా, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ.. రూ.100 కోట్లకుపైగా బకాయిపడిన 220 మంది రుణ ఎగవేతదారులకు చెందిన రూ.76 వేల కోట్ల రుణాలను రద్దు చేసిందని సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా తెలుస్తున్న సమాచారం. దీనిపై అభిజిత్ స్పందిస్తూ ఇలాంటివి కేవలం అసలు సమస్య తీవ్రతను దాచే తాత్కాలిక చర్యలని, పైగా వీటివల్ల ప్రజల్లో బ్యాంకులపై అపనమ్మకం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. అన్ని వాణిజ్య బ్యాంకులు కలిసి మొత్తం రూ.2.75 లక్షల కోట్ల రుణాలను రద్దు చేయడం గమనార్హం.

## ఇద్దరు మావోయిస్టు సానుభూతిపరుల అరెస్ట్

**గద్వాల క్రైం:** ఇద్దరు సీపీఐ మావోయిస్టు సానుభూతిపరులను మంగళవారం అరెస్టుచేసినట్టు జోగుళాంబ గద్వాల జిల్లా ఇంచార్జి ఎస్పీ అపూర్వరావు చెప్పారు. వారినుంచి విప్లవ సాహిత్యం, ఇతర పత్రాలు, పెన్‌డ్రైవ్, మెమొరీ కార్డు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. బుధవారం గద్వాలలోని జిల్లా ప్రధాన పోలీస్ కార్యాలయంలో ఏఎస్పీ కృష్ణతో కలిసి కేసు వివరాలు మీడియాకు వెల్లడించారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం అంబేద్కర్‌నగర్‌కు చెందిన టీవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు మద్దిలేటి, తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నలమాస కృష్ణలను హైదరాబాద్‌లో అరెస్టుచేసి రిమాండ్‌కు పంపామన్నారు. మావోయిస్టు పార్టీకి విస్తృత ప్రచారంచేస్తున్న ఎనిమిది మందిపై గద్వాల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని చెప్పారు. ఎనిమిది మందిలో ఇప్పటికే పులిగ నాగరాజు, వైనమోని బలరాం, కాంతిజగన్‌లను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపామని తెలిపారు. తాజాగా మద్దిలేటి, కృష్ణలను అరెస్టుచేశామని, పరారీలో ఉన్న చుక్కల శిల్ప, గుంత రేణుక, మెంచు రమేశ్‌ను త్వరలో అరెస్టు చేస్తామని పేర్కొన్నారు.





















## సూపర్ స్పెషాలిటీ దవాఖాన నిర్మాణ పనుల పరిశీలన

**పోచమ్మమైదాన్ (వరంగల్ అర్బన్):** వరంగల్‌లో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ దవాఖాన భవన సముదాయాన్ని మెడికల్ అండ్ హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏ శాంతికుమారి బుధవారం పరిశీలించారు. హన్మకొండలో జరిగిన కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ సమావేశాలకు వచ్చిన ఆమె.. కేఎంసీ ఆవరణలో నిర్మిస్తున్న భవనాన్ని సందర్శించారు. ప్రధానమంత్రి స్వస్థ సురక్ష యోజన పథకం కింద రూ.150 కోట్లతో ఈ భవనం నిర్మిస్తున్నారు.






# జాలర్లకు ఉపాధి కల్పనే లక్ష్యం

- వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి, నమస్తే తెలంగాణ:** ప్రజల ఆరోగ్యంతోపాటు మత్స్యకారులకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే చెరువుల్లో చేపపిల్లలను విడుదలచేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. బుధవారం జిల్లా అధికారులు, మత్స్యకారుల సంఘం సభ్యులతో కలిసి వనపర్తిలోని మినీట్యాంక్‌బండ్‌లో 1.20 లక్షల చేప పిల్లలను మంత్రి విడుదల చేశారు. ముందుగా 20 ఏండ్లుగా బీడుబారిన నల్లచెరువు (మినీట్యాంక్‌బండ్) పూర్తిస్థాయిలో నిండటంతో కృష్ణాజలాలకు పూజలు చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 290 చెరువుల్లో 1.41 కోట్ల చేపపిల్లలను వదిలినట్టు మంత్రి తెలిపారు. అనంతరం మంత్రి నిరంజన్‌రెడ్డిని మత్స్యకారులు శాలువా, పూలమాలలతో సన్మానించారు.


బుధవారం వనపర్తి మినీట్యాంక్‌బండ్‌లో చేపపిల్లలను విడుదల చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

## మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట

మహారాష్ట్ర ఎన్నికలవేళ రెండురాష్ర్టాల అధికారుల భేటీ

**ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ**

పరస్పర సహకారంతో రెండు రాష్ర్టాల నడుమ మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని మహారాష్ట్ర, తెలంగాణ రాష్ర్టాల ఎక్సైజ్ అధికారులు నిర్ణయించారు. మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో ఇరురాష్ర్టాల అధికారులు ఆ రాష్ట్రంలో పాండ్రకవడలో బుధవారం సమావేశమయ్యారు. సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న మద్యం దుకాణాల వివరాలను తెలుసుకున్నారు. జిల్లా సరిహద్దు గుండా మద్యం అక్రమ రవాణా కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. మద్య నియంత్రణ, సమాచార వ్యవస్థ పటిష్టతకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన ఎక్సైజ్ అధికారుల ఫోన్‌నంబర్లు, ఈ మెయిల్ ఐడీలను సేకరించారు. ఈ వివరాలను మహారాష్ట్రలోని గడ్చిరోలి, నాందేడ్ జిల్లాల అధికారులకు అందజేయనున్నారు.


మహారాష్ట్రలో సమావేశమైన రెండు రాష్ర్టాల ఎక్సైజ్ అధికారులు


బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడలో నిర్వాసితులతో మాట్లాడుతున్న సిరిసిల్ల ఆర్డీవో శ్రీనివాసరావు

## మాన్వాడ నిర్వాసితులకు 20 రోజుల్లో పరిహారం

- సిరిసిల్ల ఆర్డీవో శ్రీనివాసరావు

**బోయినపల్లి:** రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడ నిర్వాసితులకు 20 రోజుల్లో పరిహారం చెల్లిస్తామని సిరిసిల్ల ఆర్డీవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం మాన్వాడ శ్రీరాజరాజేశ్వర జలాశయం కట్ట వద్ద కొద్ది పాటి మరమ్మతు పనులు జరుగుతుండగా నిర్వాసితులు అడ్డుకొనేందుకు యత్నించారు. ఆందోళనకారులను అడ్డుకొనేందుకు జలాశయం కట్ట పనులు జరుగుతున్న సమీపంలో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. తాసిల్దార్ ధార ప్రసాద్ అక్కడికి చేరుకొని పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని చెప్పినప్పటికీ రైతులు వినలేదు. దీంతో సిరిసిల్ల ఆర్డీవో శ్రీనివాసరావు అక్కడికి వచ్చి 20 రోజుల్లో పరిహారం నిర్వాసితుల ఖాతాలో జమచేస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. మాన్వాడ నిర్వాసితులకు ప్రత్యేక ప్యాకేజీ కింద కుటుంబానికి రూ.4.25 లక్షల చొప్పున పరిహారం ఇచ్చేందుకు ఒప్పుకొని గతంలోనే రెవెన్యూ అధికారులు అక్విటెన్స్‌లపై సంతకాలు తీసుకున్నారు.






## నల్లగొండలో హమాలీ కార్మికుల ఘర్షణ

రాళ్లు, కర్రలతో దాడులు.. పలువురికి గాయాలు

**నల్లగొండ సిటీ:** నల్లగొండ జిల్లాకేంద్రంలో హమాలీ యూనియన్ల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరి ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి. కార్మికులు రాళ్లు, కర్రలతో దాడులు చేసుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలో హమాలీలు రెండు యూనియన్లలో సభ్యులుగా ఉన్నారు. గతంలో అన్ని యూనియన్ల కార్మికులు కలిసి సరుకు దిగుమతి చేసేవారు. కానీ, కొంతకాలంగా పనుల విషయంలో రెండు యూనియన్ల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ విషయమై ఇటీవల ఇరువర్గాలు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నాయి. బుధవారం హైదరాబాద్‌రోడ్డులో సిమెంట్ లారీ నుంచి బస్తాలు దించే విషయంలో రెండు యూనియన్లకు చెందిన హమాలీలు ఘర్షణ పడ్డారు. రాళ్లు, కర్రలతో పరస్పరం దాడిచేసుకోవడంతో రెండు సంఘాలకు చెందిన పలువురికి గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదులను పోలీసులు స్వీకరించి దర్యాప్తు చేపట్టారు.


గాయపడి స్థానిక ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న హమాలీలు

## రూ.30 లక్షలు, కారుతో డ్రైవర్ పరార్

**పెబ్బేరు:** కారు యజమానిని బురిడీ కొట్టించి రూ.30 లక్షలతో డ్రైవర్ పరారైన ఘటన బుధవారం వనపర్తి జిల్లా పెబ్బేరులో చోటు చేసుకున్నది. కొత్తకోట సీఐ వెంకటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లాకు చెందిన రాంరెడ్డి, భార్య లక్ష్మీదేవమ్మ, కుమారుడు అశోక్‌కుమార్‌రెడ్డి, కుటుంబ సన్నిహితుడు విశాల్‌తో కలిసి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో పెబ్బేరు సమీపంలోని ఆనంద్‌భవన్ హోటల్ వద్ద భోజనం కోసం కారు ఆపారు. ఇదే అదునుగా భావించిన డ్రైవర్ కారు టైర్లో గాలి నింపించుకువస్తానని నమ్మబలికి రూ.30లక్షలు, కారుతో పరారయ్యాడు. ఈ క్రమంలో కారులో ఉన్న లక్ష్మీదేవమ్మను కడుకుంట్ల స్టేజీ వద్ద 44వ జాతీయ రహదారిపై వదిలి వెళ్లాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నట్టు సీఐ తెలిపారు.

## ప్రభుత్వ దవాఖానల్లో నాణ్యమైన వైద్యం

వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ రమేశ్‌రెడ్డి


జనగామ జిల్లా దవాఖానలో పాలియేటివ్ కేర్ సేవలపై రోగిని అడుగుతున్న కమిషనర్ డాక్టర్ రమేశ్‌రెడ్డి

**జనగామ టౌన్:** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ దవాఖానల్లో నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయని వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ రమేశ్‌రెడ్డి చెప్పారు. బుధవారం జనగామ జిల్లా దవాఖాన, మాతాశిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్)లో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దవాఖానల్లో అందుతున్న సేవలపై ఆరాతీసి వైద్యులను అభినందించారు. దవాఖానల్లో కావాల్సిన పరికరాలు, వైద్యులు, సిబ్బంది వివరాలు సేకరించామని, వాటిని దశలవారీగా అందిస్తామని తెలిపారు. మాతాశిశు ఆరోగ్యకేంద్రంలో గర్భిణులు, పిల్లలకు అందుతున్న సేవలు, రికార్డులను స్వయంగా పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట జిల్లా, ఎంసీహెచ్ దవాఖానల పర్యవేక్షకుడు డాక్టర్ పూజారి రఘు, ఆర్‌ఎంవో డాక్టర్ సుగుణాకర్‌రాజు, వైద్యులు తదితరులు ఉన్నారు.



నమస్తే తెలంగాణ
జిందగీ
గురువారం 17 అక్టోబర్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

## యవ్వనంగా కనిపించండిలా..



- రెండు పదుల వయసులోనూ కొందరి ముఖంపై ముడతలు కనిపిస్తుంటాయి. ఇందుకు కారణాలు అనేకం. కానీ రోజుకు కనీసం నాలుగైదు సార్లు ఫేస్‌వాష్ చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మంపై పేరుకుపోయే మురికి ఎప్పటికప్పుడు తొలగిపోతుంది.
- బాగా వదులుగా ఉండే బట్టలు ధరించడం మానుకోవాలి. హుందాగా కనిపించే శరీర రంగుకు సరిపోయే బట్టల్ని వేసుకోవాలి. పొడవుగా, వదులుగా ఉండే బట్టలు వేసుకోవడం వల్ల ఎక్కువ వయసు ఉన్నవారిలా కనిపిస్తారు.
- ఎక్కువ చక్కెర తినడం వల్ల చర్మంపై ముడతలు వస్తాయి. సోడా, మిఠాయి వంటి వాటిలో చక్కెర శాతం ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి వాటికి దూరంగా ఉండడం మంచిది. ముఖ్యంగా టీ, కాఫీలో చక్కెరకు బదులు బెల్లం పొడి వేసుకోవడం మంచిది.
- చర్మ సంరక్షణకు ఎలాంటి క్రీమ్స్ ఉపయోగించవద్దు. ముఖం నుంచి తేమ పోకుండా ఉండడానికి గోరువెచ్చని నీటితో ముఖం కడుక్కోవాలి. ఎండకు బయటికి వెళ్లినప్పుడు సన్‌స్క్రీన్ లోషన్ వాడాలి. వానలో తడిసిన అనంతరం ముఖం కడుక్కోవాలి. లేదంటే ముఖంపై దురద, మచ్చలు వచ్చే అవకాశం ఉంది.
- నిద్ర, వ్యాయామం, ఆహారం ఈ మూడు అంశాలు చర్మ ఆరోగ్యాన్ని సంరక్షించడంలో తోడ్పడుతాయి. సరైన సమయానికి నిద్ర లేవకపోవడం లేదా సమయానికి నిద్రపోకపోవడం వల్ల కూడా చర్మం వదులుగా మారుతుంది. జంక్ ఫుడ్ కారణంగా ముఖంపై జిడ్డు పేరుకుపోతుంది. మచ్చలు ఏర్పడే అవకాశం ఉంది. ప్రతిరోజు వ్యాయామం చేయడం వల్ల ఫిట్‌నెస్ ఉంటుంది.

# సీతాఫలం.. ఆరోగ్యబలం



**సీతాఫలం.. ఈ పేరు వినగానే అందరికీ నోరూరుతుంది. ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే పండ్లలో సీతాఫలం ఒకటి. వాటి సీజన్ రానే వచ్చింది. ఎప్పుడెప్పుడు తిందామా అని మనసు ఆశ పడుతుంటుంది కదా. రుచితో పాటు ఎన్నో పోషక విలువలున్న సీతాఫలంతో మనసు దోచే రెసిపీలు తయారు చేసుకోవచ్చు. ఆ విభిన్న రుచుల సమాహారం మీ కోసం.**

## సీతాఫల్ డిలైట్



**కావాల్సినవి :**

**మిల్క్ బిస్కెట్ :** 1, **కాస్టర్డ్ పౌడర్ :** 250 గ్రా., **పుడ్డింగ్ కేక్ :** 250 గ్రా., **షుగర్ సిరప్ :** 200 గ్రా., **అమూల్ క్రీమ్ :** 50 గ్రా., **సీతాఫలం :** 3, **బాదం, పిస్తా :** 50 గ్రా., **చెర్రి :** 2, **పాలు :** అర లీ., **బట్టర్ :** 50 గ్రా.,

**తయారీ :**

ముందుగా మిక్సీజార్ తీసుకొని మిల్క్ బిస్కెట్‌ను పొడి చేసుకోవాలి. తర్వాత కడాయిలో బటర్ వేసి వేడిచేయాలి. అందులో బిస్కెట్ పౌడర్ వేసి వేయించాలి. ఒక పొడవాటి గిన్నెలో పౌడర్ వేసి నాలుగు వైపులా సమానంగా చేసి పక్కన పెట్టుకోవాలి. పుడ్డింగ్ కేక్‌ను రెండు భాగాలుగా, పలుచగా కట్ చేసుకోవాలి. షుగర్ సిరప్‌ను కేక్‌కు రాయాలి. సీతాఫలాన్ని మిక్సీ పట్టించాలి. దీనికి అమూల్ క్రీమ్ జోడించాలి. దీన్ని పుడ్డింగ్ కేక్ మీద సమానంగా వేయాలి. రెండో కేక్ ముక్కను షుగర్ సిరప్‌తో నానబెట్టాలి. తర్వాత గిన్నెలో పాలు వేడి చేసి కస్టర్డ్ పౌడర్ వేసి ఉడికించాలి. దీన్ని కేక్ ముక్కపై పోసి 30 నిమిషాలపాటు ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. ఆ తర్వాత గుండ్రటి ముక్కలుగా కట్ చేసుకొని దానిపైన సీతాఫలం గింజలు, బాదం, పిస్తా, చెర్రీతో గార్నిష్ చేసుకుంటే సీతాఫల్ డిలైట్ రెడీ!

## సీతాఫలం సేమియా



**కావాల్సినవి :**

**పాలు :** అర లీ., **సేమియా :** 200 గ్రా.
**సీతాఫలం :** 2, **జీడిపప్పు, బాదం :** 100 గ్రా.
**నెయ్యి :** 2 టేబుల్‌స్పూన్లు
**చక్కెర :** 200 గ్రా.

**తయారీ :**

కడాయిలో స్పూన్ నెయ్యి వేసి సేమియాను వేయించుకోవాలి. జీడిపప్పు, బాదం పప్పులను కూడా నెయ్యిలో దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి. తర్వాత గిన్నెలో పాలు పోసి మరిగించుకోవాలి. సీతాఫలం గింజలను వేరుచేసి మిక్సీ పట్టించి మెత్తని గుజ్జులా చేయాలి. ఈ మిశ్రమాన్ని మరుగుతున్న పాలలో వేయాలి. దీంతో పాటు సేమియా కూడా వేసి ఉడికించాలి. తర్వాత చక్కెర వేసి మరగనివ్వాలి. ఇందులో స్పూన్ నెయ్యి వేసి కాజు, బాదంతో గార్నిష్ చేసుకోవాలి. ఇక అంతే సీతాఫలం సేమియా రెడీ!

## సీతాఫలం పాల రసం



**కావాల్సినవి :**

**పాలు :** పావు లీ.,
**తేనె :** 2 టీస్పూన్లు,
**సీతాఫలం :** 2

**తయారీ :**

ముందుగా సీతాఫలం పండ్లను తీసుకొని గింజలు లేకుండా మిక్సీజార్‌లో వేసుకోవాలి. రెండు, మూడు రౌండ్లు తిప్పాలి. తర్వాత అదే జారులో పాలను సీతాఫలం గుజ్జులో పోసి రెండు రౌండ్లు తిప్పాలి. ఈ మిశ్రమాన్ని గ్లాసులోకి తీసుకోవాలి. సీతాఫలం పాల రసంలో తేనె సర్వ్ చేసుకొని తాగితే టేస్టీగా ఉంటుంది.

## సీతాఫలం లస్సీ



**కావాల్సినవి :**

**పెరుగు :** 100 గ్రా.,
**సీతాఫలం :** 2, **తేనె :** 2 టేబుల్‌స్పూన్లు

**తయారీ :**

సీతాఫలం తీసుకొని గింజలను వేరు చేయాలి. సీతాఫలం గుజ్జులో పెరుగు వేసి మళ్లీ మిక్సీ పట్టించాలి. దీంట్లోకి చక్కెరకు బదులుగా తేనె వేసుకోవాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని గ్లాస్‌లోకి సర్వ్ చేసుకోవాలి. ఈ సీతాఫలం లస్సీ తాగితే ఆహా అనాల్సిందే!

## సీతాఫల్ రబ్డీ

**కావాల్సినవి :**

**చిక్కటిపాలు :** 1 లీ.
**సీతాఫలం :** 4
**తేనె :** 2
**చాక్లెట్ సాస్ :** 1 టీస్పూన్

**తయారీ :**

ముందుగా ఒక గిన్నెలో చిక్కటిపాలను బాగా మరిగించాలి. సీతాఫలంలోని గింజలు తీసి గుజ్జును వేరు చేసి పెట్టుకోవాలి. 20 నిమిషాలపాటు మరిగిన పాలలో సీతాఫలం గుజ్జు వేసి బాగా ఉడికించాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని గ్లాసులో పోసుకొని తేనె కలుపాలి. దీన్ని చాక్లెట్ సాస్‌తో గార్నిష్ చేసుకుంటే.. సీతాఫలం రబ్డీ తయారైనట్లే!





**సతీష్**
ఎగ్జిక్యూటివ్ చెఫ్
కృష్ణపట్నం
జూబ్లీహిల్స్, రోడ్ నం. 36
హైదరాబాద్

## ఎలా బతకాలో నేర్పారు!



**అంగవైకల్యం లేనివారికి విద్యార్హతను బట్టి ఏ సంస్థ అయినా ఉపాధి, ఉద్యోగం కల్పిస్తుంది. మరి దివ్యాంగులు, మానసిక వికలాంగుల పరిస్థితి ఏంటి? వారిని ఎవరు పట్టించుకుంటారు? ఇదే సందేహం బెంగళూరుకు చెందిన మాలా, గిరిధర్ దంపతులకు కలిగింది. దివ్యాంగుల కోసం వారు ఏం చేశారో తెలుసా?**

దివ్యాంగులు అనగానే 'అయ్యో పాపం..' అంటూ చాలామంది వారిపట్ల జాలి, దయ చూపిస్తుంటారు. ఇలా వారిని చూసి ఓదార్పుతో నాలుగు మాటలు చెబితే పెద్దగా ప్రయోజనం ఉండదని అంటున్నారు బెంగళూరుకు చెందిన ఈ దంపతులు. వృత్తిపరంగా వీరిద్దరూ మానసిక వైద్యులు కావడంతో.. వారికి ఏదైనా సాయం అందించాలనుకున్నారు. భవిష్యత్‌లో ఎవరి సాయం కోసం ఎదురు చూడకుండా వారికి ఉపాధి కల్పించడానికి సిద్ధమయ్యారు. అందుకోసం తమ ఇంట్లోనే ఓ పునరావాస కేంద్రాన్ని ప్రారంభించారు. పర్యావరణానికి హాని కలిగించని ఉత్పత్తులు వారితో తయారు చేయించి, మానసిక చైతన్యం తీసుకురావాలని తలంచారు. అరటి నారతో అందమైన కళాకృతులు తయారు చేయించడం మొదలు పెట్టారు. అందుకోసం ఓ స్వచ్ఛంధ సంస్థతో కలిసి దివ్యాంగులకు, మానసిక వికలాంగులకు అవసరమైన శిక్షణ ఇచ్చారు. వారు రూపొందించిన అరటి నార ఉత్పత్తులు ఎలా విక్రయించాలో కూడా శిక్షణ ఇచ్చారు. దీంతో ఇతరులపై ఆధారపడకుండానే వారంతా ఇప్పుడు సంపాదించగలుగుతున్నారు. శిక్షణ సమయంలో వారికి ఉపకారవేతనాలు, భోజన సదుపాయం కూడా కల్పిస్తున్నారు. వీరి ఆలోచనకు 'మస్మర' అనే స్వచ్ఛంద సంస్థ తోడైంది. మరింతమంది దివ్యాంగులు, మానసిక వైకల్యం ఉన్నవారిని గుర్తించి, శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పిస్తున్నది. మొదట్లో 30 మంది ఉన్న ఈ పునరావాస కేంద్రంలో ఇప్పుడు వేలాది మందికి జీవనభృతి లభిస్తున్నది. 'దేశవ్యాప్తంగా ఇటువంటి కేంద్రాలను ప్రారంభించి మరింతమందికి జీవనోపాధి కల్పిస్తామంటున్నారు' మాలా గిరిధర్ దంపతులు.

## వంటల్లోనూ వాడొచ్చు!



**ఒకప్పుడు వంటకు గానుగతో తీసిన నూనెను వాడేవారు. ప్రస్తుతం రిఫైన్డ్ చేసిన నూనె వాడుతున్నారు. వాటిలో పోషకాలు శూన్యం. ప్రస్తుతం నువ్వుల నూనె కేవలం దీపారాధనకు మాత్రమే అనే అపోహ ఉన్నది. కానీ నువ్వుల నూనెను వంటల్లో ఉపయోగించడం వల్ల అనేక లాభాలున్నాయి.**

- నువ్వుల నూనెలో భాస్వరం ఉంటుంది. ఇది ఎముకలను బలోపేతం చేయడంలో ముఖ్యపాత్ర వహిస్తుంది. నువ్వుల నూనెలో రోగనిరోధక శక్తిని పెంచే గుణాలు ఎక్కువ. వంద గ్రాముల తెల్ల నువ్వుల్లో వెయ్యి మిల్లీ గ్రాముల క్యాల్షియం ఉంటుంది.
- నువ్వుల నూనెలో ఉన్న లెసిథిన్ అనే రసాయనం రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ ప్రవాహాన్ని మెరుగుపర్చడానికి సహాయపడుతుంది. ఇందులో సిసామోల్ యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. ఇది శరీరానికి ఎంతో మేలు చేస్తుంది.
- నువ్వుల నూనెలో విటమిన్ సి ఉంటుంది. విటమిన్ బి ఉంటుంది. నువ్వులను ఆహారంలో భాగం చేసుకుంటే చర్మం, జుట్టును ఆరోగ్యంగా ఉంచుతుంది. ప్రతి రోజు 25 గ్రాముల నువ్వులు తీసుకుంటే మలబద్ధకం సమస్య పరిష్కారమవుతుంది.
- నువ్వుల నూనెలో సెసామిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి వాడడం వల్ల క్యాన్సర్ కణాలు వృద్ధి చెందవు. నువ్వుల్లో నియాసిన్ విటమిన్ ఒత్తిడి, నిరాశను తగ్గిస్తుంది. నువ్వుల నూనెతో పిల్లలకు మర్దన చేయడం వల్ల ప్రశాంతంగా నిద్రపోతారు.
- నువ్వుల నూనెలో క్యాల్షియం, ఐరన్, మెగ్నీషియం, జింక్, సెలీనియం ఖనిజాలు ఉన్నాయి. గుండె కండరాలు సజావుగా పనిచేయడానికి సహాయపడుతాయి. నువ్వుల నూనెను వంటల్లో వాడడం వల్ల గుండె సంబంధిత సమస్యలు కూడా ఎదురుకావు.

## అరుదైన ఘనత



**ప్లాస్టిక్‌ను తినే బ్యాక్టీరియాను ఇటీవలే మన శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఆ బృందానికి నాయకత్వం వహించింది ఈ మహిళే. ప్రపంచదేశాలు పర్యావరణాన్ని రక్షించేపనిలో పడడం, ఇప్పుడిప్పుడే జనాల్లో ప్లాస్టిక్, పర్యావరణంపై అవగాహన పెరుగుతుండడంతో ఈ కొత్త బ్యాక్టీరియా గురించి జనాల్లో ఆసక్తి పెరిగింది.**

**ఒకసారి** వాడిపారేసే ప్లాస్టిక్ వ్యర్థాలను 2022 నాటికి పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి మోదీ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఉత్తరప్రదేశ్ గ్రేటర్ నోయిడాలోని శివ్‌నాడర్ విశ్వవిద్యాలయంలో పరిశోధకురాలైన రిచా ప్రియదర్శిని నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణకు పరిష్కార మార్గాన్ని చూపించింది. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వ్యర్థాలతో జరిగే నష్టాన్ని నివారించేందుకు ఆమె బృందం ముందుకువచ్చింది. రెండేండ్ల పాటు శ్రమించి ఇటీవల నూతన పరిష్కారాన్ని అందించింది. రిచా నాయకత్వం వహించిన శాస్త్రవేత్తల బృందం ప్లాస్టిక్ వ్యర్థాలతో భూమిలో ఎటువంటి మార్పులు వస్తున్నాయో పరిశీలించేందుకు సిద్ధమయ్యింది. అందుకోసం ఉత్తరప్రదేశ్‌లోని అనేక ప్రాంతాల్లోని మట్టిని సేకరించారు. చిత్తడి నేలల్లో ఉండే బ్యాక్టీరియాపై పరిశోధన చేసినప్పుడు కొత్త అంశాన్ని గమనించారు. వారి అన్వేషణలో చిత్తడినేలల్లో ఉండే బ్యాక్టీరియా ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్నట్టు తేలింది. ఒకసారి వాడిపారేసే ప్లాస్టిక్‌లోని కీలక పదార్థమయిన పాలిస్టిరీయన్‌ను క్షీణింపచేసి, సురక్షితంగా నీటిలో కలిపేసే సామర్థ్యం వీటికి ఉన్నట్లు రిచా బృందం కనుకొన్నది. ఎక్సిగువా బ్యాక్టీరియం అండేడీఆర్14, ఎక్సిగువోబ్యాక్టీరియం డీఆర్11 అనే రెండురకాల బ్యాక్టీరియా ఉంటుందని వారు తేల్చారు. పాలిస్టిరీన్ పొడవైన పాలీమర్ శృంఖలం. ఇది తొందరగా క్షీణించకపోగా.. పర్యావరణానికి హాని కలిగిస్తుంది. ప్రతి ఏటా భారత్‌లో కొన్ని లక్షల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. అటువంటి వాటికి సరైన పరిష్కారం అందించిన రిచా ప్రియదర్శిని బృందాన్ని అందరూ ప్రశంసిస్తున్నారు.

## అన్నం తిన్నాక, తినడానికి ముందు..

**ఆహారం తీసుకున్న తర్వాత కొన్ని పనులు చేయకూడని పెద్దలు అంటుంటారు. కొందరు తిన్న తర్వాత నడవాలని అంటే ఇంకొందరు వద్దంటారు. అన్నం తిన్న తర్వాత, తినకముందు ఏమేం చేయాలంటే..**

- అన్నం తిన్న రెండు గంటల తర్వాతే పండ్లు తినాలి. ఆహారం తీసుకునే గంట ముందు పండ్లను తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది. ఇలా చేయడం వల్ల పండ్లలోని పోషకాలు శరీరానికి అందుతాయి. ఆహారం తీసుకున్న వెంటనే నిద్రిస్తే తీసుకున్న ఆహారం సరిగ్గా జీర్ణం కాదు. గ్యాస్ట్రిక్ సమస్యలు ఏర్పడతాయి. భోజనానికి, నిద్రకు మధ్య కనీసం గంట సమయం ఉండాలి.
- ఆహారం తీసుకునే అరగంట ముందు టీ తాగకూడదు. ఆహారం తీసుకున్న గంట వరకు టీ తాగకూడదు. తేయాకులోని యాసిడ్స్ జీర్ణ సమస్యలను కలుగజేస్తాయి. ముఖ్యంగా టీ, కాఫీ తాగే ప్రతిసారీ అరగ్లాసుడు నీళ్లను తాగాలి. ఇలా చేయడం వల్ల కెఫిన్ ప్రభావం ఎక్కువగా పడకుండా ఉంటుంది.
- ఆహారం తీసుకున్న తర్వాత ఒక సిగరేట్ తాగితే 10 సిగరెట్లు తాగినంత ప్రమాదం. అన్నం తిన్న తర్వాత ధూమపానం చేసేవారికి మామూలు వారితో పోలిస్తే క్యాన్సర్ కణాలు ఎక్కువ విడుదలయ్యే అవకాశం ఉంటుంది.
- ఆహారం తీసుకున్న తర్వాత బెల్ట్‌ను లూజ్ చేయవద్దు. ఇలా చేయడం వల్ల



ఆహారం పేగుల్లోకి సత్వరంగా చేరుకొని జీర్ణసమస్యలను ఏర్పడేలా చేస్తుంది. తిన్న వెంటనే నడువకూడదు. అలా చేయడం వల్ల ఆహారంలోని ధాతువులు, విటమిన్స్ ఆరోగ్యానికి సక్రమంగా లభించవు.

II.
నమస్తే తెలంగాణ
రైతుబడి
[ కరీంనగర్ ]
గురువారం 17 అక్టోబర్ 2019

పాలీహౌజ్‌లలో ఏడాది పొడవునా సాగు చేసుకోవచ్చు. పాలీహౌజ్‌లలో పూలమొక్కలు, కార్నేషన్, జెర్బరా, గులాబీ, గ్లాడియోలస్‌లతో పాటు కాయగూరలైన టమాటా, వంకాయ, బెంగళూరు మిర్చి, కీరదోసలను సాగు చేస్తారు. రాష్ట్రంలో కూరగాయలు, పూల మొక్కల సాగు ప్రోత్సహించడానికి పాలీహౌజ్‌లను సబ్సిడీ కింద రైతులకు అందిస్తున్నారు. అయితే పాలీహౌజ్‌లలో ఈ మధ్యకాలంలో నులిపురుగులు ఎక్కువగా ఆశించి పంటలను నష్టపరుస్తున్నాయి.



raithubadi@ntnews.com

# పాలీహౌజ్ సాగులో నులిపురుగుల నివారణ

ఈ ఏడాది వానలు ఎక్కువగా పడ్డాయి. దీని వల్ల గాలిలో తేమ ఎక్కువగా ఉన్నది. దీనికి తోడు భూమిలో నీళ్లు ఎక్కువగా ఉన్నాయి. దీని వల్ల వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందుతున్నాయి. సాధారణంగా పంటలపై ఎక్కువగా చీడపీడలు ఆశించి నష్టపరుస్తాయి. కానీ ఈ మధ్యకాలంలో కంటికి కనిపించని నులిపురుగులు ఎక్కువగా అభివృద్ధి చెంది పంటలపై రోగాలను కలుగజేస్తున్నాయి. పంటలపై వీటి గాయాల గుర్తులు అస్పష్టంగా ఉంటాయి. దీనివల్ల రైతులు అయోమయంలో పడి ఎక్కువగా పురుగు మందులను పిచికారీ చేస్తారు. దీంతో భూమిలో ఉన్న నులి పురుగుల సంఖ్య వృద్ధి చెంది ఎక్కువ నష్టాన్ని కలుగజేస్తాయి. అందువల్ల నులిపురుగుల లక్షణాలు, అవి చేసే గాయాలు వాటిని నివారణ పద్ధతుల గురించి తెలుసుకుందాం.

### నులిపురుగుల లక్షణాలు

- ఇవి కంటికి కనిపించని చిన్న సైజులో ఉంటాయి. వీటికి రంగు లేకుండా సన్నని దారం వలె ఉంటాయి.
- ఇవి ఏర్పరిచిన గాయాలు అస్పష్టంగా ఉంటాయి. ఇవి ఎక్కువగా వేర్లపై బుడిపెలను కలుగజేస్తాయి.
- ఇవి తేమ ఉన్న ప్రాంతంలో ఎక్కువగా వృద్ధి చెందుతాయి. భూమిలో ఎక్కువగా అభివృద్ధి చెందుతాయి. వాటిలో సూదుల వంటి ముఖభాగాలను కలిగి ఉంటుంది. దీనివల్ల రసాన్ని పీల్చుతుంది.

### గాయ లక్షణాలు

- సాధారణంగా ఈ గాయ లక్షణాలు స్పష్టంగా లేకుండా నులి పురుగుల నిర్ధారణలో చాలా కష్టమౌతుంది. అప్పుడప్పుడు ఈ లక్షణాలు పోషకలోప లక్షణాలను పోలి ఉంటాయి.
- పత్రహరితం కోల్పోవడం. ఎదుగుదల సరిగా లేకపోవడం. మొక్కలు వడలిపోవడం.



- వేరు బుడిపెలు, వేరువ్యవస్థ సరిగా లేకపోవడం. ఆకులపై మచ్చలు ఏర్పడటం.

నులి పురుగుల వల్ల పంటల్లో చాలా నష్టం కలుగుతుంది. దేశంలో వీటివల్ల ఏటా కోట్ల నష్టం కలుగుతుంది. ఎందుకంటే ఎక్కువ తేమ, ఎక్కువ ఎరువుల వాడకం, ఏడాది పొడవునా పంటలు సాగుచేయడం, ఎక్కువ పంట సాంద్రత ఉండటం వల్ల అధిక నులి పురుగుల వృద్ధికి దోహదం చేస్తాయి. ఉదాహరణకు వేరు కణుపు నులిపురుగులు, చీనీ, నిమ్మ కణుపు నులి పురుగులు, వరి వేరు నులి పురుగులు, గులాబీ పంటలో నులి పురుగులు, ఆలుగడ్డ నులిపురుగులు.



### పాలీహౌజ్‌లలో బెడ్ తయారీ

- మొదట పాలీహౌజ్‌లలో బెడ్ చేసుకోవడానికి ముందు టన్నుల పశువుల పేడను ట్రైకోడెర్మా విరిడిని కలిపి భూమిలో కలుపాలి.
- బెడ్లను ఎక్కువగా ఎత్తులో చేసుకోవాలి. ఎందుకంటే ఎక్కువగా వానలు పడినా, వర్షపు నీరు నిలువకుండా ఉంటుంది.
- సిఫార్సు చేసిన ఎరువులను వేయాలి. తర్వాత కార్బోఫ్యూరాన్ గుళికలు 50 గ్రాములు/ చదరపు మీటరుకు, 200 గ్రాముల వేప చుక్కతో కలిపివేయాలి.
- వర్మీ కంపోస్టు 500 గ్రాములు/ చదరపు మీటరుకు భూమిలో పైపొరగా వేయాలి.
- పైన చెప్పిన ఎరువులు వేసిన తర్వాత ఒకవేళ వానలు రాకపోతే వారంరోజుల్లో నీళ్లు పెట్టాలి. లేకపోతే ఎరువులు సరిగ్గా వినియోగించబడవు.

### పశువుల పేడ, వేపచుక్క మిశ్రమాన్ని చేయడం

- టన్ను పశువుల పేడ లేదా వేపచుక్కను రెండు కిలోల సూడోమోనాస్ లేదా ట్రైకోడెర్మా కలిపి మల్చ్ లాగా వరుసతో పంట మొక్కల మధ్య వేయాలి. దానిపై 15 రోజుల వరకు నీళ్లను అప్పుడప్పుడు చల్లుతూ ఉండాలి.

### నులిపురుగుల నిరోధక కలిగిన కాయగూర పంటల రకాలు

- టమాటా–PNR 7, NT–3, NT–12, హిస్సార్ లలిత్
- మిరప–NP 46A, పూసాజ్వాలా, మోహిని,
- ఆలుగడ్డ–కుఫ్రీ స్వర్ణ
- పిల్లి పెసర– GAU–1



### నివారణ పద్ధతులు

- పంటలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పంట నాటే ముందు విత్తనాలను 55–54 డిగ్రీల సెల్సియస్ కలిగిన నీటిలో 15 నుంచి 20 నిమిషాల వరకు ముంచాలి. తర్వాత వేరు కషాయ ద్రావణంతో (10 శాతం) విత్తనశుద్ధి చేయాలి.
- సాధారణంగా మార్కెట్‌లో నులిపురుగుల నివారణకు రసాయన ముందులు లేవు. కానీ కొన్ని పురుగు మందులైన కార్బోఫ్యూరాన్, ఫోరెట్ కళికలు నులి పురుగులను నివారించగలవు. కార్బోఫ్యూరాన్ గుళికలు 1–3 కిలోలు హెక్టారుకు నారుమడిలో వేసుకోవాలి.
- తర్వాత కార్బోసల్ఫాన్ (3 శాతం)తో విత్తన శుద్ధి చేసుకోవాలి. లేదా టమాటా వంటి నారు మొక్కలను పై ద్రావణంలో ముంచి నాటుకోవాలి. లేదా నిమిట్జ్ 1.5 గ్రా/ మొక్కకు 6–8 సెం.మీ దూరంలో వేయాలి.
- మే, జూన్ నెలల్లో వేసవి దుక్కులు చేయడం. దీనివల్ల వేరు కణుపు పురుగులను సమర్థవంతంగా నివారించవచ్చు.
- బంతి, వెల్లుల్లి, ఆవాల పంటలను పంట చుట్టూ వేయాలి. ఇవి నులి పురుగులను చంపే రసాయనాలను విడుదల చేస్తాయి.
- ఆముదం, పిల్లిపెసర మొక్కలను కూడా పెంచితే ఇవి నులిపురుగులను ఆకర్షిస్తాయి. ఎక్కడైతే నులి పురుగుల లక్షణాలు కనపడిన వెంటనే వీటిని పీకి నాశనం చేయాలి.
- నులి పురుగుల నిరోధక పంటలు, రకాలను ఎన్నుకోవాలి. పంటల మధ్య మల్చింగ్ చేయడం వల్ల కొంతవరకు నులిపురుగుల వృద్ధిని అరికట్టవచ్చు.
- ఎక్కువమొత్తంలో పశువుల పేడ, వేపచుక్క, వరిపొట్టు, కంపోస్టు ఎరువులను పంట మొదట్లో వేసుకోవాలి. దీనివల్ల పంటలు ఆరోగ్యవంతంగా పెరుగుతాయి. నులిపురుగుల బారి నుంచి తట్టుకుంటాయి.

ఈ విధంగా పైన చెప్పినట్టు సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించి నులిపురుగులను సమర్థవంతంగా నివారించవచ్చు.

చీకూరి రాజాగౌడ్
7396400740
శాస్త్రవేత్త,
(ఎంటమాలజీ విభాగం)
రాష్ట్రఉద్యాన
విశ్వవిద్యాలయం



# చేపపిల్లల ఎంపిక, రవాణాలో జాగ్రత్తలు



చేపల పెంపకం చేపట్టే రైతులు సరైన చేపపిల్లలను ఎంపిక చేసుకోవాలి. వాటిని చెరువులలో సక్రమ విధానాలలో వదులాలి. అప్పుడే మంచి దిగుబడులు సాధించి ఆర్థికంగా నిలదొక్కుకుంటారని నిపుణులు సూచిస్తున్నారు. అయితే చేపపిల్లల ఎంపికలో అవలంబించాల్సిన పద్ధతుల గురించి కేవీకే మత్స్య శాస్త్రవేత్త బూర్గు లవకుమార్ తెలిపారు. అదనపు సమాచారం కోసం 9849063796 నెంబర్‌ను సంప్రదించవచ్చు.

- భారతీయ మేజర్ కార్ప్, విదేశీ కార్ప్ చేపపిల్లలు పెంపకానికి అనువైనవి.
- చెరువులలో లభించే సహజ ఆహారాన్ని కాకుండా అనుబంధ ఆహారాన్ని ఇష్ట పూర్తిగా తీసుకునేవిగా ఉండాలి.
- భిన్నమైన ఆహారపు అలవాట్లతో, ప్రవర్తనతో ఉండే జాతులను ఎంపిక చేసుకోవాలి.
- తాత్కాలిక ప్రతికూల పరిస్థితులను తట్టుకునేవిగా ఉండాలి.



- మంచి రుచికర, పోషక విలువలు గల మాంసం కలిగినవై ఉండాలి.
- సహజసిద్ధంగానే కాకుండా కృత్రిమ విధానంలోనూ పిల్లలను ఉత్పత్తి చేయగల చేపల రకాల చేపపిల్లలను ఎంపిక చేసుకోవాలి.

### నాణ్యత గల చేపపిల్లల ఎంపిక

- చేపపిల్లలు చురుకుగా ఈదుతుండాలి.
- చేపపిల్లలు ఆరోగ్యవంతంగా ఉండి మెరుస్తూ ఉండాలి.
- చేపపిల్లల శరీరంపై ఎలాంటి మచ్చలు, కురుపులు, గాయాలు లేకుండా ఉండాలి.
- చేపపిల్లల శరీరంపై ఎలాంటి పరాన్నజీవులు లేకుండా చూసుకోవాలి.
- చేపపిల్లలు ఈక, తోకలు చీలికలు లేకుండా సంపూర్ణ, సరైన స్థితిలో ఉండాలి.
- చేప పిల్ల తలభాగం మిగతా శరీర భాగానికి సమతూకంగా ఉండాలి.

### చేపపిల్లల రవాణాలో జాగ్రత్తలు

- చేపపిల్లల రవాణా చేయడానికి ముందు 24 గంటల పాటు ఎటువంటి ఆహారాన్ని ఇవ్వకూడదు.
- రవాణా చేయదలచిన చేపపిల్లలకు చేతిరాపిడి తగులకుండా సున్నితపు వలలో పట్టి ఉంచుకోవాలి.
- రవాణా చేయు వాహనంలో ఆక్సిజన్ సిలిండర్లను అమర్చి ఆక్సిజన్‌ను అందిస్తూ రవాణా చేసుకోవాలి.
- చేపపిల్లలను తక్కువ ఉష్ణోగ్రత గత నీటిలో రవాణా చేయాలి.
- చేపపిల్లలను రవాణా చేసే వ్యాన్, లారీలను ఎండలో నిలుపరాదు.
- పాలిథీన్ బ్యాగ్‌లో సరైన మోతాదులో ఆక్సిజన్ ఉన్నదా, లేదా చేపపిల్లలు చురుకుగా ఉన్నాయా లేవా అనేది గమనించాలి.
- పంపిణీ చేయబడిన చేపపిల్లలను ఎక్కడ ఆగకుండా నిర్దేశింపబడిన నీటి వనరు వద్దకు తీసుకపోవాలి.
- నిర్దేశించిన నీటి వనరులలో మాత్రమే చేపపిల్లలను వేసుకోవాలి.
- నీటి వనరులలో వేసుకునే ముందు పాలిథీన్ బ్యాగులను నీటిలోకి వదిలి అట్టి నీరు ఉష్ణోగ్రతను అలవాటు చేసి తదుపరి బ్యాగు తెరిచి లోనికి నీటి వనరులోని నీటిని కొద్దికొద్దిగా కలిపి అప్పుడు వదులాలి.

నట్టె కోటేశ్వర్‌రావు, 9989944945
గరిడేపల్లి, సూర్యాపేట జిల్లా

# హెర్బల్ మందులతో మిరపలో వైరస్‌కు చెక్



రాష్ట్రంలో వానకాలం, యాసంగి కాలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతున్న కాయగూర, సుగంధ ద్రవ్య పంట మిరప. కూర మిరపగా, ఎండు మిరప కోసం సాగు చేస్తున్నారు. అయితే మిగతా పంటలతో పోలిస్తే ఎక్కువ మొత్తంలో ఈ పంటను పురుగులు, తెగుళ్లు ఆశించి నష్టపరుస్తున్నాయి. రైతులు వీటి నివారణకు రసాయన మందులు వాడుతున్నారు. దీనివల్ల రసాయన పురుగు మందుల అవశేషాలు ఉండి, వినియోగదారుల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉన్నది. పచ్చి మిరపలో, ఎండు మిరపలో ఈ సమస్య ఎక్కువగా ఉన్నది. అయితే ఇటీవల వచ్చిన సేంద్రియ సాగు విధానాలు రసాయన పురుగు మందుల అవశేషాలు లేని మిరప ఉత్పత్తులకు బాటలు వేస్తున్నాయి. ముఖ్యంగా మిరప పంటను తొలిదశలో అంటే నర్సరీ దశ నుంచి ఆశించి నష్టపరిచే వైరస్ తెగుళ్ల నివారణకు విపరీతంగా వాడుతున్న రసాయన పురుగు మందుల స్థానం లో వృక్షాల నుంచి సేకరించిన హెర్బల్ పురుగు మందులు మంచిగా పనిచేస్తున్నాయి. అటు పర్యావరణానికి హాని కలిగించకుండా, రసాయన అవశేషాలు లేని ఉత్పత్తులను అందించడంలో అద్భుతంగా పనిచేస్తున్నాయి.

### ఆకు ముడత

మిరపలో ప్రధానంగా మూడు వైరస్ తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉన్నది. ఈ ఆకు ముడత జెమిని వైరస్ ఆశించడం వల్ల వస్తుంది. ఈ వైరస్ ఆశించిన మొక్కల ఆకులు చిన్నవిగా మారుతాయి. పైకి ముడుచుకుని పడవ ఆకారంలో ఉంటాయి. ఆకు ఈనెలు ఆకు పచ్చగాను, ఈనెల మధ్య లేత ఆకుపచ్చగా లేదా పసుపు పచ్చ రంగు కలిగి ఉంటాయి. కణుపుల మధ్య దూరం తగ్గుతుంది. ఈ తెగులు తెల్లదోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది.

### మొవ్వకుళ్లు తెగులు

దీనినే పీ నట్ బడ్ నెక్రోసిస్ వైరస్ అంటారు. ఈ వైరస్ ఆశించిన మొక్కల చివర్లు ఎండిపోతాయి. కాండంపై నల్లని నిర్దిష్ట ఆకారంలేని మచ్చలు ఏర్పడి క్రమేణా చారలుగా మారుతాయి. ఆకులపై వలయాలుగా నెక్రోటిక్ మచ్చలు ఏర్పడి పండుబారి రాలిపోతాయి. ఈ తెగులు తామర పురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుంది.

### కుకుంబర్ మొజాయిక్ వైరస్

ఈ వైరస్ ఆశించిన మిరప మొక్కలు గిడసబారి ఎదుగుదల లోపిస్తుంది. ఆకులు పత్రహరితం కోల్పోతాయి. ఆకారం మారిపోయి కొనలు సాగి, మొజాయిక్ లక్షణాలు కనిపిస్తాయి. పూత, కాత ఉండదు. ఈ వైరస్ పేనుబంక ద్వారా వ్యాపిస్తుంది.

### వ్యాప్తి

సాధారణంగా వైరస్ తెగులు నీటి ఎద్దడి ఉన్నప్పుడు, పొడి వాతావరణంలో ఎక్కువగా ఆశిస్తాయి. నత్రజని ఎరువులు ఎక్కువగా వాడటం, కలుపు మొక్కలు ఎక్కువగా ఉండి వైరస్‌లకు ఆశ్రయాలుగా ఉంటాయి. దీంతో వీటి ఉధృతి పెరుగుతుంది.

### నివారణ

సేంద్రియ సాగులో రసాయన పురుగు మందుల అవశేషాలు లేకుండా ఉండేందుకు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి.

1. వేప గింజల కషాయాన్ని 5 శాతం చొప్పున వాడవచ్చు. వేపనూనెను పిచికారీ చేయవచ్చు. సేంద్రియ ఎరువులు వాడాలి.
2. గ్రీజు పూసిన పసుపు రంగు అట్టలను పొలంలో ఉంచితే తెల్లదోమ ఉధృతి తగ్గుతుంది. వైరస్ సోకిన మొక్కలను గుర్తించి పీకి పారేయ్యాలి.
3. గట్లమీద వైరస్‌కు స్థావరాలైన కలుపు మొక్కలు లేకుండా శుభ్రం చేయాలి. పొలం చుట్టూ 2,3 వరుసలలో సజ్జ, జొన్న, మక్కజొన్నలను రక్షణ పంటలుగా వేసుకోవాలి.

### హెర్బల్ పురుగు మందులు

మొక్కల నుంచి మాత్రమే సేకరించి అన్ని వైరస్‌లను సమర్థవంతంగా నివారణ చేయగలిగే హెర్బల్ పురుగు మందులు ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్నాయి. రసాయన పురుగు మందుల కంటే సమర్థవంతంగా పనిచేస్తూ, తక్కువ ధరకే లభిస్తున్నాయి. ఇవి వాడిన ఉత్పత్తులకు మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తులుగా ప్రిమియం ధర ఉంటుంది. ఆరోగ్యానికి మంచిది. ఈ రకం పురుగు మందుల అదనపు వివరాల కోసం 9177178001లో సంప్రదించవచ్చు.

#### హెర్బల్ మందులనే వాడుతున్నా



మిరపలో వైరస్ తెగుళ్ల సమస్య విపరీతంగా ఉన్నది. రసాయన పురుగు మందులు వాడేటప్పుడు ప్రతి సంవత్సరం మోతాదు పెంచాల్సి వచ్చేది. 'స్టాప్ వైరస్' హెర్బల్ పురుగు మందుతో వైరస్ నివారణ సులభం. ముందస్తుగా పిచికారీ చేస్తూ అసలు వైరస్ ఆశించడమే లేదు. మేము ఈ మందులు వాడి సేంద్రియ మిరపగా అమ్ముతూ అధిక ధరలు పొందుతున్నాము. నేను వేసే అన్ని పంటలలో వైరస్ తెగుళ్ల నివారణకు 'స్టాప్ వైరస్' హెర్బల్‌నే వాడుతున్నాను.

–వెలది పురుషోత్తం రావు,
7901217777, సేంద్రియ రైతు

ఆసరి రాజు

# మామిడిలో సస్యరక్షణ



మామిడిలో పూతపూసే దశ నుంచి చెట్లను తెగుళ్ళ, పురుగులు బాగా ఆశించి తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. ముఖ్యంగా మామిడి ఆశించి పురుగులలో పండుఈగ ఎంతో ప్రమాదకరమైంది. ఈ పండుఈగను రైతులు సమర్థవంతంగా నివారిస్తే మామిడికి మార్కెట్‌లో మంచి గిరాకీ వస్తుంది.

మామిడి తోటల్లో చీడపీడల నివారణ ప్రధానమైన సమస్య. తోటల్లో కొత్తచిగురు వచ్చే దశ నుంచి కాయకోత దశ వరకు వివిధ రకాల పురుగులు, తెగుళ్లు ఆశించి నష్టాన్ని కలిగిస్తాయి. లేత ఇగురు, పూత, పిందదశలో వచ్చే చీడపీడలతో పోలిస్తే పండు పక్వానికి వచ్చే దశలో ఆశించే చీడపీడలు ఎక్కువ నష్టాన్ని కలిగిస్తాయి. వీటిని నివారణ చాలా కష్టం. మామిడితోటల్లో పండు పక్వానికి వచ్చే దశలలో ఆశించే పండు ఈగ (కాయను కొట్టే ఈగ) చాలా ప్రమాదకరమైంది. దీనిని నివారించకపోతే రైతులకు కాయకోసే దశలో తీవ్ర నష్టం వాటిల్లుతుంది.

### పండు ఈగతో నష్టం

పండు ఈగ మామిడి దిగుబడిపైనే కాకుండా మామిడి ఎగుమతులపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. ఈ ఈగ నివారణకు చేపట్టే యాజమాన్య పద్ధతులపై అవగాహనలేని రైతులు విపరీతంగా రసాయన పురుగు మందులను నేరుగా మామిడిపండ్లపై పిచికారీ చేస్తారు. దీనివల్ల పండ్లలో పురుగుమందుల అవశేషాలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించిన ఇతర దేశాలు మన దేశ పండ్ల ఎగుమతులను నిషేధిస్తున్నాయి. అందువల్ల మామిడి సాగులో పండు ఈగ నివారణ ప్రధానమైంది.

### పండుఈగల వ్యాప్తి

పండుఈగలు సుమారు 50–100 కిలోమీటర్ల దాకా ప్రయాణించి ఇతరప్రాంతాల్లో వృద్ధి చెందుతాయి. పురుగు ఆశించిన పండ్లు ఇతర ప్రాంతాలకు తరలించడం ద్వారా కొత్త ప్రాంతాలలో వీటి వ్యాప్తి జరుగుతుంది. వీటి వ్యాప్తిని నిరోధించడం కేవలం పురుగుమందుల వాడకం ద్వారానే సాధ్యపడదు. దీనికి సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించాలి. తోటలు కాపు దశకు వచ్చిన నాటి నుంచి పండ్లు కోత కోయడం, నిల్వ చేయడం, పండ్లను ఎగుమతిచేసే వరకు రైతులు తగిన చర్యలు తీసుకోవాలి.

### నివారణ మార్గాలు

రైతులు ముందుగా ఈగ కొట్టిన పండ్లను గుర్తించాలి. దీనికోసం కాయలపై ఈగలు గుడ్లు పెట్టడానికి చేసినటువంటి సన్నని రంధ్రాలను గుర్తించి ఆ కాయలను వేరుచేసి వెంటనే నాశనం చేయాలి. ఈగ కొట్టిన కాయలు పసుపురంగులోకి మారి కుళ్లిపోయి చెట్టు నుంచి రాలిపడుతాయి. అటువంటి పండ్లను ఏరి నాశనం చేయాలి. చెట్లకింద నేలను దున్ని పురుగు కోశస్థదశలు బయట పడేలాగా చేయాలి. చెట్టుకు 50–100 గ్రాముల చొప్పున కార్బరిల్ 10 శాతం పొడిని వేసి భూమిలో కలియదున్నితే పురుగు కోశస్థదశలు చనిపోతాయి. ప్రతి 20 మామిడిచెట్లకు ఒక ఆకర్షణ పళ్లాన్ని ఉంచాలి. ఆకర్షణ పళ్లెంలో మిథైల్‌యూజినాల్ 10 మిల్లీలీటర్ల చొప్పున 200 మిల్లీలీటర్ల నీటిలో కలుపాలి. అప్పుడు ఆ ద్రవం ఎర్రగా మారి ఈ ద్రావణానికి మగ ఈగలు ఆకర్షింపబడతాయి. ఈ ద్రావణంలో 20 మిల్లీలీటర్ల మలాథియాన్ లేదా 3 గ్రాములు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు కలిపితే ఈగలు ఈ మందును తాగి చనిపోతాయి. కాయలను కోతకోయడానికి మూడు వారాల ముందు 2 మిల్లీలీటర్ల మలాథియాన్‌ను లీటరు నీటిలో కలిపి మామిడి తోటలో పిచికారీ చేయాలి.

మామిడిపండ్లను ఎగుమతి చేసే రైతులు పండ్లు పూర్తిగా పక్వానికి రాక ముందే పండ్లను కోసి నిల్వచేయడం వల్ల పండ్లను పండుఈగ బారిన పడకుండా కాపాడుకోవచ్చు. రైతులు మామిడిపండ్లను ఎగుమతి చేసే ముందు వాటిలోని గుడ్డు, పిల్ల పురుగు దశలను నాశనం చేయడానికి వాటిని 48 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత గల వేడినీళ్లలో పండ్లను 60 నుంచి 75 నిమిషాల పాటు ఉంచాలి. ఆలస్యంగా కోతకు వచ్చే నీలం, తోతాపురి మామిడి పండ్ల రకాలలో ఈ పండు ఈగల బెడద ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఈ రకాలను సాగుచేసే రైతులు పండుఈగ నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

నగిరి హరీష్, త్రిపురారం

## ఎయిర్‌ఫోర్స్ అకాడమీ కమాండెంట్‌గా చలపతి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సికింద్రాబాద్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీ కమాండెంట్‌గా ఎయిర్‌మార్షల్ జే చలపతి నియామకం కాగా, బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు అకాడమీ కమాండెంట్‌గా ఏ ఎస్ బుతోలా విధులు నిర్వర్తించారు. ఆయన స్థానంలో చలపతి బాధ్యతలు చేపట్టారు. 1983లో చలపతి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఫ్లయింగ్ బ్రాంచ్‌లో విధుల్లో చేరారు. ఫైటర్, రవాణా, హెలికాప్టర్లను 3,300 గంటలపాటు నడిపిన రికార్డు ఆయన పేరిట ఉంది. 35 ఏండ్ల ఉద్యోగ జీవితంలో ఆపరేషనల్ స్క్వాడ్రన్ కమాండింగ్ ఆఫీసర్, ఎయిర్‌ఫోర్స్ టెస్ట్ పైలట్స్ స్కూల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, నేషనల్ టెస్ట్ సెంట్రెండ్ అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ ఎయిర్‌స్టాఫ్ ప్రాజెక్టు డైరెక్టర్ వంటి పదవులను చేపట్టారు. చలపతి బంగ్లాదేశ్‌లోని నేషనల్ డిఫెన్స్ అకాడమీలో ఆర్మీ కోర్సు పూర్తిచేశారు. లండన్‌లోని కింగ్స్ కాలేజీ నుంచి మిలిటరీ స్టడీస్‌లో మాస్టర్ డిగ్రీ పొందారు. భారత ప్రెసిడెంట్ చేతులమీదుగా విశిష్ట సేవా మెడల్ అందుకున్నారు.



గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది నెలవారీ వేతనాలను సీఎం కేసీఆర్ రూ.8,500కు పెంచడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని చిట్యాల, రేగొండ, పలిమెల, టేకుమట్ల గ్రామాలతో పాటుగా కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని గోపాల్‌రావుపేటలో గ్రామ పంచాయతీ కార్మికులు బుధవారం సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

\- జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ/రామడుగు

## ఫిబ్రవరి వరకు 'గ్రే' జాబితాలోనే పాక్

- ఎఫ్ఏటీఎఫ్ నిర్ణయం


**ఇస్లామాబాద్, అక్టోబర్ 16:** వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు పాకిస్థాన్‌ను 'గ్రే' జాబితాలోనే కొనసాగించాలని ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) సూత్రప్రాయంగా నిర్ణయించింది. పూర్తిస్థాయిలో ఉగ్రవాదులకు ఆర్థిక సాయం నిలిపివేయడంతోపాటు హవాలా లావాదేవీలను నిరోధించేందుకు అదనపు చర్యలు చేపట్టాలని పాకిస్థాన్‌కు మార్గనిర్దేశం చేసింది. అంతర్జాతీయంగా ఆర్థిక రంగం ఎదుర్కొనే సవాళ్లను పరిష్కరించడం కోసం 1989లో ఏర్పాటైందే ఈ ఎఫ్ఏటీఎఫ్. మంగళవారం జరిగిన సమావేశంలో హవాలా లావాదేవీలను, ఉగ్రవాదులకు నిధుల సాయాన్ని పూర్తిగా నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నట్లు పాక్ సమర్పించిన నివేదికను సమీక్షించారు. దీనిపై ఎఫ్ఏటీఎఫ్ వచ్చే ఫిబ్రవరిలో తుది నిర్ణయం తీసుకోనున్నది. అయితే తమ దేశాన్ని ఎఫ్ఏటీఎఫ్ 'గ్రే' లిస్ట్‌లో కొనసాగించినట్లు వచ్చిన వార్తలను పాక్ ఆర్థిక శాఖ అధికార ప్రతినిధి ఒమర్ హమీద్‌ఖాన్ తిరస్కరించారు. 18న దీనిపై ఎఫ్ఏటీఎఫ్ తుది నిర్ణయాన్ని వెల్లడించనున్నదని చెప్పారు.



## కర్ణాటక కాంగ్రెస్ ఎంపీ రాజీనామా

- బీజేపీలో చేరే అవకాశం

**ఢిల్లీ:** కర్ణాటకకు చెందిన కాంగ్రెస్ ఎంపీ కేసీ రామమూర్తి బుధవారం తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజ్యసభ చైర్మన్ ఎం వెంకయ్యానాయుడు ఆయన రాజీనామాను ఆమోదించారని, మూర్తి త్వరలో బీజేపీలో చేరే అవకాశం ఉన్నదని పార్టీ వర్గాల సమాచారం. కాంగ్రెస్ పార్టీకే చెందిన బుబ్నేశ్వర్ కలిత, సంజయ్‌సింగ్, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన నీరజ్‌శేఖర్, సురేందర్‌సింగ్ నగర్, సంజయ్‌సేథ్ బీజేపీలో చేరేందుకు తమ రాజ్యసభ సభ్యత్వాలకు రాజీనామాలు చేశారు. అనంతరం వారు బీజేపీ టికెట్‌పై రాజ్యసభకు ఎన్నికై, రాజ్యసభలో మెజారిటీ కొరవడిన అధికార బీజేపీకి బలాన్ని ఇచ్చారు. గత జూన్‌లో తెలుగుదేశం పార్టీకి చెందిన నలుగురు రాజ్యసభ సభ్యులు బీజేపీలో చేరిన విషయం తెలిసిందే.



ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు రాజీనామా లేఖ ఇస్తున్న కేసీ రామమూర్తి



దాడికి ఉపయోగించిన కత్తి.. శివసేన ఎంపీ ఓంరాజే నింబాల్కర్

## ఎన్నికల సభలో శివసేన ఎంపీకి కత్తిపోటు!

కరచాలనం నెపంతో గాయపరిచి నిందితుడు మాయం

**ముంబై:** మహారాష్ట్రలోని ఉస్మానాబాద్‌లో బుధవారం ఎన్నికల సభలో పాల్గొన్న శివసేన ఎంపీ ఓంరాజే నింబాల్కర్‌ను గుర్తుతెలియని వ్యక్తి కత్తితో పొడిచి గాయపరిచాడని పోలీసులు తెలిపారు. కలంబ్ తాలూకాలోని పదోలి నైగాంవ్‌లో ఎన్నికల సభను ఉద్దేశించి ప్రసంగిస్తుండగా కొందరు గుంపుగా నింబాల్కర్ వద్దకు వచ్చారని, కరచాలనం నెపంతో ఓ వ్యక్తి కత్తితో గాయపరిచాడని పోలీసు అధికారి తెలిపారు. ఎంపీ నింబాల్కర్‌ను అభినందిస్తూనే ఆ వ్యక్తి కత్తితో దాడికి పాల్పడి అక్కడి నుంచి తప్పించుకున్నాడని, చేతికి ఉన్న గడియారం కారణంగా పెద్ద ప్రమాదం తప్పిందని చెప్పారు. ఎంపీ తండ్రి, కాంగ్రెస్ నాయకుడైన పవన్‌రాజే నింబాల్కర్ 2006 జూన్ 3న ముంబై-పూణే ఎక్స్‌ప్రెస్‌వేలో కలంబోలి సమీపంలో కారులో వెళ్తుండగా జరిగిన హత్యాప్రయత్నంలో మరణించారు. ఈ కేసులో మాజీ ఎంపీ పదంసిన్హా పాటిల్ ప్రధాన నిందితుడు.

# కుటుంబ సేవలోనే దేశభక్తి

### కాంగ్రెస్‌పై మోదీ విమర్శ

- ప్రతిపక్షం కొన ఊపిరితో ఉందని వ్యాఖ్య
- జమ్ముకశ్మీర్‌కు, మహారాష్ట్రకు సంబంధం లేదనేవారు మునిగిచావాలి
- సావర్కర్ విలువలతోనే జాతిని నిర్మిస్తాం
- మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు

**అకోలా/జాల్నా, అక్టోబర్ 16:** ఓ కుటుంబం పట్ల చూపే భక్తినే కాంగ్రెస్ పార్టీ దేశభక్తిగా భావిస్తుందని, ప్రతిపక్షం 'కొన ఊపిరి'తో కొట్టుమిట్టాడుతున్నదని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. హిందుత్వ సిద్ధాంతకర్త వినాయక్ దామోదర్ సావర్కర్ విలువలే జాతి నిర్మాణానికి ఆధారాలని చెప్పారు. బాబాసాహెబ్ అంబేద్కర్‌కు భారతరత్న ఇచ్చేందుకు గత (కాంగ్రెస్) ప్రభుత్వం నిరాకరించిందని ఆరోపించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మోదీ బుధవారం అకోలా, జాల్నా జిల్లాల్లో జరిగిన బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సావర్కర్ చూపిన విలువల కారణంగానే తాము జాతి నిర్మాణానికి జాతీయవాదాన్ని ఆధారంగా చేసుకున్నామని ప్రధాని తెలిపారు. సావర్కర్‌కు భారతరత్న ఇవ్వాలంటూ బీజేపీ మహారాష్ట్ర శాఖ ప్రతిపాదించిన మరుసటి రోజే ప్రధాని ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ కొన ఊపిరితో ఉన్నదని, ఆ పార్టీ నేతలు ఓ కుటుంబం పట్ల చూపే భక్తినే దేశభక్తిగా భావిస్తారని ఎద్దేవా చేశారు. 'కాంగ్రెస్ పార్టీ తమ కార్యకర్తలకు జాతీయవాదంపై ఒక క్లాస్ తీసుకుంటుందని విన్నాను. నాకు నవ్వాలో.. ఏడ్వాలో తెలియడం లేదు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన కాంగ్రెస్ ఇది కాదని దీనిని బట్టి రుజువవుతున్నది' అని వ్యాఖ్యానించారు. జాతీయవాద భావాలు, దేశభక్తి మహారాష్ట్రలో ఉచ్ఛస్థితిలో ఉంటాయని, ఈ విషయాన్ని కాంగ్రెస్, ఎన్సీపీ మరిచిపోయాయని విమర్శించారు. జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దును ప్రతిపక్షాలు విమర్శించడం సిగ్గుచేటని మోదీ మండిపడ్డారు. 'జమ్ముకశ్మీర్‌కు, మహారాష్ట్రకు సంబంధం లేదని వారు ఎలా అనగలరు? ఇటువంటి ఆలోచనలున్నందుకు వారు సిగ్గుపడాలి. నీటిలో మునిగి చావాలి' అని వ్యాఖ్యానించారు. దేశ భద్రత విషయంలో జాతి అంతా ఒకే స్వరం వినిపించాలని చెప్పారు. కానీ ప్రతిపక్షాలు అన్ని విషయాల్లోనూ రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్-ఎన్సీపీ కూటమిని ఆయన అవినీతి కూటమి అని అంటూ వాటిపాలనలో మహారాష్ట్ర దశాబ్దం కాలం వెనుకకు పోయిందని చెప్పారు. వారి పాలనలో నిత్యం రైళ్లు, బస్సులు, భవనాల్లో బాంబు పేలుళ్లు సంభవించేవని ఆరోపించారు. ఈ పేలుళ్లకు పాల్పడిన ఉగ్రవాదులు వేర్వేరు దేశాలకు తప్పించుకొనిపోయి అక్కడే స్థిరపడ్డారని చెప్పారు. కాంగ్రెస్-ఎన్సీపీ అధికారంలో ఉండగానే వారు తప్పించుకొని పోయారని ఆరోపించారు. దేశభక్తి ఉన్నవారెవరూ పాకిస్థాన్‌పై జరిపిన లక్షిత దాడులు, వైమానిక దాడులను వ్యతిరేకించరని, కానీ ఈ సిగ్గులేని నేతలు ఆ పనిచేశారని ఎన్సీపీ నాయకులనుద్దేశించి మోదీ విమర్శించారు. ఎన్సీపీ ఎన్నికల చిహ్నమైన గడియారంలో టైమ్ 10 గంటల 10 నిమిషాలు చూపుతుందని ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎన్సీపీకి పదేసి సీట్లు మాత్రమే వస్తాయని మోదీ జోస్యం చెప్పారు.






మహారాష్ట్రలోని నవీ ముంబైలో ఎన్నికల ప్రచారంలో మోదీతో స్థానిక నేతలు

## సావర్కర్‌కు భారతరత్న ఇవ్వాల్సిందే

కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ వ్యాఖ్య

కాంగ్రెస్ పార్టీలో ఒక్క కుటుంబానికి మాత్రమే ప్రాధాన్యం ఇస్తారని ఎద్దేవా

**నాగ్‌పూర్, అక్టోబర్ 16:** హిందుత్వ జాతీయవాది వీడీ సావర్కర్‌కు భారత రత్న పురస్కారం ఇవ్వాలన్న డిమాండ్‌ను బీజేపీ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చడం సమర్థనీయమేనని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఆయన నాగ్‌పూర్‌లో మీడియాతో మాట్లాడుతూ సావర్కర్ వంటి దేశభక్తులకు దేశ అత్యున్నత పౌర పురస్కారం అందజేయడాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ కేవలం ఒక్క 'కుటుంబ సభ్యులకు' మాత్రమే అత్యున్నత పౌర పురస్కారాన్ని అందజేయాలని భావిస్తుందని గాంధీ కుటుంబాన్ని ఉద్దేశించి అన్నారు. దేశ తొలి హోంమంత్రి 'సర్దార్' వల్లభ్‌భాయి పటేల్, రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్‌లకు భారతరత్న ఇవ్వడానికి కాంగ్రెస్ ఆసక్తి చూపలేదన్నారు. '(గాంధీ కుటుంబేతర నాయకుడు) పీవీ నర్సింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు పటేల్, అంబేద్కర్‌లకు వారి మరణానంతరం భారతరత్న అవార్డులు ప్రదానం చేశారు' అని రవిశంకర్ గుర్తు చేశారు. పండిట్ నెహ్రూ, రాజీవ్‌గాంధీ, జాకీర్ హుస్సేన్ (మూడో రాష్ట్రపతి)లకు భారతరత్న ఇచ్చినప్పుడు సావర్కర్‌కు ఈ పురస్కారం ఇవ్వాలంటే కాంగ్రెస్ పార్టీకి ఎందుకు సమస్య?' అని ప్రశ్నించారు. బ్రిటిష్ పాలనలో సావర్కర్ 11 ఏండ్లు జైలులో గడిపిన దేశభక్తుడని రవిశంకర్ ప్రసాద్ కొనియాడారు. 'సర్దార్ పటేల్ 1950లో మరణిస్తే, 1991లో అప్పటి ప్రధాని పీవీ నర్సింహారావు భారత రత్న అవార్డు ప్రదానం చేశారు. ఒకవేళ ఆయన ఆ పని చేయకపోతే తర్వాత అధికారం చేపట్టిన వాజపేయి ప్రభుత్వం చేసి ఉండేది' అని తెలిపారు. తొలి ప్రధాని నెహ్రూను వ్యతిరేకించినందు వల్లే తొలినాళ్లలో పటేల్‌కు భారతరత్న అవార్డు ప్రదానం చేయలేదన్నారు. 1992లో స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్‌కు పీవీ ప్రభుత్వం, అంతకుముందు 1990లో బీఆర్ అంబేద్కర్‌కు అప్పటి వీపీసింగ్ ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించాయని గుర్తు చేశారు. సావర్కర్‌కు భారతరత్న అవార్డు ప్రదానం చేయాలన్న బీజేపీ డిమాండ్‌ను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్.. తన గతాన్ని తెలుసుకోవాలని రవిశంకర్ సూచించారు.

## వ్యవసాయంలో మహిళా రైతులు కీలకం

- గృహ విజ్ఞాన కోఆర్డినేటర్ డాక్టర్ విజయలక్ష్మి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వ్యవసాయంలో మహిళా రైతుల పాత్ర కీలకమని, వారు ఆరోగ్యంగా ఉండాలని వ్యవసాయ విశ్వవిద్యాలయ గృహవిజ్ఞాన శాస్త్రవేత్తల యూనిట్ కోఆర్డినేటర్ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. మహేశ్వరం మండలంలోని రామచంద్రగూడలో బుధవారం యూనివర్సిటీలో అఖిల భారత సమన్వయ పరిశోధన పథకం, గృహవిజ్ఞాన విభాగం ఆధ్వర్యంలో మహిళా రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 'వ్యవసాయంలో మహిళా రైతుల పాత్ర','ఆరోగ్య ప్రాముఖ్యం'పై పలువురు వక్తలు మాట్లాడారు. సమావేశంలో కవితాకిరణ్, పూజ, డాక్టర్ కమలజ, డాక్టర్ యశోద, ఉమాజ్యోతి, డాక్టర్ దీపిక, సర్పంచ్ శివ, రాజునాయక్, సెక్రటరీ సందీప్ పాల్గొన్నారు.

## ఆఫ్ఘన్‌లో ఉగ్రదాడి

**ముగ్గురు మృతి.. 27 మందికి గాయాలు**

**జలాలాబాద్, అక్టోబర్ 16:** ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్లు ఘాతుకానికి పాల్పడ్డారు. అలిషింగ్ జిల్లాలోని గ్రామీణపోలీస్‌స్టేషన్ సమీపంలో బుధవారం ఓ ట్రక్కుబాంబును పేల్చగా ముగ్గురు భద్రతాసిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. మరో 27 మంది గాయపడ్డారు. గాయపడ్డవారిలో 20 మంది చిన్నారులు, ఆరుగురు పోలీసు అధికారులు, ఓ పౌరుడు ఉన్నారు. పేలుడుతో ఓ మదర్సా ధ్వంసమై విద్యార్థులు గాయపడ్డారు. పేలుడుకు పాల్పడ్డట్టు ఓ తాలిబన్‌సంస్థ ప్రకటించింది.

## యువతిపై ఉన్మాది కత్తితో దాడి


- పెండ్లికి నిరాకరించిందని పొడిచి.. విషం తాగిన వివాహితుడు
- ఇద్దరి పరిస్థితి విషమం..ఏపీలోని పశ్చిమగోదావరిలో దారుణం

**పశ్చిమ గోదావరి:** ప్రేమను నిరాకరించిందని యువతిని ఓ ఉన్మాది కత్తితో పొడిచి తాను ఆత్మహత్యకు యత్నించిన ఘటన ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లాలో బుధవారం చోటుచేసుకున్నది. పోడూరు మండలం కవిటంలో కొవ్వూరి తేజశ్రీ (20) కాలేజీకి వెళ్తుతండగా బస్టాప్ వద్ద సుధాకర్ అనే వివాహితుడు కత్తితో దాడిచేసి గాయపరిచాడు. అనంతరం తాను కూడా విషంతాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు, పోలీసులు ఇద్దరినీ పాలకొల్లు దవాఖానకు తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. సుధాకర్ కొంతకాలంగా ఆ యువతిని ప్రేమపేరుతో వేధిస్తున్నాడని, ప్రేమను నిరాకరించడంతో దాడికి పాల్పడినట్టు స్థానికులు చెప్తున్నారు. సుధాకర్‌కు పెండ్లయిందని, విడాకుల కోసం ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు.

# రైతును రాజుగా చేస్తాం


- సేంద్రియ వ్యవసాయం మేలు
- సాగుకు సంపూర్ణ మద్దతు
- జమ్మికుంట కిసాన్ మేళాలో మంత్రి ఈటల రాజేందర్

**జమ్మికుంట:** రైతును రాజుగా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకుసాగుతున్నదని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. వ్యవసాయానికి సర్కార్ సంపూర్ణ మద్దతునిస్తున్నదని చెప్పారు. కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట కృషివిజ్ఞాన కేంద్రం (కేవీకే) సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ ఆహార దినోత్సవం, మహిళా కిసాన్ దివస్ 'కిసాన్ మేళా' సదస్సును నిర్వహించారు. ఈ మేళాకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి ఈటల.. రైతుల కోసం కేవీకే అందిస్తున్న సేవలను కొనియాడారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని, రైతులకు ఎనకటి ఎవుసం దిశగా చైతన్యం కలిగించాలని సూచించారు. రోగాల్లేని సమాజాన్ని నిర్మించేందుకు సేంద్రియ సాగే మేలని, రైతులు రసాయన ఎరువులకు దూరంగా ఉండాలని ఈటల పిలుపునిచ్చారు. తినే పంటల వల్లే ఎక్కువ శాతం ప్రజలు రోగాల బారినపడుతున్నారని, దవాఖానలకే ఎక్కువ పైసలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పంట ఎంత తీస్తున్నామన్నది కాదని, ఎలా సాగు చేస్తున్నామన్నదే ముఖ్యమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు తీసుకొస్తున్నట్టు ఆయన తెలిపారు. సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న రైతు బీమా, రైతుబంధు పథకాలతో అన్నదాతలకు ఎంతో మేలు జరుగుతున్నదని పేర్కొన్నారు. శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తీసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. జిల్లాను సీడ్ బౌల్ ఆఫ్ తెలంగాణగా తీర్చిదిద్దుతామని ఆయన చెప్పారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటుచేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ మేళాలో జెడ్పీ అధ్యక్షురాలు కే విజయ, డీఎన్ఎస్ఎస్ జనార్దన్‌రెడ్డి, విజయగోపాల్‌రెడ్డి, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జమ్మికుంట కిసాన్‌మేళాలో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్

## విద్యుత్ షాక్‌తో రైతు మృతి



**కోనరావుపేట:** విద్యుత్ షాక్‌కు ఓ రైతు మృతిచెందిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో బుధవారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన జంగం సలామన్ (45) కూలిపని చేసుకుంటూ, గ్రామశివారులో తన 20 గుంటల భూమితోపాటు చుట్టుపక్కల వారి భూమిని కౌలుకు తీసుకుని వరి వేశాడు. బుధవారం మధ్యాహ్నా పంటకు నీరు పెట్టేందుకు మోటారును ఆన్ చేసి ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో మోటరు వద్ద సపోర్ట్‌గా ఉంచిన ఇనుప సలాకకు కాలు తగిలి పడిపోయాడు. దీంతో మోటారు నుంచి విద్యుత్ తీగలు ఊడిపోయి సలాకకు ఆనుకొని ఉండటం, పొలంలో నీరుండటంతో విద్యుత్ షాక్‌గురై అక్కడిక్కడే మృతి చెందాడు. సెస్ ఏఈ పార్వతీ గణేశ్, ఏఎస్సై ప్రమీల సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం తీరును పరిశీలించారు. సలామన్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించినట్లు ఏఎస్సై తెలిపారు.

## కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..

- ముగ్గురు ఉగ్రవాదులు హతం

**శ్రీనగర్, అక్టోబర్ 16:** జమ్ముకశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలకు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు ముష్కరులు హతమయ్యారు. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున అనంత్‌నాగ్ జిల్లాలోని పజల్‌పొర ప్రాంతంలో చోటుచేసుకుంది. ఈ ప్రాంతంలో ఉగ్రవాదులు సంచరిస్తున్నారన్న నిఘా వర్గాల సమాచారం మేరకు మంగళవారం రాత్రి భద్రతా బలగాలు గాలింపు చేపట్టాయి. ఒక ఇంటిలో ఉగ్రవాదులు తలదాచుకున్నట్లు అనుమానించిన బలగాలు ఆ ఇంటి యజమానిని ప్రశ్నించగా ఇక్కడ ఎవరూ లేరని చెప్పాడు. అయినా బలగాలు గాలింపును కొనసాగిస్తుండగా ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులకు తెగబడ్డారు. దీంతో అప్రమత్తమైన బలగాలు వెంటనే ఎదురుకాల్పులు జరుపగా ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. వీరంతా స్థానికులని, ఇటీవలే ఉగ్రవాద సంస్థల్లో చేరారని పోలీసులు గుర్తించారు. వీరందరి వయసు 20 ఏండ్ల వరకు ఉంటుందని తెలిపారు.

**ఇటుకల తయారీ కార్మికుడు కాల్చివేత**

జమ్ముకశ్మీర్‌లో పనిచేస్తున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ కార్మికుడిని ఉగ్రవాదులు కాల్చిచంపారు. ఈ ఘటన బుధవారం పుల్వామా జిల్లాలోని నిహమా ప్రాంతంలో చోటుచేసుకుంది. సేతి కుమార్ సాగర్ అనే వ్యక్తి కశ్మీర్‌కు వచ్చి ఇటుకల తయారీ కార్మికుడిగా పనిచేస్తున్నారు. అయితే బుధవారం ఆయన మరో వ్యక్తితో కలిసి నడుచుకుంటూ వెళ్తుండగా ఇద్దరు ఉగ్రవాదులు ఆయనపై కాల్పులు జరిపారు. దీంతో సేతికుమార్ మరణించారు. జమ్ముకశ్మీర్‌కు చెందని వ్యక్తులను ముష్కరులు కాల్చిచంపడం ఇటీవలి కాలంలో ఇది రెండోసారి. రాజస్థాన్‌కు చెందిన ఓ ట్రక్కు డ్రైవర్‌ను సోమవారం షోపియాన్ జిల్లాలో ఇద్దరు ఉగ్రవాదులు కాల్చిచంపారు.

## రక్షణ స్థావరాల వద్ద హై అలర్ట్

**పాక్‌కు చెందిన ఉగ్రవాదులు దేశంలోకి చొరబడ్డారని హెచ్చరించిన నిఘా వర్గాలు**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 16:** పాకిస్థాన్‌కు చెందిన పలువురు ఉగ్రవాదులు భారత్‌లోకి చొరబడ్డారని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ప్రధానంగా కశ్మీర్, పంజాబ్ రాష్ట్రాల్లో వీళ్లు తిష్ఠ వేశారని తెలిపాయి. భారత సైనిక, వైమానిక స్థావరాలు లక్ష్యంగా వీళ్లు దాడులకు తెగబడే అవకాశముందని పేర్కొన్నాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు పంజాబ్, కశ్మీర్‌లోని సైనిక స్థావరాలకు హై అలర్ట్ జారీ చేశారు. అలాగే పంజాబ్, కశ్మీర్‌లోని వైమానిక స్థావరాలకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేశారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని కేంద్రం రద్దు చేసినప్పటి నుంచి భారత సైనిక, వైమానిక స్థావరాలపై దాడులు చేయడానికి పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులు కుట్ర పన్నుతున్నారని ఇటీవల నిఘా వర్గాలు హెచ్చరించిన విషయం తెలిసిందే. అయితే చొరబాటుకు సంబంధించి బుధవారం కూడా నిఘా వర్గాలకు మళ్లీ సమాచారం అందింది. ఈ నేపథ్యంలో కశ్మీర్, పంజాబ్‌లోని సైనిక, వైమానిక స్థావరాల వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

# సాగు అభివృద్ధికి కీలకం బిగ్‌డాటా

- విద్య, వైద్యం, వ్యవసాయరంగాల్లో సమస్యల పరిష్కారానికి అవకాశాలు
- వాతావరణ మార్పులకు అనుగుణంగా డాటాబేస్ ఆధారంగా సాగు
- ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్
- ఇక్రిశాట్‌లో బిగ్‌డాటా ఆధారిత వ్యవసాయ పరిశోధన, అభివృద్ధిపై సదస్సు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బిగ్‌డాటా భవిష్యత్‌లో వ్యవసాయరంగంలో కీలక భూమిక పోషించనున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ చెప్పారు. దేశంలోనే డిజిటల్ టెక్నాలజీ వినియోగంలో తెలంగాణ అగ్రగామిగా ఉన్నదని.. టీహబ్, ఐహబ్ ద్వారా సేవలు విస్తృతం చేస్తున్నామని పేర్కొన్నారు. బుధవారం ఇక్రిశాట్‌లో కన్సల్టేటివ్ గ్రూప్ ఫర్ ఇంటర్నేషనల్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (సీజీఐఏఆర్) ఆధ్వర్యంలో బిగ్‌డాటా ఆధారిత వ్యవసాయ పరిశోధన, అభివృద్ధిపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. గిట్టుబాటు ధరల్లేక రైతులు టమాట, మిరప, ఉల్లిగడ్డ, ఇతర కూరగాయలను రోడ్లపై పారబోసి నిరసనలు వ్యక్తం చేస్తున్న సందర్భాలు చాలా ఏండ్లుగా చూస్తున్నామని, ఇలాంటి సమస్యలకు పరిష్కారాలను కేవలం చారిత్రక డిజిటల్ డాటా ఇవ్వగలదని చెప్పారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో తెలంగాణ ప్రభుత్వం ముందంజలో ఉన్నదన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయంరంగాల్లో సులభతర పరిష్కారాలు అందించడంలో డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం కీలకంగా మారిందని చెప్పారు. తెలంగాణలో రైతుబంధు, రైతుబీమా పథకాల అమలులో లావాదేవీలన్నీ డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం సాయంతో అద్భుతంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపిక, సంక్షేమ పథకాల చేరవేతకు ఉపయోగిసున్న ఓపెన్ డాటాబేస్ ఎంతగానో ఉపయోగపడుతున్నట్టు తెలిపారు. పోలీసింగ్, ఆసరా పింఛన్ల అమలుతోపాటు పట్టణ ప్రభుత్వాలకు పన్నుల వసూళ్లలోనూ డాటా ఎంతగానో సహకరిస్తున్నదన్నారు. ఓపెన్ డాటా అమలు చేస్తున్నప్పటి నుంచి పాలనలో పాదర్శకతతోపాటు పన్నుల వసూళ్లు కూడా పెరిగాయని జయేశ్‌రంజన్ వివరించారు.

**డాటాతో భారత రైతులకు మేలు**

ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ పీటర్ బెర్రీ మాట్లాడుతూ.. వర్షాధార వ్యవసాయం చేస్తున్న భారత్ వంటి దేశాల్లోని రైతులకు అన్ని స్థాయిల్లో బిగ్‌డాటా ఉపయోగపడుతుందని వెల్లడించారు. రాబోయే రోజుల్లో వ్యవసాయరంగం సంక్షోభాన్ని నివారించడంతోపాటు లాభదాయకంగా తీర్చిదిద్దడంలో బిగ్‌డాటా కీలకపాత్ర పోషించనున్నదని స్పష్టం చేశారు. రెండేండ్ల కిందట తాము ప్రారంభించిన ప్లాంటిక్స్ యాప్.. ఇప్పుడు 10 మిలియన్ డౌన్‌లోడ్స్ సాధించి ప్రతి నెలా వృద్ధి సాధిస్తున్నామని ఇక్రిశాట్ డిజిటల్ వింగ్ శాస్త్రవేత్త శ్రీకాంత్ చెప్పారు. మూడు రోజులపాటు జరుగనున్న ఈ సదస్సులో ఇక్రిశాట్ మాజీ డైరెక్టర్ జనరల్ డేవిడ్ బెర్గ్‌సన్, డిజిటల్ విభాగం ఇంచార్జి ధూళిపాల రామ్ తదితరులు పాల్గొన్నారు. భారత్‌సహా అమెరికా, ఆఫ్రికా, జపాన్, ఆస్ట్రేలియా, జర్మనీ, వియత్నాం, కెనడా, న్యూజిలాండ్ దేశాల నుంచి దాదాపు 500 మంది శాస్త్రవేత్తలు, పరిశోధకులు, వివిధ కంపెనీల ప్రతినిధులు, విద్యార్థులు హాజరయ్యారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో వ్యవసాయం, పరిశోధనల్లో బిగ్‌డాటా వినియోగంపై నిపుణులు విస్తృతంగా చర్చించారు.





బుధవారం హైదరాబాద్‌లో బిగ్‌డాటా ఆధారిత వ్యవసాయ పరిశోధన, అభివృద్ధిపై జరిగిన సదస్సులో మాట్లాడుతున్న ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్

## సీమలో హైకోర్టు ఏర్పాటుచేయాలి

- అమరావతిలో ఆ ప్రాంత న్యాయవాదుల ఆందోళన
- లేకుంటే రాజధానినైనా తరలించాలని డిమాండ్

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి వికేంద్రీకరణ జరుగాలంటే రాయలసీమలోనే హైకోర్టు ఏర్పాటుచేయాలంటూ ఆ ప్రాంత న్యాయవాదులు డిమాండ్‌చేశారు. బుధవారం అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల నుంచి న్యాయవాదులు భారీ సంఖ్యలో అమరావతి సచివాలయానికి తరలివచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కాన్వాయ్ వెళ్తుండగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. హైకోర్టును రాయలసీమకు తరలించాలని, లేదంటే రాజధానిని అయినా ఏర్పాటుచేయాలని డిమాండ్‌చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. శ్రీబాగ్ ఒప్పందం మేరకు హైకోర్టును రాయలసీమకు తరలించాలని డిమాండ్‌చేశారు. అన్ని వ్యవస్థలనూ అమరావతిలో తెచ్చి పెట్టింది టీడీపీయేనని, అందుకు తమ డిమాండ్ విషయమై ఆ పార్టీని సంప్రదించలేదని న్యాయవాదులు చెప్పారు. హైకోర్టు ఇక్కడే ఉండాలని కోస్తా న్యాయవాదులు కోరితే.. రాజధానిని రాయలసీమలో ఏర్పాటుచేయాలని డిమాండ్‌చేశారు.



అమరావతిలో ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
గురువారం 17 అక్టోబర్ 2019

'హాలీవుడ్ సినిమాల్ని నాతో పాటు తెలుగు హీరోలంతా ప్రోత్సహిస్తున్నారు. అలాగే మేము నటించిన సినిమాల్ని డిస్నీ వారు హాలీవుడ్‌లో విడుదల చేసే రోజు రావాలని కోరుకుంటున్నాను' అని అన్నారు విజయ్ దేవరకొండ. ఆర్నాల్డ్ ష్వార్జ్ నెగ్గర్, లిండా హామిల్టన్ ప్రధాన పాత్రల్లో నటించిన హాలీవుడ్ చిత్రం 'టెర్మినేటర్ డార్క్ ఫేట్'. జేమ్స్ కామెరూన్, డేవిడ్ ఎల్లిసన్ నిర్మించారు. టీమ్ మిల్లర్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాను డిస్నీ సంస్థ తెలుగులో విడుదలచేస్తున్నది. నవంబర్ 1న ఈ చిత్రం విడుదలకానుంది. తెలుగు ట్రైలర్‌ను బుధవారం హైదరాబాద్‌లో హీరో విజయ్ దేవరకొండ విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో ముచ్చటించారు.

# తెలుగు సినిమాల్ని హాలీవుడ్‌లో చూసే రోజు రావాలి



ట్రైలర్ చూస్తుంటే నా పాఠశాల రోజులు గుర్తొచ్చాయి. స్కూల్‌డేస్‌లో జేమ్స్ కామెరూన్, ఆర్నాల్డ్ కలయికలో వచ్చిన 'టెర్మినేటర్ జడ్జిమెంట్ డే' సినిమా చూశాను. అందులో విలన్ అస్సలు చనిపోడు. సినిమా చూస్తూ వీడేంటి ఎంతకి చనిపోవడం లేదని భయపడిపోయాను. ఆ రోజుల్లోనే గ్రాఫిక్స్ హంగులతో అద్భుతంగా పాత్రల్ని, సినిమాను తీర్చిదిద్దారు జేమ్స్ కామెరూన్.'జడ్జిమెంట్ డే' తర్వాత వచ్చిన 'టెర్మినేటర్' సిరీస్ సినిమాల్లో ఈ ట్రైలర్ నాకు చాలా నచ్చింది. హాలీవుడ్ సినిమాల్ని ఎక్కువగా ఇంగ్లీష్‌భాషలోనే చూస్తుంటాను. '300' సినిమాకు ఇంగ్లీష్ వెర్షన్ టికెట్స్ దొరక్కపోవడంతో తెలుగు అనువాదంలో చూశాను. అదే నేను డబ్బింగ్‌లో చూసిన తొలి హాలీవుడ్ మూవీ. ఆ రోజుల్లో డబ్బింగ్ సినిమాలు చూసి నవ్వుకునే వాళ్లం. నాణ్యత అస్సలు బాగుండేది కాదు. కానీ ఇప్పుడు డబ్బింగ్ ప్రమాణాలు మెరుగయ్యాయి.

**సినిమాల్ని ప్రేమిస్తారు..**

తెలుగు ప్రేక్షకులు సినిమాల్ని చాలా ప్రేమిస్తారు. భాషాభేదాలతో సంబంధం లేకుండా అన్ని సినిమాల్ని చూసే సంస్కృతి ఇక్కడ కనిపిస్తుంది. ఇతర ఇండస్ట్రీలతో పోలిస్తే సినిమాల ద్వారా తెలుగు రాష్ట్రాల నుంచే ఎక్కువ ఆదాయం వస్తుంటుంది. డిస్నీ వారు తెలుగులో విడుదలచేసిన గత సినిమాల మాదిరిగానే ఈ చిత్రం పెద్ద విజయాన్ని సాధించాలి. ఇలాంటి విజువల్స్, యాక్షన్ హంగులతో కూడిన సినిమాను తెలుగు భాషలో చూసే అవకాశం కల్పించడం ఆనందంగా ఉంది.

**ప్రభాస్ నటిస్తే బాగుంటుంది..**

హీరోగా ఇలాంటి యాక్షన్ సినిమాల్ని చేసే ఆలోచన ప్రస్తుతానికైతే నాకు లేదు. పదేళ్ల తర్వాత అవకాశం వస్తే ఆలోచిస్తాను. నాకంటే ప్రభాస్ 'టెర్మినేటర్' లాంటి యాక్షన్ సినిమాలు చేస్తే బాగుంటుంది. ఈ సినిమాను తెలుగుతో పాటు ఇంగ్లీష్ భాషలో చూడాలని అనుకుంటున్నాను. ఎమోషన్‌తో సంబంధం లేకుండా యాక్షన్ కథాంశం ఎవరినైనా మెప్పిస్తుంది. ఈ సినిమాను ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేస్తారనే నమ్మకముంది. హాలీవుడ్‌లో అవకాశం వస్తే తప్పకుండా నటిస్తాను. అలాగే బాలీవుడ్ సినిమాకు సంబంధించి చర్చలు జరుగుతున్నాయి

**సిక్స్‌ప్యాక్ కోసం కసరత్తులు**

పదిహేను రోజుల విహారయాత్ర తర్వాత ఇటీవలే హైదరాబాద్‌కు వచ్చాను. కొన్నాళ్లుగా ఆహార నియమాలు పాటించకపోవడంతో ఐదారు కేజీల బరువు పెరిగాను. వర్కవుట్స్ చేయడానికి సిద్ధమయ్యాను. పూరి జగన్నాథ్ సినిమా యాక్షన్ హంగులతో సాగుతుంది. ఈ చిత్రం కోసం సిక్స్‌ప్యాక్ కోసం ట్రై చేస్తున్నాను. కానీ కుదురుతుందో లేదో తెలియదు

**అమ్మ సూపర్ హీరో..**

నా జీవితానికి సంబంధించి మా అమ్మే సూపర్ హీరో. నేను వేసే ప్రతి అడుగులో మా అమ్మానాన్నల ఆలోచన విధానం కనిపిస్తుంది. విదేశాల్లో పిల్లల పెంపకంలో స్వేచ్ఛ ఎక్కువగా కనిపిస్తుంది. కానీ మన దగ్గర మాత్రం ఓ వయసు తర్వాత తల్లిదండ్రులకు పిల్లలే ప్రపంచంగా మారిపోతారు. నా జీవితానికి అమ్మ సూపర్ హీరోగా ఉంటే నాన్న ఓ కోలిగ్‌గా ఉన్నారు. డిస్నీ ఇండియా ఇండియాహెడ్ విక్రమ్ దుగ్గల్ మాట్లాడుతూ ''టెర్మినేటర్' సిరీస్ చిత్రాల్లో జేమ్స్ కామెరూన్, ఆర్నాల్డ్ కలయికలో ఇరవై ఎనిమిదేళ్ల వస్తున్న సినిమా ఇది. హాలీవుడ్‌లో ఇదివరకెన్నడూ చూడని యాక్షన్ హంగులతో ఈ సినిమా రొమాంచితంగా ఉంటుంది. సొంతం భాషలో సినిమాను చూడటంలోనే ఎక్కువ ఆనందం ఇమిడి వుంటుంది. ఆ ఆలోచనతోనే తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఈ సినిమాను అనువదిస్తున్నాం' అని చెప్పారు.




వర్ధన్ దేవరకొండ, సునీల్ నారంగ్, మహేష్‌బాబు, అనసూయ, షమ్మీర్ సుల్తాన్, తరుణ్, విజయ్, ఆనంద్



చిరంజీవిప్రసాద్, మదూరి మధు, సీహెచ్ శ్రీనివాస్, సతీష్ ఓరుగంటి, నగేష్ బీరెడ్డి, కట్టా శేఖర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి

# 'సైరా'తో దక్కిన గొప్ప గౌరవమిది

### 'నమస్తే తెలంగాణ' గెస్ట్ ఎడిటర్‌గా దర్శకుడు సురేందర్‌రెడ్డి

స్టార్ట్.. కెమెరా.. యాక్షన్.. అంటూ తన సృజనతో వెండితెరపై పాత్రలకు ప్రాణం పోసే దర్శకుడు సురేందర్‌రెడ్డి కలం పట్టారు. కెప్టెన్ కుర్చీని పక్కనపెట్టి ఎడిటర్ కుర్చీలో ఆసీనుడైన ఆయన గెస్ట్ ఎడిటర్‌గా నమస్తేతెలంగాణ దిన పత్రిక బాధ్యతల్ని కొద్ది సేపు నిర్వర్తించారు. చారిత్రక కథాంశంతో తెరకెక్కిన 'సైరా నరసింహారెడ్డి' చిత్రాన్ని అసమాన సృజనాత్మకతో వెండితెరపై దృశ్యమానం చేసి దర్శకుడిగా యావత్ తెలుగు ప్రేక్షకులందరిచేత ప్రశంసలందుకుంటున్నారు సురేందర్‌రెడ్డి. ప్రముఖ కథానాయకుడు చిరంజీవి ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం చక్కటి వసూళ్లను సాధిస్తున్నది. ఈ అసమాన విజయంతో ద్విగుణీకృత ఉత్సాహంతో ఉన్న దర్శకుడు సురేందర్‌రెడ్డి బుధవారం నమస్తే తెలంగాణ దిన పత్రిక ప్రధాన కార్యాలయానికి వచ్చారు. నమస్తే తెలంగాణ పత్రికకు కొద్ది సేపు ఆయన గెస్ట్ ఎడిటర్‌గా ఉన్నారు. 'సైరా' రూపకల్పనలో తాను చేసిన పరిశోధన, చిత్రీకరణలో ఎదురైన అనుభవాల్ని నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డితో పంచుకున్నారు. నమస్తే తెలంగాణ దిన పత్రికకు గెస్ట్ ఎడిటర్‌గా పనిచేసే అవకాశం లభించడం తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానని సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. 'సైరా' కథ కోసం పరిశోధన చేస్తున్న క్రమంలో చారిత్రక అంశాలకు సంబంధించి మరుగున పడిన ఎన్నో సత్యాల్ని తెలుసుకోగలిగానని పేర్కొన్నారు. డబ్బుల కోసం కాకుండా నటుడిగా తన కెరీర్‌లో మరపురాని సినిమా చేయాలనే తపనతో చిరంజీవి చేసిన సినిమా ఇదని, ఆయన కెరీర్‌లో చిరస్థాయిగా 'సైరా' నిలిచిపోతుందని సురేందర్‌రెడ్డి చెప్పారు. హిట్స్, బ్లాక్ బస్టర్స్‌కు మించి దర్శకుడిగా ఓ చక్కటి సినిమా చేశాననే గుర్తింపును తనకు తెచ్చిపెట్టిందని అన్నారు. హైదరాబాద్ సంస్థాన విలీనానికి సంబంధించి 13 నెలల సంధికాలంతో పాటు తెలంగాణ సాయుధ పోరాటం, రజాకార్ల ఉద్యమ నేపథ్య ఇతివృత్తాల్ని వెండితెరపై ఆవిష్కరించడానికి ఇదే సరైన సమయమని అభిప్రాయపడ్డారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి రోజున కాకతాళీయంగా ఈ సినిమాకు అంకురార్పణ పడిందని చెప్పారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డిని ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి శాలువాతో సత్కరించారు. అనంతరం నమస్తే తెలంగాణ బృందంతో కలిసి సక్సెస్ కేక్‌ను కట్‌చేశారాయన. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ జీఎం సీహెచ్ శ్రీనివాస్, స్టేట్ బ్యూరో ఛీఫ్ సతీష్ ఓరుగంటి, ఫీచర్స్ ఎడిటర్ నగేష్ బీరెడ్డి, సినిమా డెస్క్ ఇన్‌ఛార్జి మధు మదూరి, సిటీడెస్క్ ఇన్‌ఛార్జి చిరంజీవి ప్రసాద్ పాల్గొన్నారు.




నమస్తే తెలంగాణ ప్రధాన కార్యాలయంలో గెస్ట్ ఎడిటర్‌గా బాధ్యతల్ని నిర్వర్తిస్తున్న దర్శకుడు సురేందర్‌రెడ్డి

# నా మనసుకు నచ్చిన కథ మీకు నచ్చుతుంది!

'విజయ్ దేవరకొండ నిర్మాత, తరుణ్‌భాస్కర్ హీరో..అని వినగానే కొత్తగా అనిపించింది. కాన్సెప్ట్ కూడా ఎంటర్‌టైనింగ్‌గా, ఆసక్తిగా అనిపిసున్నది' అన్నారు కథానాయకుడు మహేష్‌బాబు. యువ హీరో విజయ్ దేవరకొండ నిర్మాతగా కింగ్ ఆఫ్ ద హిల్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై తరుణ్ భాస్కర్ హీరోగా రూపొందిస్తున్న 'మీకు మాత్రమే చెప్తా' ట్రైలర్‌ను బుధవారం మహేష్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేష్‌బాబు మాట్లాడుతూ ''పెళ్లి చూపులు' నాకు బాగా నచ్చిన సినిమా. విజయ్ చేస్తున్న ఈ ప్రయత్నం విజయవంతం కావాలని కోరుకుంటున్నాను' అన్నారు. కాన్సెప్ట్ నచ్చి ఈ సినిమాను నిర్మిస్తున్నానని, నిర్మాణ బాధ్యతలు నాన్న గారు వర్ధన్ దేవరకొండ తీసుకున్నారని విజయ్ దేవరకొండ తెలిపారు. మహేష్ చేతుల మీదుగా ఈ ట్రైలర్ విడుదల కావడం ఆనందంగా వుందని, నా మనసుకు నచ్చిన ఈ సినిమా అందరికి నచ్చుతుందని ఆయన పేర్కొన్నారు. తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో హీరోగా కాకుండా ఆర్టిస్ట్‌గానే భావిస్తున్నాను. దర్శకుడు షమ్మీర్ సుల్తాన్ చిత్రాన్ని ఆసక్తికరంగా మలిచాడు' అని తెలిపారు. కథ తనలో ఆసక్తిని రేకెత్తించిందని, తరుణ్ హీరో అనగానే మరింత ఇంట్రెస్టింగ్ అనిపించి ఈ చిత్రాన్ని ఒప్పుకున్నానని అనసూయ భరద్వాజ్ తెలిపింది. ఈ కార్యక్రమంలో అభినవ్ గోమటం, వాణిభోజన్, షమ్మీర్ సుల్తాన్, నవీన్ జార్జ్ థామస్ తదితరులు పాల్గొన్నారు. అవంతిక, మిశ్రా, వినయ్‌వర్మ, జీవన్ ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మదన్ గుణదేవా, సంగీతం: శివకుమార్, లైన్ ప్రొడ్యూసర్: విజయ్ మట్టపల్లి, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: అనురాగ్ పర్వతనేని.

# డీ గ్లామర్ లుక్‌లో

కీర్తిసురేష్ కథానాయికగా నగేష్ కుకునూర్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్నది. దిల్‌రాజు సమర్పణలో సుధీర్‌చంద్ర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆది పినిశెట్టి, జగపతిబాబు కీలక పాత్రల్ని పోషిస్తున్నారు. గురువారం కీర్తిసురేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆమె లుక్‌ను చిత్రబృందం విడుదలచేసింది. ఇందులో ముక్కు పుడక, చేతికి వెండి కడియాలు ధరించి మెడలో పూసల దండతో డీ గ్లామర్ లుక్‌లో చిరునవ్వులు చిందిస్తూ సరికొత్తగా కనిపిస్తున్నది కీర్తిసురేష్. 'స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న చిత్రమిది. చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నది. నవంబర్ 11 నుంచి హైదరాబాద్‌లో చివరి షెడ్యూల్‌ను తెరకెక్కిస్తాం. త్వరలో ఫస్ట్ లుక్, టైటిల్ విడుదలచేస్తాం' అని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, సినిమాటోగ్రఫీ:చిరంతన్‌దాస్, సమర్పణ: దిల్ రాజు(శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్), సహనిర్మాత: శ్రావ్య వర్మ.



కీర్తిసురేష్

# రొమాంటిక్‌లో రమ్యకృష్ణ



ఆకాష్‌పూరి, కేతికా శర్మ జంటగా నటిస్తున్న చిత్రం 'రొమాంటిక్'. అనిల్ పాదూరి దర్శకుడు. పూరి జగన్నాథ్ టూరింగ్ టాకీస్, పూరి కనెక్ట్స్ పతాకాలపై పూరి జగన్నాథ్, ఛార్మి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో సీనియర్ కథానాయిక రమ్యకృష్ణ కీలక పాత్రను పోషించనున్నారు. పూర్తి నిడివి కలిగిన శక్తివంతమైన పాత్రలో ఆమె కనిపించన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇది. ప్రేమపయనంలో ఓ యువ జంటకు ఎదురయ్యే మధురభావనలకు అందమైన దృశ్యరూపంగా ఉంటుంది. రమ్యకృష్ణ పాత్ర నవ్యరీతిలో సాగుతుంది. మంగళవారం నుంచి ఆమె చిత్రీకరణలో భాగమయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నాం. ఇటీవల విడుదలచేసిన ఫస్ట్‌లుక్‌కు చక్కటి స్పందన లభిస్తున్నది' అని తెలిపారు. ఈ చిత్రంలో ఉత్తేజ్, సునయన ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.

# సరోవరంలో ఏం జరిగింది?



ప్రియాంకశర్మ, విశాల్

విశాల్, ప్రియాంకశర్మ జంటగా నటిస్తున్న చిత్రం 'సరోవరం'. సురేష్ యడవల్లి దర్శకుడు. ఎస్.శ్రీలత నిర్మిస్తున్నారు. ఈ నెల 18న విడుదలకానుంది. మంగళవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక జరిగింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'సరోవరం అనే పల్లెటూరిలో జరిగే కథ ఇది. యథార్థ అంశాల స్ఫూర్తితో తెరకెక్కిస్తున్నాం. ఆద్యంతం ఊహకందని మలుపులతో ఉత్కంఠను పంచుతుంది' అని తెలిపారు. ప్రేమ, యాక్షన్, హారర్, థ్రిల్లర్ హంగుల కలబోతగా ఈ సినిమా ఉంటుందని, చిన్న సినిమాల్లో పెద్ద విజయాన్ని సాధిస్తుందనే విశ్వాసముందని నిర్మాత చెప్పారు. 'సరోవరం అనే ఊరిలో ఏం జరిగింది? అతీంద్రియ శక్తులపై ఓ యువకుడు తన మనోసంకల్పంతో ఎలాంటి పోరాటం సాగించాడనేది చిత్ర ఇతివృత్తం. రెగ్యులర్ హారర్ సినిమాలకు భిన్నంగా ఉంటుంది' అని హీరో విశాల్ అన్నారు.

# పారితోషికం అడగకుండానే..

'రెండు గంటల పాటు ప్రేక్షకుల్ని మనస్ఫూర్తిగా నవ్వించే చిత్రమిది. ఇద్దరు సోదరుల్లో అశ్విన్‌ను హీరోగా, కల్యాణ్‌ను మంచి నిర్మాతగా చూడాలనే నా కల ఈ సినిమా ద్వారా నెరవేరనున్నది' అని అన్నారు ఓంకార్. ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'రాజుగారిగది-3'. అశ్విన్‌బాబు, అవికాగోర్ జంటగా నటించారు. ఓక్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించింది. ఈ నెల 18న విడుదలకానుంది. బుధవారం హైదరాబాద్‌లో చిత్రబృందం పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటుచేసింది. ఈ సందర్భంగా ఓంకార్ మాట్లాడుతూ 'పారితోషికం ఎంత కావాలో అడగకుండానే మాపై నమ్మకంతో సినిమాటోగ్రాఫర్ ఛోటా.కె.నాయుడు ఈ సినిమా చేశారు. తెలంగాణ, ఏపీ హక్కులను సినిమా చూడకుండానే వరంగల్ శ్రీను తీసుకున్నారు. పతాక ఘట్టాల్లో అవికా గోర్ నటన అలరిస్తుంది. ఈ నెల 18న సక్సెస్ రూపంలో మేమంతా పెద్ద బహుమతిని అందుకోనున్నామనే నమ్మకముంది' అని తెలిపారు. 'ఇస్మార్ట్‌శంకర్', 'వాల్మీకి' తర్వాత తాను పంపిణీచేస్తున్న చిత్రమిదని, ఈ సినిమాతో తనకు హ్యాట్రిక్ హిట్ దక్కుతుందని భావిస్తున్నానని వరంగల్ శ్రీను పేర్కొన్నారు. అందరితో పాటు తాను సినిమాను థియేటర్‌లో చూడటానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని, ప్రతి ఒక్కరూ సొంత సినిమాననే ఆలోచనతో కష్టపడి,ఇష్టపడి పనిచేశారని అశ్విన్ అన్నారు. ఛోటా కె నాయుడు మాట్లాడుతూ 'పక్కా మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ ఇది. భయపెడుతూనే కడుపుబ్బా నవ్విస్తుంది' అని తెలిపారు. తన కెరీర్‌లో ప్రత్యేకమైన చిత్రమిదని అవికాగోర్ చెప్పింది. ఈ కార్యక్రమంలో కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



అవికాగోర్



ఓంకార్, అశ్విన్‌బాబు

